thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 117 కరీంనగర్ ఆదివారం, 6 జులై 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## భారత్‌పై 15 లక్షల సైబర్ అటాక్స్ చేసిన పాక్..

భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ అన్ని రకాలుగా కుట్రలు చేస్తూనే ఉంది. ఓ వైపు పాకిస్తాన్ ఆర్మీ కాల్పుల విరమణకు తూట్లు పొడుస్తూ .. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడుతూ ఉంది. మరో వైపు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు అమయాక భారతీయుల్ని పొట్టనపెట్టుకుంటూ ఉన్నారు. ఈ రెండు రకాలుగానే కాకుండా .. మూడో రకంగా కూడా భారత్‌ను దెబ్బ తీయడానికి పాక్ కుట్రలు చేస్తూనే ఉంది. ఎవ్వరూ ఊహించని విధంగా భారీ స్థాయిలో సైబర్ అటాక్స్‌కు పాల్పడుతోంది. పహల్గామ్ టెర్రర్ అటాక్ తర్వాత పాకిస్తాన్‌కు చెందిన హ్యాకర్లు దేశ వ్యాప్తంగా 15 లక్షల సైబర్ అటాక్స్ జరిపినట్లు తేలింది.




## ప్రియుడితో మాట్లాడొద్దన్నందుకు పీక పిసికి చంపింది

హైదరాబాద్ జులై, 5: ప్రియుళ్ల మోజులో పడి.. కట్టుకున్న భర్తల్ని ఇటీవలి కాలంలో కొంత మంది భార్యలు చంపేస్తున్నారు. వాళ్లంతా కిరాయి మూకలతోనో, ప్రియుళ్ల సాయంతోనో భర్తల్ని పరలోకాలకు పంపించారు. ఇవాళ హైదరాబాద్‌లోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లిలో ఒక భార్య దీనికి భిన్నంగా చేసింది. ఎవరి సాయం తీసుకోకుండా అర్ధరాత్రి స్వయంగా ఆమె చేతులతోనే భర్త పీక పిసికి ప్రాణాలు తీసేసింది. అయితే, ఆ సమయంలో భర్త ఫుల్ గా మద్యం సేవించి ఉండటంతో పెద్దగా ఇబ్బంది పెట్టకుండానే ప్రాణాలొదిలాడు. అంతే, వాల్యూమ్ 2 స్టార్ట్ చేసింది ఆ ఇల్లాలు. అయ్యనా దేవుడో అంటూ.. దిక్కులు పెక్కటిల్లేలా ఏడ్వటం మొదలుపెట్టింది. నీకు అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా పతిదేవుడో అంటూ గగ్గోలు పెట్టింది.. ఏం కష్టమొచ్చిందని ప్రాణాలు తీసుకున్నావు మహానుభావా అంటూ సందట్లో సడేమియా చేసి, గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని స్వగ్రామం నారాయణపేటకు తీసుకెళ్లి.. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసింది. ఇంతవరకూ బాగానే నెట్టుకొచ్చింది కాని, ఎక్కడైనా కొంచెం డోసు ఎక్కువైందో ఏమోకాని, మృతుడి భార్య ప్రవర్తనపై బంధువులకు కాస్త అనుమానం వచ్చింది. శవాన్ని పరీక్షగా చూడ్డం మొదలు పెట్టి మొత్తానికి పసిగట్టారు. అంజిలప్ప గొంతుపై ఉన్న మరకలను చూసి భర్త గొంతు నొక్కేసి చంపేసుంటుందని రూఢీ చేసుకుని పోలీసుల్ని పిలిచారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి భార్య రాధను ప్రశ్నించారు. ఆమెపై అనుమానంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా.. ఆమె అసలు విషయం చెప్పేసింది. ఇక, దారుణానికి సంబంధించిన పూర్వాపరాల్లోకి వెళ్తే, మహబూబ్‌నగర్ జిల్లా రామకృష్ణయ్యపల్లికి చెందిన అంజిలప్పతో రాధ అనే మహిళకు 2014లో పెళ్లైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని.. ఓ నిర్మాణ సంస్థలోభార్యాభర్తలిద్దరూ కూలీలుగా చేరి.. అక్కడే గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా రాధ ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం నడుపుతోంది. అయితే అలాంటివి వద్దని, అతనితో ఫోన్ మాట్లాడొద్దని భర్త అంజిలప్ప ఆమెను మందలించాడు. దీంతో అంజిలప్పపై కోపం పెంచుకున్న రాధ.. జూన్ 22న అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న తన భర్త గొంతు నులిమి హత్య చేసింది. పోలీసుల విచారణలో అంజిలప్పను తానే హత్య చేసినట్లు రాధ అంగీకరించిందని.. దీంతో ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.




హైదరాబాద్, జులై 5: రైతులకు ఎవరు ఏం చేశారో చర్చిద్దామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి కేటీఆర్ ఛాలెంజ్ విసిరారు. ఈరోజు (శనివారం) మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 8న ఉదయం 11 గంటలకు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. 72 గంటల సమయం ఇస్తామని.. సీఎం రేవంత్ రెడ్డి ప్రిపేర్ అయ్యి రావాలన్నారు. పేటీఎం మాదిరి.. పే సీఎంగా రేవంత్ పేరు సంపాదించారని విమర్శించారు. రైతుబంధును కాంగ్రెస్ ప్రభుత్వం ఖచ్చితంగా ఎగ్గొడుతోందని మండిపడ్డారు. అన్నదాతకు సున్నం పెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమంటూ విరుచుకుపడ్డారు. రైతు సమస్యలపై చింతమడకకు, కొండారెడ్డిపల్లె అయినా సరే.. రేవంత్ రెడ్డితో చర్చకు రెడీ అని స్పష్టం చేశారు. నిజం ఒప్పుకోని వాడిని.. నటించే వాడిని రేవంత్ రెడ్డి అంటారు అంటూ ఓ రేంజ్‌లో ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలను తాను ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల కల్పనపై అశోక్ నగర్‌లో నిరుద్యోగుల మధ్య చర్చకు రావాలని సవాల్ చేశారు. నాలుగు వేల పెన్షన్, రూ. 2,500 కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థల్లో సీఎం సొంత నియోజకవర్గంలో జెడ్పీటీసీ కూడా కాంగ్రెస్ గెలవదన్నారు. 'వందనా.. వాళ్ళ బొందనా? వంద సీట్లు కాంగ్రెస్ ఎలా గెలుస్తుంది. వంద గెలవాలంటే.. ముందు ప్రజలు ఓట్లు వేయాలి కదా. రేవంత్ రెడ్డి దండుపాళ్యం గ్యాంగ్ మాత్రమే తెలంగాణలో జోరు మీదుంది. గుడ్డలు ఊడదీస్తేనే ఇందిరమ్మ గొప్పతనం తెలుస్తుందని రేవంత్ చెప్పటం సిగ్గుచేటు. రేవంత్‌కు బేసిన్ తెలియదు.. బెండకాయ తెలియదు' అంటూ ఎద్దేవా చేశారు. ఎరువులు ఇవ్వటం చేతకాని వాడికి కేసీఆర్‌తో చర్చ ఎందుకని నిలదీశారు. ఏ రైతు, ఏ ఎద్దును అడిగినా వ్యవసాయాన్ని పండుగ చేసింది కేసీఆర్ అని చెప్తారన్నారు. వ్యవసాయం మాత్రమే కాదు.. మత్స్య సంపదను సృష్టించిందే కేసీఆర్ అని అన్నారు. హారతులు పట్టి ఆంధ్రాకు నీటిని పంపిందే కాంగ్రెస్ నేతలు అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.




## మంత్రి సీతక్కకు మావోయిస్టుల మరో లేఖ.. ఈసారి ఏం చెప్పారంటే..

వరంగల్: తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ను హెచ్చరిస్తూ వారం క్రితం మావోయిస్టులు విడుదల చేసిన లేఖ సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా మావోయిస్టు పార్టీ ఆ లేఖ తాము రాయలేదంటూ మరో సంచలన లేఖ విడుదల చేశారు.

**ఆ లేఖ మేము రాయలేదు..** మంత్రి సీతక్కను హెచ్చరిస్తూ మావోయిస్టులు రిలీజ్ చేసిన లేఖపై మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ క్లారిటీ ఇచ్చారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేరుతో 26.06.2025న మంత్రి సీతక్కకు వచ్చిన లేఖ తాము రాయలేదని జగన్ చెప్పారు. తమ పార్టీకీ, ఆ లేఖకు ఎలాంటి సంబంధం లేదని తాజా లేఖలో స్పష్టం చేశారు. అలాగే మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడే చొక్కారావ్ లొంగుబాటులో వాస్తవం లేదని తెలిపారు. అణచివేతలతో మావోయిస్టు పార్టీని నిర్మూలించడం సరైన పద్ధతి కాదని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో తమ పార్టీ కార్యకలాపాలు లేకపోయినప్పటికీ తమకు సహకారం అందించే ప్రజలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు చెబుతున్నారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఆదివాసీలను పోలీస్ స్టేషన్ కు రప్పించి బెదిరింపులకు గురిచేస్తున్నారని.. ఈ విషయాన్ని తెలంగాణ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ఆపాలని, కుమురం భీమ్ జిల్లాలో 339 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించేందుకు తెచ్చిన జీవో నెం.49ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి సీతక్కకు వారం కిందట మావోయిస్టుల పేరుతో విడుదలైన ఓ లేఖ చర్చనీయాంశమైంది. ఆదివాసీ హక్కులను కాలరాస్తూ వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా.. ఉద్యమ నేపథ్యం మర్చిపోయి మంత్రి సీతక్క మౌనంగా ఉన్నారంటూ లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలక మంత్రి పదవిలో ఉండి కూడా ఆ పనులకు అండగా ఉండటంలో విఫలమయ్యారని తీవ్ర విమర్శలు గుప్పించారు.

# డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్..




## 10 నుంచి అకౌంట్‌లోకి వడ్డీ లేని రుణాలు!

### మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, జులై 5: ఆర్టీసీలో 151 మండల మహిళా సంఘాల గ్రూప్‌లకు (అద్దె బస్సుల యజమానులకు) రూ.1.05 కోట్ల రూపాయల చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క అందజేశారు. అనంతరం మహిళా రచయితలు, కవులు రాసిన మహాలక్ష్మి (మహిళా సాధికారత లో ప్రగతి చక్రాలు) పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మహిళా సమాఖ్యలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోందని.. ఇప్పటికే మహిళల అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు.

అవకాశాలు ఉన్న ప్రతీ దగ్గర వ్యాపారం కోసం మహిళా సమాఖ్యలకు ఇస్తామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరీమణుల ను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను గ్రౌండ్ లెవెల్లో తెలిసేలా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఈనెల 10 నుంచి 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వడ్డీలేని రుణాల చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలదన్నారు. కుటుంబ పెద్దలు ఆర్థికంగా ఎదిగేలా చేస్తే.. రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా అభివృద్ధిలో తెలంగాణను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

**నష్టాల నుంచి లాభాల్లోకి ఆర్టీసీ: మంత్రి పొన్నం....** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ మరోసారి బతికిందన్నారు. త్వరలోనే దాదాపు 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసిన రికార్డు నమోదు కాబోతుందని తెలిపారు. 6500 కోట్ల రూపాయల విలువైన ఉచిత ప్రయాణం నమోదు కాబోతుందని.. ఈ డబ్బులను ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించిందని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ మహాలక్ష్మి పథకం విజయవంతం కావడం కోసం డ్రైవర్లు, కండక్టర్‌లు చాలా కష్టపడుతున్నారని వారికి అభినందనలు తెలియజేశారు. ఆర్టీసీలో కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని.. కొత్త నియామకాలు చేస్తున్నామని చెప్పారు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ ఉచిత బస్సును వాడుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వెళ్తోందని మంత్రి ప్రభాకర్ వెల్లడించారు.

**మహిళల ఎదుగుదలే సమాజ ఎదుగుదల: మంత్రి సీతక్క...** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 24 గంటల్లోపే మహిళలకు ఉచిత బస్సు పథకం తెచ్చిందని మంత్రి సీతక్క అన్నారు. ఉచిత ప్రయాణమే కాదు మహిళలను బస్సులకు ఓనర్లను చేసిందన్నారు. మహిళల ఎదుగుదలనే సమాజ ఎదుగుదల అని చెప్పుకొచ్చారు. ఆ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గతంలో పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని.. వడ్డీలేని రుణాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళల అనుభవాలను తెలిపే పుస్తకం ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. మండల సమాఖ్యలో ఉన్న మహిళల కోరికలు నెరవేరుతున్నాయన్నారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని మంత్రి చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి 25 వేల కోట్ల రుణాలను మహిళా సంఘాలు పొందాయని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లిస్తుండడంతో బ్యాంకులు ఇబ్బందులు లేకుండా రుణాలు ఇస్తున్నాయన్నారు. మహిళలందరూ ఎల్లుండి నుంచి సంబరాలు చేయాలని.. ప్రభుత్వ ప్రోత్సహకాలన్నీ సంఘాలు ఉపయోగించుకోవాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.




# నిరుద్యోగులకు భారీ శుభవార్త!

## త్వరలోనే 5 జాబ్ నోటిఫికేషన్లు వస్తున్నాయ్!!

హైదరాబాద్, జులై 5: తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగులకు మరో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసేందుకు టీజీపీఎస్సీ సమాయాత్తమవుతోంది. పాఠశాల విద్యాశాఖ పరిధిలో దాదాపు 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల (డిప్యూటీ ఈఓ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు 110 అధ్యాపకులు, 8 పీడీ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఈ పోస్టుల భర్తీకి త్వరలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు విద్యాశాఖ ఇప్పటికే టీజీపీఎస్సీకి అందించింది. నిజానికి, పాఠశాల విద్యాశాఖ పరిధిలో డిప్యూటీ ఈఓలు, ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలలు, ఎస్‌సీఈఆర్‌టీలోని అధ్యాపకులు, సీనియర్ అధ్యాపకులతోపాటు మొత్తం 134 పోస్టులను టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ 2022లోనే అనుమతి ఇచ్చింది. ఇందులో 24 డిప్యూటీ ఈఓ, 110 అధ్యాపక, సీనియర్ అధ్యాపక పోస్టులు ఉన్నాయి. ఈ 134 పోస్టులతో పాటు తాజాగా దోమలగూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో 8 ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పోస్టులు భర్తీ చేసేందుకు కమిషన్‌కు ప్రతిపాదనలు అందాయి. మొత్తంగా 142 పోస్టులకు త్వరలోనే 5 వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ఉమ్మడి తెలంగాణ పరిధిలో మొత్తం 72 డిప్యూటీ ఈఓ పోస్టులు ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో కేటాయించారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో రెవెన్యూ డివిజన్లు రెండే ఉన్నప్పటికీ.. జనాభా, పాఠశాలలు సంఖ్య ఎక్కువగా ఉన్నాయి. దీంతో హైదరాబాద్ ఒక్క జిల్లాకే ఏకంగా 12 పోస్టులు రానున్నాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్లు పెరిగాయి. దీంతో 28 పోస్టులను మంజూరు చేయాలని 4 రోజుల క్రితం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం 33 జిల్లాలకు కలిపి కేవలం 12 డీఈఓ పోస్టులే ఉన్నాయి. అదనంగా మరో 21 పోస్టులను మంజూరు చేయాలనీ ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా త్వరలోనే 28 డిప్యూటీ ఈఓ, 21 డీఈఓ పోస్టుల భర్తీకి ప్రకటన రానుంది.

చురకలు





## 6 వందల రోజులు.. హామీలు అమలుకాలేదు

హైదరాబాద్: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. 2023 ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన 6 గ్యారంటీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేసి తీరుతామని చెప్పి.. 600 రోజులైనా (దాదాపు 20 నెలలు) అమలు చేయలేదని విమర్శించారు. 6 గ్యారంటీల్లో భాగంగా 63 అనుబంధ హామీలను ప్రకటిస్తూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంతకాలతో ఊరూరా కరపత్రాలు పంచారని ఎద్దేవా చేశారు. అన్ని వార్తా పత్రికల్లో మొదటి పేజీల్లో ప్రకటనలు సైతం ఇచ్చారని గుర్తు చేశారు. అయినప్పటికీ ఏ ఒక్క గ్యారంటీని పూర్తిగా అమలు చేయలేదన్నారు. తమను మోసం చేశారని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారని రామచందర్‌రావు లేఖలో పేర్కొన్నారు.



## రూ.15 వేల కోట్ల వారసత్వ ఆస్తి.. సైఫ్‌కు చుక్కెదురు

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. మధ్యప్రదేశ్‌లోని తన పూర్వీకుల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా పేర్కొనాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సైఫ్ అలీఖాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆయన కుటుంబానికి చెందిన రూ.15,000 కోట్ల ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీగా నిర్ణయిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

అంతేకాకుండా ఈ విషయంపై మరోసారి విచారణ జరపాలని, ఏడాదిలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. తాజా పరిణామంతో ఆ ఆస్తుల యాజమాన్య హక్కులపై సందిగ్ధం నెలకొంది. భోపాల్‌లో సైఫ్ కుటుంబానికి అతడి నాన్నమ్మ సాజిదా సుల్తాన్ నుంచి పలు విలాసవంతమైన భవంతులు వారసత్వంగా వచ్చాయి. భోపాల్ చివరి నవాబు హమీదుల్లా ఖాన్ కుమార్తె సాజిదా. ఆయన పెద్ద కుమార్తె అబీదా సుల్తాన్ దేశ విభజన నేపథ్యంలో 1950లో పాకిస్థాన్‌కు వలస వెళ్లారు. సాజిదా ఇక్కడే నివసిస్తూ పటౌడీ నవాబు అయిన ఇఫ్తిఖర్ అలీఖాన్(సైఫ్ తాత)ను వివాహమాడారు. సాజిదాకు ఆమె తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులు కాలక్రమంలో ఆమె వారసులైన సైఫ్ కుటుంబానికి దక్కాయి. అయితే హమీదుల్లాకు చట్టబద్ధ వారసురాలు అబీదా మాత్రమే అని, ఆమె పాక్‌కు వలస వెళ్లినందువల్ల ఎనిమీ యాక్ట్ ప్రకారం ఆ ఆస్తులను కాందిశీకుల ఆస్తులుగా గుర్తిస్తున్నట్లు కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ కార్యాలయం 2015లో ప్రకటించింది. దీన్ని సవాలు చేస్తూ సైఫ్ కుటుంబసభ్యులు మధ్యప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ వేశారు.



## సామాజిక మాధ్యమాల విషయంలో జాగ్రత్త


హైదరాబాద్: చిన్నారులు, మహిళల భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు అండగా ఉంటున్నట్లు చెప్పారు. 'లైంగిక దాడుల బాధిత చిన్నారుల రక్షణ, భద్రత' అంశంపై హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్నారులపై లైంగిక హింసను అందరూ ఖండించాలన్నారు. ఇలాంటి కేసుల్లో నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సదస్సులో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్, హైకోర్టు న్యాయమూర్తులు, డీజీపీ జితేందర్, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## మరో 40 ఏళ్లు జీవించాలని ఆశగా ఉంది


టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని..ఆయన ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తన మనసులోని మరో విషయాన్ని బయటపెట్టారు. జులై 6న తన 90వ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోనున్న నేపథ్యంలో.. ఆయన అనుచరులు దలైలామా దీర్ఘాయుష్షు కోసం పలు ప్రార్థనలు నిర్వహించారు. అందులోభాగంగా టిబెట్ బౌద్ధమత గురువు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తూ మరో 30-40 ఏళ్లు జీవించాలని ఉందనే తన ఆకాంక్షను వ్యక్తంచేశారు. మరికొన్నేళ్లు ఆరోగ్యంగా జీవించగలననే దేవుని స్పష్టమైన సంకేతాలు తనకు అందుతున్నాయన్నారు. బుద్ధుని బోధనల వ్యాప్తికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. గతంలోనూ దలైలామా తన ఆయుష్షు గురించి మాట్లాడుతూ..తాను 110 ఏళ్లు జీవిస్తానని ఓ కల వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 90 ఏళ్లు నిండటంతో 15వ దలైలామా ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని.. దానిని నిర్వహించే అధికారం గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్‌కు మాత్రమే ఉందని ఇటీవల టిబెట్ బౌద్ధమత అత్యున్నత గురువు దలైలామా తేల్చిచెప్పారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. 2011 సెప్టెంబర్ 24నే తాను టిబెట్ బౌద్ధ మత పెద్దలు, నాయకులు, ఇతర సంస్థలతో భేటీ నిర్వహించి.. తన వారసుడి ఎంపిక కొనసాగించాలా..?అనే అంశంపై అభిప్రాయాలు కోరినట్లు పేర్కొన్నారు. దీనికి అన్నివర్గాల నుంచి సానుకూల స్పందనలు వచ్చాయన్నారు.

ఈ విషయంలో జోక్యం చేసుకొనే అధికారం ఎవరికీ లేదని చైనాను ఉద్దేశించి అన్నారు. కాగా.. టిబెట్‌పై పట్టు కోసం భవిష్యత్తులో దలైలామా స్థానాన్ని కబ్జా చేయాలని చైనా భావిస్తోంది. ఆ స్థానం ఎంపికలో పంచయిన్ లామా పాత్ర చాలా కీలకం. టిబెట్‌లోనే ఉండిపోయిన పంచయిన్ లామా 1989లో అనుమానాస్పద స్థితిలో మరణించారు. ఆయనపై విష ప్రయోగం చేశారంటారు. పంచయిన్ లామా వారసుడిగా ఎంపికైన బాలుడిని తన అధీనంలో ఉంచుకొన్నట్లు కొన్నేళ్ల కిందట బీజింగ్ ప్రకటించింది. ఈ ఎత్తుగడలను గ్రహించిన దలైలామా తన పునర్జన్మ టిబెట్ బయట కూడా జరగొచ్చని ప్రకటించారు. దీంతోపాటు వారసుడిని (పునర్జన్మ పొందిన బాలుడిని) ఎంపిక చేసే ప్రక్రియ కూడా తమదేనని తేల్చిచెప్పారు.




## వాణిజ్య కేంద్రాల్లో రోజుకు 10 గంటల పనికి అనుమతి

హైదరాబాద్: వాణిజ్య కేంద్రాల్లో ఉద్యోగుల పని వేళల పరిమితిని తెలంగాణ ప్రభుత్వం సవరించింది. రోజుకు 10 గంటల వరకు పని చేసేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వారంలో పని వేళలు 48 గంటలు మించరాదని స్పష్టం చేసింది. పరిమితి దాటితే ఓటీ వేతనం చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజులో 6 గంటల్లో కనీసం అరగంట విశ్రాంతి ఇవ్వాలని, విశ్రాంతితో కలిపి 12 గంటల కంటే ఎక్కువ పని చేయించరాదని ఆదేశించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా పని వేళలు సవరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.



## ఆసుపత్రి నుంచి కేసీఆర్ డిశ్చార్జి

హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఆయన గురువారం ఆసుపత్రిలో చేరారు. బ్లడ్ షుగర్, సోడియం స్థాయులు మానిటర్ చేయడానికి ఆసుపత్రిలో చేరాల్సిందిగా వైద్యులు సూచించారు. దీంతో ఆయన రెండు రోజులు అక్కడే ఉండి చికిత్స పొందారు. ప్రస్తుతం కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో ఈరోజు ఉదయం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి నందినగర్‌లోని నివాసానికి వెళ్లారు.

వారం రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని కేసీఆర్‌కు వైద్యులు సూచించారు. తర్వాత మళ్లీ పరీక్షలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. వైద్య పరీక్షల కోసం గురు, శుక్రవారాల్లో మరోసారి కేసీఆర్ యశోద ఆసుపత్రికి వెళ్లనున్నారు.

## ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వడమే లక్ష్యం: భట్టి విక్రమార్క

హైదరాబాద్: అవకాశం ఉన్న ప్రతిచోట మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తమ ప్రభుత్వం మహిళా సంఘాలకు అండగా ఉంటుందని చెప్పారు. ప్రజాభవన్‌లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీకి అద్దె బస్సులు అందించిన మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేశారు. తొలి నెల అద్దె కింద రూ.1.49 కోట్లు ఆయా సంఘాలకు.. మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క అందించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారవేత్తలుగా రాణించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఐదేళ్లలో వారికి రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలనేది లక్ష్యమన్నారు. "ఈ నెల 8న అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చించాలి. మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న లబ్ధి గురించి చర్చించాలి. గ్రామాలు, మండలాల్లో మహిళా సమాఖ్య సమావేశాలు ఏర్పాటు చేయాలి. ఈనెల 10 నుంచి 16 వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు ఉంటాయి. వడ్డీ లేని రుణాల నగదును చెక్కుల రూపంలో అందిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంపై ప్రజలకు వివరించాలి" అని భట్టి విక్రమార్క తెలిపారు.



**మహిళలకు 5 వేల ఈవీ ఆటోలు ఇచ్చే యోచన: మంత్రి పొన్నం...**

మహిళలకు 5 వేల ఈవీ ఆటోలు ఇచ్చే యోచన ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దీంతో హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గుతుందని చెప్పారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు చాలా కష్టపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను మహిళా సంఘాలు ప్రచారం చేయాలని చెప్పారు.

## సీఎం రేవంత్ విసిరిన సవాల్ కేటీఆర్‌కు అర్థం కానట్టుంది: మంత్రి సీతక్క



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విసిరిన సవాల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు అర్థం కానట్టుందని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సీవాల్ విసిరింది కేటీఆర్‌కు కాదని.. కేసీఆర్‌కు అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత హోదా ఉన్న కేసీఆర్ చర్చకు రావాలన్నారు. భారత రాష్ట్ర సమితి ఇప్పటికే చచ్చిపోయిందని.. కేటీఆర్ నాయకత్వాన్ని ఆయన చెల్లెలే అంగీకరించడం లేదన్నారు. కేటీఆర్ తమ నాయకుడే కాదని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారని సీతక్క పేర్కొన్నారు.



## వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

కరీంనగర్: కరీంనగర్‌లో జగన్నాథుడి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. రథయాత్రలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పలువురు అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు. కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో నగరవాసులు రథయాత్రలో పాల్గొన్నారు.




## 876 అడుగులకు శ్రీశైలం నీటిమట్టం

శ్రీశైలం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 1,20,419 క్యూసెక్కులు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం నుంచి ఔట్ ఫ్లో 67,009 క్యూసెక్కులుగా ఉంది. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 31,704 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 876.90 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 172.66 టీఎంసీలకు చేరింది.

# "చికిత్స కాదు.. నివారణే ప్రధానం"

## "జంతు సంక్రమిత వ్యాధుల పట్ల జాగ్రత్త అవసరం" - జూలై 6... జూనోసిస్ డే




పశువుల మరియు జంతువుల నుండి మానవాళికి వ్యాప్తి చెందే వ్యాధులను "జూనోటిక్ వ్యాధులు" అంటారు. ఈ వ్యాధి కారకాలు సూక్ష్మజీవి (బాక్టీరియా), సూక్ష్మాతి సూక్ష్మ జీవులు (వైరస్), పరాన్న జీవులు (ప్యారసైట్స్)లు ఏమైనా కావచ్చు. ఈ వ్యాధుల గురించి మానవాళి తెలుసు కునేందుకు, తీసుకునే జాగ్రత్తల గురించి, అప్రమత్తంగా ఉండేందుకు, 1885 జూలై 6న "లూయీ పాశ్చర్" అనే శాస్త్ర వేత్త మొట్ట మొదటి సారిగా, పిచ్చి కుక్క కాటుకు గురైన బాలునికి, వ్యాధి రాకుండా వ్యాధి నిరోధక టీకా మందును, విజయ వంతంగా ఇచ్చిన నేపథ్యంలో, జూలై 6న "జూనోసిస్ డే" గా జరుపు కోవడం ఆనవాయితీగా మారింది. జంతు సాంక్రమిత వ్యాధులలో బ్రుసెల్లో సిస్, జపనీస్ ఎన్సిఫిలైటిస్, రేబిస్, దొమ్మ రోగం, హైడాటిడోదిస్, అనే వ్యాధులు ముఖ్య మైనవి. బ్రూసెల్లోసిస్: వ్యాధిని పశువుల్లో "అకాల ప్రసవం" అని మనుషుల్లో "మాల్టా ఫీవర్" అని పిలుస్తారు. ఇది అంటువ్యాధి. ఇది అన్ని పశువులను మరియు పశు వుల నుండి మనుషులకు వస్తుంది. బ్రుసెల్ల అనేది సూక్ష్మజీవి. ఇవి పశువుల్లో గర్భాశయంలో పెరిగి కోడెల ద్వారా, ఇతర పశువులకు సంక్రమిస్తుంది. మనుషులకు పాలు వెన్న మరియు మాంసపు ఉ త్పత్తుల ద్వారా వ్యాపిస్తుంది. ఇది ఎక్కువగా పశువులతో సమేతంగా ఉండే పశువుల కాపరులకు, పశు వైద్యులకు, సిబ్బందికి గర్భస్రావ పదార్థాల ద్వారా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల్లో గర్భస్రావం జరుగుతుంది. గర్భాశయం చెడి గొడ్డుమోతుగా మారుతుంది. ఈ వ్యాధి వలన మనుషులలో జ్వరం వస్తుంది. కీళ్ల నొప్పులు, వృషణాల వాపు, వంధ్యత్వము ఉంటాయి. ఈ వ్యాధి సోకిన పశువులను గుర్తించి వాటిని తీసి వేయాలి. జబ్బుపడిన పశువుల యొక్క శుభ్రపరిచి గడ్డి, గ్రాసం కాల్చి వేయాలి. ఎక్కువగా కనబడే ప్రాంత దూడలకు బృసెల్లా-19 అనే టీకా వేయాలి. పశువుల కాపరులు పశువైద్యులు తగు జాగ్రత్త వహించాలి పాలు, వెన్న, మాంస ఉత్పత్తులను, సరిగా వేడి చేసిన తర్వాతనే, ఆహారంగా తీసుకోవాలి.

**జపనీస్ ఎన్ సెఫ లైటిస్:** ఈ వ్యాధిని "మెదడు వాపు" అని కూడా అంటారు. ఇది దోమకాటు ద్వారా మనుషులకు సంక్రమిస్తుంది. పందులలో కొంగలలో ఈ వ్యాధి కారకం అభివృద్ధి చెందుతుంది. ఇది "ఆర్బో జాతి"కి చెందిన వైరస్ వల్ల వస్తుంది. ఈ వైరస్ పందులలో, కొంగలలో వృద్ధిచెంది, వీటిని దోమలు కుట్టినపుడు, వాటి రక్తం తో పాటు వైరస్ దోమలోకి ప్రవేశించి, తర్వాత మనుషులకు కుట్టినప్పుడు సోకుతుంది. సాధారణంగా 3 నుండి 12 సంవత్సరాల మధ్య గల పిల్లలు వ్యాధికి గురి అవుతారు. ఇది ఎక్కువగా దోమలు వృద్ధి చెందే కాలంలో సంభవిస్తుంది. వ్యాధి సోకినప్పుడు మనుషులలో వారి ప్రవర్తన ప్రవృత్తిలో తీవ్ర మార్పులు సంభవిస్తాయి. తీవ్ర జ్వరం 105 - 106 కనబడుతుంది. తీవ్ర తలనొప్పి ఉంటుంది. వాంతులు, మెడ నొప్పి, మెలికలు తిరగడం, మగత వంటి లక్షణాలు ఉంటాయి. ఈ వ్యాధికి చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. మనుషుల నివాసాలకు దూరం గా ఉంచాలి. దోమలు వృద్ధి చెందు నీటి గుంటలను, మురికి నీరు నిలిచే స్థలాలను నిర్మించాలి. పశువుల పాకలో శుభ్రంగా ఉంచాలి. వ్యాధి గల ప్రదేశాలలో వ్యాధి నివారణ టీకాలు పిల్లలకు ఇవ్వాలి.

**రేబిస్:** ఈ వ్యాధిని "పిచ్చికుక్క కాటు వ్యాధి" అని పిలుస్తారు. పిచ్చికుక్క రు మనుషులను పశువులను కలవడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వ్యాధి "ర్యాబ్డో జాతి"కి చెందిన వైరస్ వలన వస్తుంది. ఈ వైరస్ గబ్బిలాలలో వృద్ధి చెంది వాటిద్వారా, అడవి జంతువుల నుండి నక్కలకు, కుక్కలకు సంక్రమించి, అవి పిచ్చిగా మారి, వాటికి ఎదురు వచ్చిన పశువులు మనుషులను కరిచినప్పుడు మాత్రమే వారికి సోకుతుంది. ఈ వ్యాధి సోకిన కుక్కల నోటి నుండి చొంగ కారడం, నాలుక బయట పెట్టుట మతి లేక తిరగడం, కనబడిన వస్తువులను మనుషులను పశువులను కరవడం, అరవడం మొదలగు లక్షణాలు లేదా కొన్ని కుక్కలు పిచ్చి వచ్చినవి తిండిలేక నిశ్శబ్దంగా పడుకొని ఉ ంటాయి. ఈ వ్యాధి సోకిన కుక్కలు వారం రోజులలో చనిపోతాయి. వ్యాధి లక్షణాలు 10 రోజుల నుండి 10 సంవత్సరాలలో ఎప్పుడైనా కనబడవచ్చు వ్యాధి సోకిన మనుషులు, నీరును చూసి భయపడడం, గొంతు కండరాలు బిగుసుకు పోవడం, శరీర కండరములు విపరీతంగా నొప్పి కలగడం, అరవడం ఇలాంటి లక్షణాలు కాకుండా, మరణించడం జరుగుతుంది. ఈ వ్యాధికి చికిత్స లేదు. నివారణ ఒక్కటే మార్గం. వ్యాధి వ్యాపించకుండా వ్యాధి వ్యాపక కారకాలైన, ఊర కుక్కలు అభివృద్ధి చెందకుండా సంతాన నిరోధక చికిత్సలు, పెంపుడు కుక్కలకు రోగ నిరోధక టీకాలు వేయించాలి. కుక్కలు కరిచి నప్పుడు గాయమైన ప్రదేశాన్ని, మంచి శుభ్రమైన చల్లని నీటితో కడిగి వేసి, రోగ నిరోధక టీకాలు వేయించాలి.

**ఆంత్రాక్స్:** ఈ వ్యాధిని "దోమ రోగం" అంటారు. ఇది పశువుల వ్యర్థ పదార్థాల నుండి పశువు ఉత్పత్తుల నుండి వస్తుంది. ఇది ఎక్కువగా పశువుల కాపరులు, గొర్రెల కాపరులు, పశువుల తోలు పరిశ్రమలలో, పనిచేసే వారిలో కనబడుతుంది. ఇవి "బేసిల్లస్ ఆంత్రాసిస్" వల్ల వస్తుంది. ఈ వైరస్ అననుకూల పరిస్థితులలో, సూప్తవ దశలో ఉ ండి, గాలి ద్వారా తొందరగా వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశు వులలో జ్వర తీవ్రత పెరిగి, నోటి నుండి, మలద్వారం నుండి రక్తం స్రవించి, 24 గంటల్లో చనిపోవడం జరుగుతుంది. వ్యాధితో చనిపోయిన పశువుల కళేబరాలను గొయ్యి తీసి, పాతి పెట్టి, అవి వదిలేసిన వ్యర్థ పదార్థాలను, మేతను కాల్చి, శుభ్రం చేయాలి. ఈ వ్యాధి సోకిన ప్రదేశాలలో టీకాలు ఇప్పించాలి.

**హైడాటిడోసిస్:** ఈ వ్యాధి "ఏకైనోకొకస్" అను వైరస్ వల్ల వస్తుంది. ఇది కుక్కలోని చిన్న ప్రేవుల లో ఉండి, వాటి గుడ్లు మల విసర్జన ద్వారా బయటకు వచ్చి, మనుషులు తీసుకునే ఆహారం ద్వారా, లోనికి ప్రవేశించి మెదడు, కాలేయము, ఊపిరి తిత్తులలో చేరి, కాయల రూపంలో పెరుగుతాయి. ఈ వ్యాధి మనిషి శరీర ప్రక్రియలకు అడ్డుగా ఉండి, మనిషి పెరుగుదలను క్షీణింప చేస్తుంది. ఇది కుక్కల మలం ద్వారా వ్యాప్తి చెందుతుంది. కనుక పరిశుభ్రతను పాటించి, పెంపుడు కుక్కలకు పరీక్ష చేసి, క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి. పరిశు భ్రమైన ఆహారం తీసుకోవాలి.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**


# సంగీత సరస్వతి బాల మురళీ - జూలై 6... బాల మురళీ కృష్ణ జయంతి



ప్రపంచ ప్రజల భాష సంగీతం. మనసును కదిలించేది, మనిషిలో చైతన్యాన్ని రగిలించేది సంగీతం. శిశుర్వేత్తి... పశుర్వేత్తి... వేత్తిగాన రసఃఫణిః అని సంగీత ప్రాధాన్యత గురించి చెప్పారు. అవధు లెరుగనిది..ఎల్లలు ఒల్లనిది...భాషా భేదాలు లేనిది...ప్రాంతీయతలు తెలియనిది సంగీతం ఒక్కటే. కర్నాటక సంగీతం అనగానే వెంటనే స్పురణకు వచ్చే పేరు మంగళంపల్లి బాల మురళీకృష్ణ. సంగీతాన్ని ఔపోసన పట్టిన మహానుభావుడు బాలమురళి. కీర్తనలు, ఎంకి పాటలు, తత్వాలు, లలిత గీతాలు, భక్తి గీతాలు%ౌ% ఆయన పాడింది పాట, ఆలపించింది రాగం అన్నట్లుగా ఉంటుంది. వేలాది కాసెట్లు, రికార్డు విడుదల చేశారు. బాలమురళీ కేవలం గాయకులే కాదు, వాగ్గేయకారులు కూడా. 72 మేళకర్తల్లో కీర్తనలు రచించిన వాగ్గేయకారుడు ఆయన. లవంగి, త్రిశక్తి, మహతి లాంటి పెక్కు రాగాలు సృష్టించిన సంగీత సరస్వతి. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ 3 జాతీయ పురస్కారాలూ పొందిన ఏకైక వ్యక్తి బాలమురళీకృష్ణ. మంగళంపల్లి బాలమురళీకృష్ణ (జూలై 6, 1930 – నవంబర్ 22, 2016) కర్ణాటక సంగీత గాయకులు, వయొలిన్ విద్వాంసులు, వాగ్గేయ కారులు, సినీ సంగీత దర్శకులు, నటులు, గాయకులు. 8 సంవత్సరాల అతి చిన్న వయసులోనే కచేరీ చేయడం ద్వారా బాలమేధావి అనిపించు కున్నారు. 1939నుంచీ అతను ప్రొఫెషనల్ కచేరీలు చేశారు. వయోలిన్, మృదంగం, కంజీరా లాంటి వాయిద్యాలన్నీ బాగా వాయించ గలిగేవారు. భక్తప్రహ్లాద సినిమాలో నారదుడిగా, సందెని సింధూరం అనే మలయాళం సినిమాలో నటించారు. పలు చిత్రాలకు సంగీతాన్ని అందించారు. ప్రపంచ స్థాయిలో చేవెలియర్ అఫ్ ఆర్డర్ అఫ్ ఆర్ట్స్ అండ్ లెటర్స్ గౌరవాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం నుండి అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 25 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ 1930, జూలై 6న మద్రాసు రాష్ట్రం లోని, తూర్పు గోదావరి జిల్లా, రాజోలు తాలూకా శంకరగుప్తంలో పట్టాభిరామయ్య, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించారు. తండ్రి స్వగ్రామం సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం. పుట్టిన 15వ రోజునే తల్లి సూర్యకాంతం మరణించడంతో అమ్మమ్మగారి ఊరు అయిన గుడిమెళ్ళంకలో తండ్రి ఆలనా పాలనలో పెరిగారు. చిన్నతనంలోనే అతనిలోని సంగీత ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. కొచ్చర్లకోట రామరాజు ఆయన మొదటి గురువు. తరువాత తమిళనాడులో పక్షితీర్థానికి చెందిన సుబ్రహ్మణం అయ్యర్ దగ్గర కొన్నాళ్ళు శిష్యరికం చేసి, మళ్ళీ పెద్దకల్లేపల్లికి వచ్చి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి వద్ద చేరారు. తదనంతరం ఆయన శిష్యుడైన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు దగ్గర ఉన్నత స్థాయి సంగీతం నేర్చుకుని విజయవాడలో స్థిరపడ్డారు. ఆయన ప్రముఖ సంగీతకారుడు, వేణువు, వయోలిన్, వీణ విద్వాంసుడు. వయోలిన్ టీచర్ గా శంకర గుప్తంలో సంగీత తరగతులు నిర్వహించేవారు. 1938 జూలైలో ఎనిమిదేళ్ళ ప్రాయంలో విజయవాడలో తమ గురువు పారుపల్లి రామకృష్ణయ్య, ఆయన గురువు సుసర్ల దక్షిణామూర్తి పేరున ఏర్పాటు చేసిన సద్గురు ఆరాధనోత్సవాల సందర్భంగా మొట్టమొదటి సారిగా కచేరి చేశారు. అదే కార్యక్రమంలో ఆయన గానానికి ముగ్ధుడైన హరికథ విద్వాంసుడు ముసునూరి సత్యనారాయణ ఆయన పేరు మురళీకృష్ణకు ముందు బాల అని చేర్చి బాలమురళీకృష్ణ అని పిలిచారు. తన చిన్నప్పుడు గురువు పారుపల్లి రామక్రిష్ణయ్య వెంట తమిళనాడు అంతా తిరిగారు. అప్పట్లో ప్రతి ఊళ్ళోనూ రసికమణి అని పేరుమోసిన ఒక ధనవంతుడైన సంగీత ప్రియుడుండేవారు. ఆయన మెప్పు పొంది, వాళ్ళింటో కచేరీ చేస్తేనే యువ కళాకారులకి గౌరవం దక్కేది. చిన్నవయసులో గురువు వెంట వెళ్ళిన బాలమురళి వారందరి ముందరా గాత్రం వినిపించి బహుమతులూ, ప్రశంసలూ పొందడంతో అనేక స్థానిక అవకాశాలు లభిస్తూ ఉండేవి. బాలమురళీకృష్ణ తన వృత్తి జీవితాన్ని చాలా చిన్న వయసులో ప్రారంభించారు. సంగీతంలోని అన్ని విభాగాలలోను విస్తారమైన పాండిత్యము, మంత్రముగ్ధులను చేసే గాత్రం, బాణీ సమకూర్పులో ప్రత్యేక శైలి అతన్ని సంగీత సామ్రాజ్యంలో అత్యున్నత శిఖరాలకు చేర్చింది. హిందుస్తానీ సంగీతంలోని సంగీత కారులతో కలిసి పని చేశారు. జుగల్ బందీ తరహా కచేరీల రూపకల్పనకి ఆద్యుడు. ఆ తరహా కచేరీ మొట్ట మొదట పండిట్ భీమ్ సేన్ జోషితో కలిసి, తర్వాత పండిట్ హరిప్రసాద్ చౌరాసియా, కిషోరీ అమోన్కర్, మొదలగు వారితో కూడా జుగల్ బందీ కచేరీలు చేశారు. ఈ కచేరీలు దేశంలో ప్రజాదరణ తీసుకు రావడమే కాక, సంగీతం ద్వారా దేశ సమైక్యతను పెంపొందించ డానికి దోహద పడ్డాయి. 1957 జనవరి 12న విడుదలైన వరలక్ష్మీ పిక్చర్స్ వారి సతీ సావిత్రి సినిమా ద్వారా ఆయన గాయకులుగా, సంగీత దర్శకులుగా చిత్రరంగానికి పరిచయమైనారు. తర్వాత ఆయన గాత్ర ధర్మానికి అనువైన చిత్రాల్లో సంగీత దర్శకులు ఆయన చేత పాడించారు. 1967లో రోజా రమణి ప్రహ్లాదుడిగా, ఎస్. వి. రంగారావు హిరణ్య కశిపుడిగా నటించిన భక్త ప్రహ్లాద చిత్రంలో నారదుడిగా నటించారు. అదే సినిమాలో అతను ఆది అనాదియు నీవే దేవా, నారద సన్నుత నారాయణా, వరమొసగే వనమాలి పాటలు కూడా పాడారు. అలాగే నర్తనశాల చిత్రంలో అతను పాడిన సలలిత రాగ సుధారస సారం, శ్రీరామాంజ నేయ యుద్ధంలో మేలుకో శ్రీరామా, ముత్యాల ముగ్గు సినిమాలో శ్రీరామ జయరామ, గుప్పెడు మనసు చిత్రంలో మౌనమె నీ బాస ఓ మూగ మనసా, మేఘ సందేశం చిత్రంలో పాడనా వాణి కల్యాణిగా మొదలైన పాటలు బహుళ ప్రజాదరణ పొందాయి. హంసగీతిలో ఆలపించిన గీతానికి 1975లో ఉత్తమ సినీ గాయకునిగా జాతీయ సినిమా పురస్కారాలు పొందారు. 1976లో ఉత్తమ నేపథ్య గాయకుడిగా మంగళంపల్లి జాతీయ అవార్డు అందుకున్నారు. కన్నడ సినిమా మధ్వాచార్యకు అందించిన సంగీతానికి గాను 1986లో ఉత్తమ సంగీత దర్శకునిగా, 1987లో ఉత్తమ సంగీత దర్శకుడిగాను జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. 2001లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సంగీతంలో విశిష్ట పురస్కారం అందుకున్నారు. కర్నాటక సంగీత కారులలో పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అన్న 3 జాతీయ పురస్కారాలూ పొందిన ఏకైక వ్యక్తి బాలమురళీకృష్ణ. జాతీయ పురస్కారాలతో పాటు ఎన్నో విశ్వ విద్యాలయాల నంచి గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. సినీ సంగీత దర్శకునిగా, సినీ గాయకునిగా జాతీయ అవార్డులు, సంగీత కళానిధి, గాన కౌస్తుభగాన, కళాభూషణ, గాన గంధర్వ, గాయక శిఖామణి, జ్ఞాన శిఖామణి, జ్ఞాన చక్రవర్తి, గాన పద్మం, నాథ జ్యోతి, సంగీత కళా సరస్వతి, నాథ మహర్షి, గంధర్వ గాన సామ్రాట్, జ్ఞాన సాగర తదితర లెక్కలేనన్ని బిరుదులు వరించాయి. ఆయన తన గాత్రంతోనే కాకుండా వయోలిన్, మృదంగంతోనూ ఖ్యాతి గడించారు. ఆయన అమెరికా, కెనడా, బ్రిటన్, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా, శ్రీలంక, మలేశియా, సింగపూర్, అనేక ఇతర దేశాలలో కచేరీలు చేశారు. తెలుగులోనే కాక సంస్కృతం, కన్నడం, తమిళం, హిందీ, బెంగాలీ, పంజాబీ భాషలలో కూడా పాటలు పాడారు. అనకాపల్లిలో చివరిసారిగా కచేరీ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 25వేలకు పైగా కచేరీలు ఇచ్చిన గొప్ప గాయకుడు మంగళపల్లి బాలమురళీ కృష్ణ.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# టీకాల అవిష్కరణకు ఆద్యుడు పాశ్చర్




టీకాల ఆవిష్కారానికి ఆద్యుడు లూయీ పాశ్చర్. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. లూయీ పాశ్చర్ తయారు చేసిన ఏంటి రేబీస్ వాక్సిన్ని మొట్టమొదటి సారిగా 1885 జూలై 6న వాడారు. ఆంత్రాక్స్, రబీస్ తదితర వ్యాధులకు మందులను కనిపెట్టడంలో మూలపురుషుడై అవిరళ కృషి సల్పిన సూక్ష్మజీవ శాస్త్రవేత్త లూయీ పాశ్చర్. 19 వ శతాబ్దంలో గాలి సోకడం వల్ల అంటువ్యాధులు వస్తాయని నమ్మేవారు. గాలిలో రోగకారక క్రిములని మోసుకొచ్చే వస్తువుల వల్ల అంటు వ్యాధులు కలుగు తాయని అప్పుడు ఎవరికీ తెలీదు. సొంత కుంటుంబంలో జరిగిన విషాద సంఘటనలు, పాశ్చర్ తన పరిశోధనలను కలరా, మశూచి వ్యాధులకు మూలమైన వ్యాధి కారకాలను కనుగొనే దిశలో కొనసాగేట్లు చేశాయి. నేడు మనం చిన్న పిల్లలకు కలరా, మశూచి, పోలియో రాకుండా ముందుగానే వేయిస్తున్న 'టీకాలు' ఆ మహానుభావుని ఆలోచనే. వ్యాధి వచ్చినప్పటి కంటే రాకుండా తీసుకోనే జాగ్రత్తలే మేలని ముందుగా "వ్యాక్సి నేషన్" ద్వారా వ్యాధులను రాకుండా ముందుగానే కట్టడి చేయవచ్చని సూచించాడు. అంతేకాదు వ్యాధి సోకినా దానిని నియంత్రించి, రూపుమాపే మందులను కూడా కనుగొనేందుకు మార్గం చూపించాడు. పాశ్చర్ తన ప్రయోగాలను ఉపయోగించి సూక్ష్మజీవులు వాస్తవానికి ఇతర సూక్ష్మజీవుల నుండి ఉత్పత్తి అవుతాయని, ఊరికే గాలిలోంచి ఊడిపడవని నిరూపించారు. నేడు లక్షలాది అంటు రోగాలను తగ్గించేందుకు మన ఆధునిక వైద్యశాస్త్ర రంగంలో మందులున్నాయి. దానికి ఎంతో కృషి సల్పిన, నేటికీ నిత్యం శ్రమిస్తున్న ఎంతో మంది సూక్ష్మ జీవశాస్త్రవేత్తలకు లూయీ పాశ్చర్ వంటి వారు ఏర్పరిచిన శాస్త్రీయ విధానమే మూలాధారం. లూయీ పాశ్చర్ (డిసెంబరు 27, 1822 %–% సెప్టెంబరు 28, 1895) ప్రముఖ ఫ్రెంచి జీవ శాస్త్రవేత్త. వ్యాధులకు కారణం సూక్ష్మక్రిములను కనుగొని రోగ నివారణకు పాశ్చర్ బాటలు వేశారు. టీకాల ఆవిష్కారానికి ఇతడు ఆద్యుడు. మొదటి సారిగా రేబీస్ వ్యాధి కోసం టీకాను తయారు చేశాడు. రాబర్ట్ కోచ్, ఫెర్డినాండ్ కాన్తో పాటు జీవశాస్త్ర వ్యవస్థాపక త్రయంలో ఒకరు. పాలు ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టే పద్ధతిని ప్రవేశ పెట్టిన వ్యక్తిగా సుపరిచితుడు. ఈ పద్ధతిని నేడు "పాశ్చరైజేషన్" అంటారు. కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. పాశ్చర్ కొన్ని అద్భుత ప్రయోగాలు చేసి సూక్ష్మ జీవులు ఒకదాన్నుండి ఒకటి పుడతాయని, గాల్లోంచి ఊడి పడవని నిరూపించాడు. ఆయన ప్రతిపాదించిన రోగకారక క్రిమి సిద్ధాంతం (%+వతీవ్ ష్ట్రవశీతీఎ శీట ఎఱఅంమ్మింవ%) వైద్య శాస్త్రంలో ఒక విప్లవాత్మకమైన భావనగా చెప్పుకోవచ్చు. అంతేకాక ఆయన వ్యాధి యొక్క వ్యాప్తిని అరికట్టేందుకు ఆస్పత్రులలో చేతులు కడుక్కోవడం వంటి పరిశుభ్రతా పరమైన పద్ధతులు ప్రవేశ పెట్టాడు. పాశ్చర్ అత్యంత సునిశితమైన, క్రమబద్ధమైన ప్రయోగాలు చేసి ఎన్నో ప్రమాద కరమైన సూక్ష్మజీవులను కనుగొన్నారు. ఆ సూక్ష్మజీవులని అరికట్టే వాక్సీన్ లు రూపొందించి మనుషులనే కాక, జంతువులను కూడా ఎన్నో భయంకరమైన వ్యాధుల నుంచి కాపాడారు. పాశ్చర్ 1822 సంవత్సరం డిసెంబరు 27న ఫ్రాన్స్ లోని డోల్ గ్రామంలో జన్మించాడు. పాశ్చర్ పాఠశాలకు వెళ్ళకుండా కొంతవరకు విద్యావంతుడయ్యాడు. చిత్రలేఖనంలో మంచి ప్రతిభ కనపరిచేవాడు. తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారివి, స్నేహితులవి బొమ్మలు పెయింట్ చేశాడు. గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలంటే ఇష్టమున్న పాశ్చర్ ఉ పాధ్యాయ జీవితాన్ని గడపాలను కొనేవాడు. పదహారేళ్ల వయసులో కాలేజీ చదువు కోసం పారిస్ లో అడుగుపెట్టాడు. డాక్టరేట్ పూర్తిచేసి 1848లో స్ట్రాస్ బర్గ్ విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా నియమితులయ్యారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కూతురు మేరీ లారెంట్ ను పెళ్ళిచేసుకోగా, అయిదుగురు పిల్లలు పుట్టినా, టైఫాయిడ్ వల్ల ఇద్దరు, మశూచి వల్ల ఒకరు, ముగ్గురు మరణించారు. పాశ్చర్ అంగారక పదార్థాలు ధ్రువిత కాంతిని ఏ విధంగా విచలనం చెందిస్తాయో అధ్యయనం చేసి "స్టీరియో కెమిస్ట్రీ" అనే కొత్త రసాయన శాస్త్రాన్ని రూపొందించారు. తరువాత తన పరిశోధనలను పులియడం (ఫెర్మెంటేషన్ ) వంటి అంశాలపై కొనసాగించి సూక్ష్మక్రిములపై అనాదిగా ఉన్న భావాలను ఖండించి కొత్త సిద్ధాంతాలను రూపొందించాడు. ద్రక్షసారా (వైన్) వల్ల వచ్చే వ్యాధులు, నిల్వచేసే పద్ధతులు, వెనిగర్ తయారీ మొదలైన అనేక అంశాలపై కొత్త విషయాలు కనుగొన్నాడు. రేబీస్ అనేది వైరస్ ల వల్ల కలిగే ఓ భయంకరమైన వ్యాధి. అది కుక్కల నుండి మనుషులకి సోకుతుంది. ఈ వైరస్ బాక్టీరియాల కన్నా అతి చిన్నదైన వస్తువు. కనుక పాశ్చర్ వాడిన సూక్ష్మదర్శినిలో ఇది కనిపించ లేదు. ఆ వైరస్ వ్యాధితో కేంద్ర నాడీ వ్యవస్థ పై ప్రభావితం చేస్తుంది. పాశ్చర్ ఆ వ్యాధి సోకిన జంతువుల వెన్నుపాము నుంచి ద్రవం సంగ్రహించి, వివిధ పద్ధతుల చేత ఆ ద్రవం యొక్క రోగ తీవ్రతని క్షీణపరిచి, ఆ ద్రవాన్ని తిరిగి కుక్కల మీదకి ఎక్కించి రేబీస్ కి వాక్సీన్ ని రూపొందించారు. కోళ్లకు వచ్చే కలరా వంటి పారుడు వ్యాధిపై పరిశోధన జరిపి వ్యాధి కారకాలైన సూక్ష్మజీవులను బలహీనపరచి ఇతర కోళ్ళకు ఎక్కించి వాటిలో రోగనిరోధక శక్తి పెరిగి తర్వాత కాలంలో రోగం రాకుండా రక్షిస్తుందని నిర్ణయానికి వచ్చారు. 1870 దశాబ్దంలో టీకా పద్ధతులను పశు వులలో వచ్చే ఆంత్రాక్స్ వ్యాధి మీద ప్రయోగించాడు. ఈ విధంగా కొన్ని ప్రాణాంతక వ్యాధులకు సూక్ష్మక్రిములు కారణాలన్న విషయాన్ని నిరూపించాడు. అందువలన మనిషులు గాని, జంతువులు గాని అంటు వ్యాధితో మరణిస్తే ఆ శవాన్ని దహనం చేయాలని చెప్పారు. భూమిలో పాతిపెడితే శరీరంలోని క్రిములు బయటకు వచ్చి వాటివలన ఇతరులకు ఆ వ్యాధులు వ్యాపిస్తాయని వివరించాడు. పాశ్చర్ తన పూర్తి జీవితాన్ని శాస్త్ర పరిశోధనలకు అంకితం చేశారు. సంకల్ప బలం, నిరంతర శ్రమతో విజయాన్ని సాధించవచ్చని పాశ్చర్ విశ్వాసం. పాశ్చర్ సూక్ష్మ జీవశాస్త్రంలో అత్యుత్తమ గౌరవమని పిలిచే లీవెన్ హాక్ బహుమతిని 1895లో పొందాడు. రెండు సార్లు గుండె పోటు, తరువాత పక్షవాతం వచ్చినా జీవితాంతం పరిశోధన చేసి మానవాళికి వెలకట్టలేని సేవ చేసిన పాశ్చర్ 1895 సెప్టెంబరు 28న పరమ పదించారు. లూయిస్ పాశ్చర్ జ్ఞాపకర్థంగా ఆయన మరణించిన రోజైన సెప్టెంబరు 28న ప్రపంచ రేబీస్ దినోత్సవం జరుపు కుంటారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# మహోన్నత పార్లమెంటేరియన్ వ్యక్తి జగ్జీవన్ రామ్

# జూలై 6... బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి

భారత దేశ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేత జగ్జీవన్ రామ్. అతి చిన్న వయస్సులో (27 ఏళ్లకే) శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యి రికార్డు సృష్టించిన ప్రజానాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, బాబూ జగ్జీవన్ రాం. పొలిటికల్ కింగ్ మేకర్‌గా రాజకీయంలో రాణించి, అధికారం కోసం కాకుండా ప్రజా శ్రేయస్సు కోసమే పని చేసిన మహోన్నత వ్యక్తిత్వం ఆయన సొంతం. యాభై ఏళ్ళు పార్లమెంట్‌లో సభ్యునిగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఆయనది. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రం, షాబాద్ జిల్లా, చాందా గ్రామంలో శిబిరం, బసంతి దేవి దంపతులకు జగ్జీవన్ జన్మించారు. ఆయన ఒక పేద దళిత కుటుంబంలో జన్మించడంతో ఎన్నో అవమానాలను, ఛీత్కారలను ఎదుర్కొన్నారు. చిన్ననాడే తండ్రి చనిపోవడంతో సాంఘిక, ఆర్థిక ఇక్కట్ల మధ్య తల్లి వసంతీదేవి సంరక్షణలో తన చదువు కొనసాగించారు. రాత్రింబవళ్ళు భోజ్‌పురితో పాటు హిందీ, ఇంగ్లీషు, బెంగాలి, సంస్కృత భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్, కలకత్తా విశ్వ విద్యాయం నుంచి డిస్టింక్షన్‌లో బిఎస్సీ డిగ్రీ పూర్తి చేసి పట్టభద్రు డయ్యారు. పీజీ చదువు పూర్తి చేశారు. కార్మికుల కోసం పోరాడి 35వేల మంది కార్మికులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, సుభాష్ చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అనేకమంది జాతీయ నాయకుల దృష్టిలో పడ్డారు. ఆయన జీవితకాలం 78 ఏళ్ళు అయితే అందులో 52 ఏళ్ళు రాజకీయ జీవితం గడిపారు. 1952లో భారత రిపబ్లిక్ తొలి లోక్‌సభ ప్రవేశించిన జగ్జీవన్‌రామ్ వరుసగా ఎనిమిది సార్లు గెలిచారు. ఏకధాటిగా 33 సంవత్సరాలు కేంద్రమంత్రిగా, దేశ ఉప ప్రధానిగా ఆయన ప్రత్యేకత చాటుకున్నారు. మొదటి శ్రేణి పార్లమెంట్ రియన్‌గా నిలిచారు. మంత్రి మండలిలో అతి చిన్న వయసుడ్కైన జగ్జీవన్‌రామ్‌ను అందరూ 'బేబి మినిస్టర్' అని పిలిచేవారు. ప్రజలంతా ప్రేమతో 'బాబుజీ' అని పిలిచేవారు. వ్యవసాయ శాఖ మంత్రిగా, ఆహార శాఖ మంత్రిగా, రైల్వే మంత్రిగా, రక్షణ శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఎన్నో సేవలనందించిన ప్రగతిశీలి ఆయన. దామోదరం సంజీవయ్యను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చెయ్యటంలో కీలకపాత్ర పోషించారు. 1942లో కాంగ్రెస్ లో చేరి, జగ్జీవన్ 1969లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1977లో ఇందిరా గాంధీతో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చి 'ప్రజాస్వామ్య కాంగ్రెస్' పార్టీ ఏర్పాటు చేశారు. ఇంద్రాణిదేవితో బాబుజీకి 1935 జూన్ 1న వివాహం జరిగింది. ఇంద్రాణి కూడా స్వాతంత్ర్య సమరయోధురాలు. ఆయన కుమార్తె మీరాకుమార్ తండ్రి ఆదర్శాలతోనే పెరిగి, ఆయన బాటలోనే కేంద్రమంత్రిగా, లోక్‌సభ స్పీకర్‌గా దేశానికి సేవలందించారు. బాబుజీ గొప్ప రచయిత అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆయన హిందీలో, ఇంగ్లీషులో రచనలు చేశారు. "భారత




దేశంలో కులం సమస్య", " జీవన సరళి వ్యక్తిత్వ వికాసం" అను రెండు విశిష్ట గ్రంథాలను రాశారు. ఆయన గొప్ప అధ్యయనశీలి. ఉ జ్జయినిలోని విక్రమ విశ్వ విద్యాయం 1967లో జగ్జీవన్‌రామ్ కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయన సేవను మెచ్చిన కాన్పూర్ విశ్వవిద్యాయం 1968లో డాక్టరేట్‌తో సత్కరించింది. జగ్జీవన్ రామ్ "అమూల్యరత్నం" అని గాంధీ ఒక సందర్భంలో రాశారు. 1986 జూలై 6వ తేదీన బాబూజీ తన తుదిశ్వాస విడిచారు. బాబు జగ్జీవన్ రామ్ వరుసగా ప్రజాప్రతినిధిగా, భారత దేశంలో ఎక్కువ కాలం పనిచేసిన క్యాబినెట్ మంత్రిగా రికార్డు సృష్టించారు. ఆయన కేంద్ర కార్మిక మంత్రిగా 1946 నుండి 1952 సంవత్సరం వరకు ఉన్నారు. ఆయన 1952 నుండి 1956 సంవత్సరం వరకు కేంద్ర సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1956 నుండి 1962 వరకు కేంద్ర రవాణా, రైల్వే శాఖ మంత్రిగా పనిచేశారు. 1962 నుండి 1963 సంవత్సరం వరకు ఆయన కేంద్ర రవాణా మరియు సమాచార శాఖ మంత్రిగా ఉన్నారు. 1966 నుండి 1967 సంవత్సరం వరకు కేంద్ర కార్మిక, ఉపాధి మరియు పునరావాస శాఖ మంత్రిగా పని చేశారు. 1967 నుండి 1970 వరకు కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నారు. 1970-1974, 1977 - 1979 కేంద్ర రక్షణ మంత్రిగా ఉన్నారు. 1974 నుండి 1977 వరకు కేంద్ర వ్యవసాయ, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్నారు. సెప్టెంబర్ 1976 నుండి 1983 ఏప్రిల్ వరకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడిగా పని చేశారు. భారత ఉప ప్రధాన మంత్రిగా, 1977 మార్చి 24 నుండి 1979 జూలై 28 వరకు విధులు నిర్వర్తించారు.

**రామ కిష్టయ్య సంగనభట్ల - 9440595494**

# చురకలు

## సంపాదకీయం

## బీహార్ బరిలో కేజ్రీవాల్

## బీజేపీ నెత్తిన పాలు పోస్తారా ?

బీహార్ లో మరి కొద్ది నెలలలో అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మళ్ళీ గెలవాలని అక్కడ బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి భావిస్తోంది. ఈసారి గెలుపు బీజేపీకి చాలా ముఖ్యం. బీహార్ లో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే ఉత్తరాదిన బీహార్ చాలా కీలకమైన రాష్ట్రం. అక్కడ కనుక ప్రతిపక్షం పాగా వేస్తే 2029 లోక్ సభ ఎన్నికల నాటికి వారి రాజకీయ విస్తరణకు బాటలు పడతాయని బీజేపీ ఆలోచిస్తోంది. అందుకే ఎట్టి పరిస్థితుల్లో అవకాశమే ఇవ్వకూడదని పట్టుదలతో పనిచేస్తోంది. బీజేపీ జేడీయూ ఘట బంధన్ బీహార్ లో బలంగా ఉందని నమ్ముతోంది. మరో వైపు చూస్తే జన సూరజ్ పార్టీతో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అలియాస్ పీకే బరిలో ఉంటున్నారు. ఆయన పార్టీ పోటీ వల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోతుందని కూడా లెక్క వేసుకుంటోంది. అయితే ప్రతీ రాష్ట్రంలో జరిగే ఎన్నికల్లో మజ్లిస్ పోటీ చేస్తోంది. ఆ విధంగా ఆ పార్టీ ఇండియా కూటమి ఓట్లను లాగేసుకుంటోంది. దాంతో కూటమికి అది ఇబ్బంది గా మారి ఎన్డీయే భారీగా రాజకీయ లాభం పొందుతోంది. బీహార్ లో చూస్తే ఎక్కువ ముస్లిం డామినేషన్ అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. మరి ఈసారి కూడా మజ్లిస్ సొంతంగా పోటీకి దిగుతుందా అంటే అలా కాదు అని ఆ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చెబుతున్నారు. బీజేపీని ఓడించడమే తమ అంతిమ లక్ష్యమని ఆయన చెబుతున్నారు. అందువల్ల తాము కూటమితో పొత్తులకు వెళ్తామని అంటున్నారు. తమకు బలం ఉన్న సీట్లను ఇండియా కూటమి ఇస్తే కనుక కలసి పోటీ చేసి బీహార్ లో ఎన్ డీయే ప్రభుత్వం రానీయకుండా చేస్తామని శపథమే చేస్తున్నారు. మహారాష్ట్రతో పాటు చాలా చోట్ల మజ్లిస్ ఒంటరి పోరు బీజేపీకి కలిసి వచ్చింది. ఈసారి మాత్రం అసదుద్దీన్ కొత్త వ్యూహం అనుసరిస్తామని చెప్పడంతో బీహార్ లో బీజేపీకి ఇబ్బందే అని అంతా అనుకుంటున్నారు. అయితే అదే సమయంలో ఆప్ బీజేపీకి అనుకోని వరాన్ని ఇస్తున్నట్లుగా పరిస్థితి కనిపిస్తోంది. బీహార్ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని ఆప్ అధినేత కేజ్రీవాల్ తాజాగా ప్రకటించారు. బీహార్ లో కాంగ్రెస్ తో కానీ ఇండియా కూటమితో కానీ తమకు ఎటువంటి పొత్తులు ఉండవని ఆయన తెగేసి చెబుతున్నారు. దాంతో బీజేపీ నెత్తిన పాలు పోయడానికేనా ఆప్ అధినేత ఈ విధంగా నిర్ణయం తీసుకున్నారు అన్నది చర్చకు వస్తోంది. నిజానికి ఆప్ చాలా కాలం నుంచే ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ పార్టీ ఢిల్లీ ఎన్నికల్లో కూడా పొత్తులు లేకుండా పోటీకి దిగి కోరి ఓటమిని తెచ్చుకుంది. అయినా సరే తమది అదే రూట్ అంటోంది. గుజరాత్ లో కూడా తాము ఒంటరిగా పోటీ చేస్తామని చెబుతోంది. ఆప్ కి కోపం ఏమిటి అంటే ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేసి కాంగ్రెస్ తమ విజయావకాశాలను దెబ్బ తీసింది అని. అందుకే కాంగ్రెస్ శిబిరంలో తాము చేరేది లేదని చెబుతోంది. ఈ విధంగా ఆప్ తీసుకున్న నిర్ణయంతో బీహార్ లో రాజకీయ పరిణామాలు మారుతాయా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. ఒక వైపు పీకే మరో వైపు ఆప్ ఇలా రెండు పార్టీలు వీలైనంత దాకా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీలిస్తే కనుక మరోసారి బీహార్ లో అధికారం తమకు దక్కుతుందని బీజేపీ లెక్క వేస్తోంది. మరో వైపు మజ్లిస్ తో ఇండియా కూటమి పొత్తు కూడా అంత సులువు కాదని భావిస్తోంది. ఆ పార్టీ అడిగే సీట్లను కనుక కేటాయించకపోతే ఒంటరి పోరుకే మజ్లిస్ కూడా దిగుతుందని భావిస్తోంది. ఇలా విపక్షంలో చీలికలు బలహీనతలే బీహార్ కుర్చీని పదిలంగా తమకు అప్పగిస్తాయని బీజేపీ భావిస్తోందిట. బీజేపీయేతర రాజకీయ పార్టీలలో ఐక్యత ఇపుడు అంతటా కనిపించడం లేదు. కాంగ్రెస్ అందరినీ కలుపుకుని పోయే విషయంలో భేషజాలకు పోతోంది. అది కూడా బీజేపీకి అంది వచ్చిన అవకాశంగా మారుతోంది అని అంటున్నారు. ఈసారి కూడా బీహార్ లో ఓటమి చెందితే లాలూ పార్టీతో పాటు కాంగ్రెస్ రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు చూడాల్సి వస్తుందని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# "పండగలకు అబ్బాయిలకు బోణీ తొలి ఏకాదశి"

తిథులు అన్నింటిలోకి ఏకాదశి తిథి పరమ పవిత్రమైనది. ప్రతి మాసంలో 15 రోజులకు ఒకసారి వచ్చే ఏకాదశి ఉపవాసాల దినం. "గృహస్థో బ్రహ్మచారి చ ఆహితాగ్నిస్త దైవచ, ఏకాదశ్యాంశ భంజిత పక్షయోరు భయో రపి" అని అగ్ని పురాణాదులు స్పష్టం చేస్తున్నాయి. గృహస్తులకు, బ్రహ్మచారులకు, నిత్యాగ్ని హెూత్రులకు సైతం నిమిత్తమైన కర్మగా, ఉపవాసాద్యాచరణము విధించ బడినది. ఏకాదశి దినం శ్రీమహా విష్ణువుకు ప్రీతిపాత్రమైన "హరివాసము" అని కొనియాడారు బడుచున్నది. ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పండుగలూ పబ్బాలూ అధికం. ఆరోగ్య పరిరక్షణార్థం నియమాలు ఎక్కువగా పాటించాల్సి ఉండడం చేత, నియమ పాలనార్థం పూర్వీకులు వ్రతాలు, ఉత్సవాలు ఎక్కువగా నిర్దేశించారు. అలాంటి పండగలకు, పబ్బాలకు "బోణీ" వంటిది ఆషాడ శుక్లపక్ష ఏకాదశి. చాతుర్మాస్య దీక్షా దినాల ఏకాదశులలో మొదటిది కావడం చేత "తొలి ఏకాదశి"గా నామాంతరం గల దినమైనది. "ప్రథమైకాదశి" అను సంస్కృత నామాన్ని బట్టి తెలుగు వారు దీనిని తొలి ఏకాదశి అని వ్యవహ రిస్తున్నారు. తర్వాత రాగల పండుగలకు పబ్బాలకు ఇది తొలిది. నిష్టా పరులకు సనాతన సాంప్రదాయ ఆచరణ ఆసక్తులకు ఇది ఉపవాస దినం. ఈనాటి నుండి నాలుగు మాసాల పాటు ప్రతి దినం పురాణ గ్రంథాలు పఠించడం సదాచారంగా వస్తున్నది. అన్ని ఏకాదశులలోకి ఆషాఢ శుక్ల ఏకాదశి మహా విష్ణువుకు అత్యంత ప్రీతిపాత్ర మైనదిగా భావించ బడుతున్నది. కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు.. బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించాడని, ఆ రాక్షసుడితో మహా విష్ణువు వెయ్యేళ్లు పోరాడి, అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా.. శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని అంతం చేసిందని, ఇందుకు సంతోషించిన శ్రీమహా విష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకోవాలని కోరుకాగా, నాటి నుంచి ఆమె 'ఏకాదశి' తిథిగా వ్యవహారంలోకి వచ్చిందని,



అప్పటి నుంచి సాధువులు, భక్తులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణుసాయుజ్యం పొందినట్లుగా పురాణ కథనాలు. ఈరోజు మొదలుకొని విష్ణుమూర్తి నాలుగు నెలలపాటు, పాతాళ లోకంలో బలి చక్రవర్తి ద్వారం వద్ద ఉండి, కార్తీక శుక్ల ఏకాదశి నాడు వెనక్కి తిరిగి వస్తారని చెబుతారు. అలాగే ఈ దినం విష్ణుమూర్తి, నాలుగు నెలల పాటు క్షీర సముద్రంలో శేష సాయిపై పండుకొని, కార్తీక శుక్ల ఏకాదశి నాడు మేల్కొంటారని అని పురాణాలు వివరిస్తున్నాయి. గదాధర పద్ధతి దీనిని "హరి శయనం" అంటున్నది. అలాగే "దేవ శయని ఏకాదశి" అని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ దినంతో ప్రారంభించి, మహావిష్ణువు నాలుగు నెలలపాటు క్షీర సముద్రంలో శయనించి, కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడని, పురాణాలు చెబుతున్నాయి. అందులకే దేనికి "దేవ శయన ఏకాదశి" అని, "శయనైకాదశి" అని పేర్లు కూడా ఉన్నాయి. వైష్ణవాలయాలలో ఈ దినం నాడు విగ్రహాలను, ఆభరణాలతో అలంకరించి పూజించడం ఆచారం. ఆషాడ మాస శుక్ల ఏకాదశినాడు ఉపవాసం ఉండి చాతుర్మాస్య వ్రత కల్పం ప్రారంభించాలని శ్రీకృష్ణుడు ధర్మరాజుకు చెప్పినట్లు గ్రంథస్తం. బ్రహ్మ వైవర్త పురాణ ఆధారంగా చాతుర్మాస్య దీక్షను ఆషాఢ శుద్ధ ఏకాదశితో ప్రారంభించి, విష్ణుమూర్తి పూజలు చతుర్మాస్య వ్రతం మొదలుకొని ఏకాదశి, ద్వాదశి, అమావాస్య, పౌర్ణమి, కర్కాటక సంక్రాంతి, పర్వదినాలలో ఉపవాస దీక్షలో ఉంటూ, కార్తీక శుక్ల ఏకాదశి వ్రతం పూర్తి చేయడం ఆచారం. పిప్పల వృక్ష ప్రదక్షణలు, దేవాలయాలలో దీపారాధనలు, చాతుర్మాస్య ఆచరణలో ప్రధానాలు. చాతుర్మాస్య దీక్షా పరులు, సరస్వతి దేవిని కూడా పూజించడం, కొన్ని చోట్ల ఆచారంగా ఉంది. తెలుగు దేశపు వ్యవహారాల ప్రకారం గుంటూరు మండలంలో కొన్ని ప్రాంతాలలో దీనిని "పేలపిండి ఏకాదశి" అంటారు. పేలాలు విసిరి పిండి చేసి, బెల్లంలో కలుపుకొని తింటారని ఆ పేలాల పిండి మీద కూడా ఆచారంగా కొనసాగింది. ఉభయ గోదావరి మండలాల్లో మాగాణి గ్రామాల్లో రైతులు ఈ దినం నాడు కొత్త పాలేర్లను కుదుర్చు కుంటారు. ఆ ప్రాంతాల్లో వాళ్లకు తొలి ఏకాదశి దానికి ముందు దినాలు, ఆటవిడుపు సమయాలు. తొలి ఏకాదశి నాడు కానీ, తర్వాత ఈ రోజున కానీ, కొత్త పాలేరులకు కొత్త బట్టలు, కొత్త కర్రలు ఇచ్చి, పిలిచి పిండి వంటలతో భోజనాలు పెట్టడం కూడా ఆచారంగా ఉన్నట్లు కొన్ని గ్రంథాలు పేర్కొంటున్నాయి. "ఏరు ముందా"... "ఏకాదశి ముందా" అని నెల్లూరు జిల్లాలో ఒక సామెత ఉంది. ఆషాడం నుండి మేఘోదయం అగు చుండుట చేత, ఏరువాక పనుల ప్రారంభించేవారు. ఏటి నీటి కోసం ఎదురు చూడడం, సామాన్యంగా ఆషాడ శుక్ల ఏకాదశి వరకు నీటి వనరులలో కొత్తనీరు రావడం కద్దు. అందుచేత ఏరు, ఏకాదశి పందెము వేసుకొని "నేను ముందా... నీవు ముందా" అని పోటీ పడతాయని అలంకార ఉక్తి ఒక సామెతగా వాడుకలో ఉంది. ఏకాదశి వ్రతాలను ఏకాదశి పర్వదినం తో ప్రారంభించి 11 ఏకాదశుల వ్రతాచరణ సదాచారమై ఉంది. సౌభాగ్యానికి సుఖ సంతోషాలకు ఏకాదశి దేవత అనుగ్రహ సిద్ధికై సువాసినులు సామూహిక ఏకాదశి వ్రతాలను ఆచరించడం పరంపరానుగతంగా వస్తున్నది.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**



# త్యాగానికి ప్రతీక మొహర్రం

హిందువులు, ముస్లిం సోదరులూ సమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహెూన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామ రస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం మొహర్రం. ధర్మ సంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి 14 వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను ఆర్పించడం సత్సాంప్రదాయంగా ఆచరిస్తున్నారు. మొహర్రం మాసమంటే రక్తపు టేరులతో ఎర్రబారిన కర్బల మైదానం ముస్లిం సోదరుల కళ్లలో సజీవంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మాధర్మాలకు జరిగిన సంఘర్షణ ఫలితమే కర్బల దుర్ఘటనగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదించిన అనంతరం సమ సమాజ స్థాపన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతినిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. తదనుగుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు. వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై నడిచాయని చెపుతారు. ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి పోటీపడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలికింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. పదవీకాంక్షా లోలుడైన మివాయ తన కుమారునికి పట్టం కట్టాలని ప్రజలపై ఒత్తిడి తెచ్చిన స్థితిలో, ప్రాణభయంతో ప్రజలు మివాయ కొడుకు యజీద్ రాజుగా గుర్తిస్తారు. అయితే ఈ చర్యలు ప్రజాస్వామ్య వాదులకు మింగుడు పడలేదు. తత్ఫలితంగా ప్రజలు రాజుకు ఎదురు తిరిగి ఉద్యమిస్తారు. ఉద్యమ నాయకత్వ బాధ్యతలను హజ్రత్ హుస్సేన్ కి అప్పగిస్తారు. ఇస్లాం నిబంధనల ప్రకారం ఏసమస్యకైనా చర్చలు సంప్రదింపులే పరిష్కార మార్గాలు కావడం మూలంగా, హజ్రత్ హుస్సేన్ సిరియా రాజధాని కుఫాకు సంప్రదింపులకై బయలు దేరి వస్తుండగా, రాజు యజీద్ విషయాన్ని తెలుసుకుని హుస్సేన్ రాజధానికి వెళ్ళి చర్చలు జరిపితే తన అధికారానికి ముప్పు వాటిల్లక తప్పదని గ్రహించి, హుస్సేన్ ను అడ్డుకోవడానికి పెద్ద సైన్యాన్ని పంపుతాడు. మార్గ మధ్యలో కర్బల మైదానంలో యజీద్ సైన్యం ఎదురై హుస్సేన్ పరివారాన్ని అడ్డగిస్తారు. దీనితో ఇరువర్గాల మధ్య భీకర యుద్ధం జరుగుతుంది. హుస్సేన్ పరివారం శత్రు సైన్యాన్ని చీల్చి చెండాడినా, కొంతకాలం యుద్ధం జరిగాక చివరకు హుస్సేన్ ఒక్కడే మిగులగా, మొహర్రం మాసం లోని పదో తేదీ శుక్రవారం హిజ్రీ 60వ సంవత్సరం నాడు హుస్సేన్ హెూరా హెూరీగా పోరాడు తున్న సమయంలో, సూర్యుడు అస్తమించే సమయం కావడంతో, కొంత వ్యవధి కావాలని అనుమతి గైకొనగా, శత్రువులు అదే అదనుగా భావించి, నమాజ్లో భాగంగా సిజ్దా చేస్తుండగా బాణాలతో దారుణంగా హతమార్చి, తలను మొండెం నుంచి వేరు చేసి, చేతులు ఖండించి బాణాలకు, బరిసెలకు తగిలించుకుని నాట్య విన్యాసాలు చేశారు. అట్టిరోజును ఇస్లాం మతస్తులు త్యాగదినంగా పరిగణించి త్యాగ శీలతకు ప్రతీకగా పీర్ల దినాన్ని మొహర్రం పేరుతో జరుపు కుంటూ అమర వీరులను స్మరిస్తారు. మొహర్రంను హిందూ, ముస్లింలు సమైక్యంగా జరుపు కోవడం ఆనాదిగా సంప్రదాయంగా వస్తోంది. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రా చరిత్ర కారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. మొహర్రం నెల పదవ రోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, "షహీద్ " (అమర వీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపు కుంటారు. షియా ఇస్లాంలో ఈ ముహర్రం నెల, "ఆషూరా", కర్బలా యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం, శోక దినాలుగా గడుపుతారు. షియాలు మాతమ్ (శోక ప్రకటన) జరుపుతారు. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. వారం రోజుల పాటు హిందూ, ముస్లిం సోదరులు కలిసి కట్టుగా పీర్లను పిల్లను నెలకొల్పి, చివరి రోజు వేలాదిమంది తోడురాగా వెళ్ళి పరి సమాప్తి గావిస్తారు. పీర్ల పండుగ సందర్భంగా సంతాన హీనులైన హిందూ స్త్రీలు మొక్కులు చెల్లించు కోవడం, పులుల ఇతర వేషాలతో విన్యాసాలు చేస్తూ, ఆడుతూ వారం డబ్బులు ప్రోగుచేసు కోవడం క్షేత్రం ఏటా అనుసరింప బడుతున్న సాంప్రదాయంగా మారింది. హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు తమను తాము హింసించు కుంటూ విషాదం వ్యక్తం చేస్తూ వూరేగింపులో పాల్గొంటారు. బీబీకా అలావా నుంచి ప్రారంభమై ఈ వూరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్ హౌస్, మీరాలం మండీ, దారుల్ షిఫాల మీదుగా కొనసాగి చాదర్ ఘాట్ వద్ద ముగుస్తుంది. శిక్షణ ఇచ్చిన ఏనుగుపై ఈ ఊరేగింపు సాగుతుంది. **రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# మనసు పలికే మౌన భాష ముద్దొ ప్రపంచ ముద్దు దినోత్సవం - హృదయాల భాషకు అంకితం - జూలై 6...ప్రపంచ ముద్దు దినోత్సవం




ప్రేమ, ఆప్యాయత, అనురాగం, స్నేహం, గౌరవం%ా% మానవ సంబంధాల్లోని ఈ నిశ్చలమైన భావాలకు ప్రతీకగా నిలిచే ముద్దు. ఈ మానవీయ భావాల్ని మౌనంగా, కానీ శక్తివంతంగా వ్యక్తపరిచే సాధనం ముద్దు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూలై 6న ప్రపంచ ముద్దు దినోత్సవం జరుపు కుంటారు. ఈ రోజును ముద్దు యొక్క ప్రాముఖ్యతను, అది మానవ సంబంధాల్లో పోషించే స్థానం గుర్తు చేసుకునేందుకు అంకితం చేయడం విశేషం. ముద్దు వెనుక చరిత్రను పరిశీలిస్తే, ఇది చాలా పురాతనమైన ఆనవాయితీ. కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, వేదాల్లో "సువాసన పీల్చడం" అనే భావన ద్వారా ముద్దు ప్రస్తావించ బడినట్లు అర్థమవుతుంది. రోమన్లు, గ్రీకులు, ఈజిప్షియన్లు వంటి అనేక ప్రాచీన నాగరికతల్లో ముద్దు అనేది ప్రేమ, గౌరవం, విధేయతకు సంకేతంగా భావించ బడేది. కాలక్రమేణా, ముద్దు వ్యక్తిగత, సామాజిక, మానసిక బంధాలకు స్థిరతనిచ్చే భావ ప్రకటనగా పరిణమించింది. ప్రపంచ ముద్దు దినోత్సవం 1990వ దశకంలో యునైటెడ్ కింగ్‌డమ్‌లో మొదలైంది. అప్పటివరకు ముద్దును ఎక్కువగా శృంగార భరితంగా మాత్రమే పరిగణించేవారు. కానీ ఈ దినోత్సవం ద్వారా ముద్దులోని మానవీయత, హృదయానికి హృదయం మధ్య అనుసంధానం అనే విశాల అర్థాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రేమికుల మధ్య మాత్రమే కాదు, తల్లిదండ్రులు %–% పిల్లలు, స్నేహితులు, కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం బలపడే సందేశంగా ముద్దు నిలిచింది. ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ముద్దుతో వ్యక్తమయ్యే అనేక భావోద్వేగాలను గుర్తు చేసుకోవచ్చు. ముద్దు ఒక ఆప్యాయత సంకేతం. ఇది మనసుల మధ్య దూరాన్ని తగ్గించే అభివ్యక్తీకరణ. భయపడిన వారికి ధైర్యాన్నిస్తుంది, బాధలో ఉన్నవారికి ఓదార్పునిస్తుంది, ప్రియమైన వారికి ప్రేమను తెలియజేస్తుంది. చిన్నపిల్లలకు, తల్లిదండ్రులు పెట్టే ముద్దు ఆశీర్వాదం సమానంగా భావించ బడుతుంది. వైజ్ఞానికంగా కూడా ముద్దు యొక్క ప్రయోజనాలు అనేకం. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది, ఆనంద హార్మోన్లను విడుదల చేస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో, రోగ నిరోధక వ్యవస్థను బలపర్చడంలో ముద్దు పాత్ర ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. పైగా, మానసిక ఉల్లాసాన్ని కలిగించే ముడిపడిన శారీరక ప్రక్రియలతో ముద్దు అనుబంధమై ఉంటుంది. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు తమ ప్రియమైన వారితో ముద్దులు పంచుకుంటారు. కొందరు ప్రత్యేకంగా ఈ దినోత్సవాన్ని సెలవుగా భావించి పార్టీలను, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సోషల్ మీడియాలో వరల్డ్ కిస్ డే ట్యాగ్ లతో తమ అనుభవాలను పంచుకుంటారు. ఇది ప్రేమతో కూడిన అనుబంధాన్ని పునర్నిర్మించుకునే అవకాశంగా నిలుస్తుంది. ప్రపంచంలో ప్రతి సంస్కృతిలో ముద్దుకు ప్రత్యేక స్థానం ఉంది. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ వంటి దేశాల్లో బుగ్గపై ముద్దు సామాజిక అభివాదంగా గౌరవించ బడుతుంది. భారత దేశంలో ముద్దు సాధారణంగా కుటుంబ, ప్రేమ సంబంధాల్లో వ్యక్తిగతంగా వ్యక్తమవుతుంది కానీ బహిరంగ ప్రదర్శనగా మాత్రం స్వీకరించ బడదు. జపాన్, చైనా వంటి దేశాల్లో అది మరింత నిగూఢ భావనగా కనిపిస్తుంది. అయితే భారతీయ సంస్కృతిలో 'ముద్రా' అనే పదంతో ముద్దును పర్యాయంగా పరిగణించడం, ఆధ్యాత్మిక గ్రంథాల్లోని పలు వివరాల ద్వారా ప్రేమాభివ్యక్తీకరణకు స్థానం కల్పించడం విశేషం. మొత్తానికి, ముద్దు అనేది శారీరక కదలిక మాత్రమే కాదు %–% అది హృదయాల మధ్య సంభాషణ. ప్రపంచ ముద్దు దినోత్సవం మనందరికీ ఇది గుర్తుచేస్తుంది. మానవ సంబంధాలలో మృదుత్వం, అనురాగం, ఆప్యాయత వంటి విలువలను నిలబెట్టేందుకు, ప్రేమను వ్యక్త పరచేందుకు ఈ రోజున ముద్దు ఒక మార్గమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# హైదరాబాదీ క్రికెట్ ఆల్ రౌండర్ జయసింహా - జూలై 6... ఎం.ఎల్.జయసింహా వర్ధంతి

భారత దేశంలో క్రికెట్ అంతగా ప్రాచుర్యం పొందని రోజుల్లోనే స్టైలిష్ క్రికెటర్ గా తెరపైకి వచ్చిన సాటిలేని మేటి హైదరాబాదీ క్రికెట్ లెజెండ్ ఎం. ఎల్.జయసింహ. పదిహేనేళ్ల వయసులోనే హైదరాబాద్ జట్టు తరపున ఆంధ్రప్రదేశ్ జట్టుపై ఆడిన తొలి మ్యాచ్ లో తొంభై పరుగులు సాధించి, అందరి దృష్టినీ ఆకర్షించాడు. క్రికెట్ ప్రపంచంలో "కలివేటెడ్ స్టైలిస్ట్'గా గుర్తింపు పొందిన ఎం.ఎల్.జయసింహగా చిరపరిచితులైన మోటగానహళ్ళి లక్ష్మీనరసు జయసింహ సికింద్రాబాద్ లో 1939 మార్చి 3న జన్మించాడు. అయన చదువు సంధ్యలన్నీ ఇక్కడే సాగాయి, హైదరాబాద్ జట్టు తరఫునే ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో అరంగేట్రం చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.... ఇలా అన్ని అంశాల్లోనూ రాణించి ఆల్ రౌండర్‌గా సత్తా చాటుకున్నాడు. క్రికెట్లో ఇప్పటి రికార్డులతో పోల్చి చూస్తే జయసింహ రికార్డులు పెద్దగా అనిపించక పోవచ్చు. అయితే, అప్పటి పరిస్థితుల్లో ఆయన సాధించిన రికార్డులు తక్కు వేమీ కాదు. అప్పట్లో ఆధునిక క్రికెట్ కోచింగ్ సౌకర్యాలు అంతంత మాత్రమే. ఇప్పటిలా అప్పట్లో క్రికెటర్లకు ఆకర్ష ఆకర్షణీయమైన ఆదాయావకాశాలు ఉండేవి కాదు. అలాంటి పరిస్థితుల్లో రాణించడం అంత తేలిక కాదు. ఫస్ట్ క్లాస్ క్రికెట్లో తొలి మ్యాచ్లోనే తొంభై పరుగులతో శుభారంభం చేసిన జయసింహ, ఆ తర్వాత మద్రాస్, మైసూరు జట్లతో ఆడిన మ్యాచ్లలో సెంచరీలు కొట్టాడు. అదే సీజన్లో రంజీ మ్యాచ్ లలో పౌలర్‌గా కూడా రాణించి, ఇరవై వికెట్లు తీసి, 1959లో ఇంగ్లండ్ కు వెళ్లిన భారత క్రికెట్ జట్టులో చోటు సంపాదించుకున్నాడు. లార్డ్స్ మైదానంలో తొలి అంతర్జాతీయ టెస్ట్ ఆడాడు. తొలి టెస్ట్ లో విఫలమైనా, ఆ తర్వాతి రెండు టెస్ట్ మ్యాచ్ లలోనూ రాణించి, క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షించాడు. ఒక టెస్ట్ మ్యాచ్ లో వరుసగా ఐదురోజులూ బ్యాటింగ్ చేసిన తొలి క్రికెటర్ గా జయసింహ ఘనత సాధించాడు. ప్రపంచంలో ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్ జయసింహ అయితే, ఈ ఘనత సాధించిన రెండో భారత క్రికెటర్ రవిశాస్త్రి. ఆస్ట్రేలియా జట్టుపై 1960లో కలకత్తాలో ఆడిన మ్యాచ్ లో జయసింహ తొలిరోజు ఆట ముగిసే సమయంలో బ్యాటింగ్ ప్రారంభించాడు. రెండో రోజు ఇరవై పరుగుల వద్ద ఉండగా, ఇన్నింగ్స్ డిక్లేర్ చేశారు. సెకండ్ ఇన్నింగ్స్ లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి మళ్లీ బ్యాటింగ్ అవ కాశం వచ్చింది. నాలుగో రోజంతా బ్యాటింగ్ చేసి 59 పరుగులు చేశాడు. చివరిగా ఐదో రోజు 74 పరుగుల వద్ద ఔటయ్యాడు, రెండేళ్ల తర్వాత పాకిస్తాన్ జట్టుపై కాన్పూర్ లో ఆడిన టెస్ట్ మ్యాచ్ లో ఒక సింగిల్ రన్ కోసం తొందర పడి 99 పరుగుల వద్ద ఔటయ్యాడు. తొలి నాళ్లలో మిడిల్ ఆర్డర్ బ్యాట్స్ మన్ గా ఉన్న జయసింహ, క్రమంగా ఓపెనర్‌గా ఎదిగాడు. ఓపెనర్‌గానే ఇంగ్లాండ్, శ్రీలంక జట్లపై సెంచరీలు చేశాడు. వెస్ట్ ఇండీస్ పై 1970 – 71 లో చివరి టెస్ట్ సిరీస్ ఆడిన జయ సింహ, జూనియర్లకు మార్గదర్శిగా ఉండేవాడు. ఆటలో జయసింహ ఇచ్చిన సలహాలు విలువైనవని మాజీ కెప్టెన్ అజిత్ వాడేకర్ కొనియాడటమే ఇందుకు నిదర్శనం. మరో మాజీ కెప్టెన్ నవాబ్ మహమ్మద్ మన్సూర్ అలీఖాన్ పటౌడీ (టైగర్ పటౌడీ) సైతం జయసింహ నాయకత్వంలో పలు మ్యాచ్ లు ఆడాడు. 'లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ బ్యాటింగ్ శైలిలో జయసింహనే గురువుగా పరిగణించేవాడు. క్రికెటర్ గా విరమించుకున్నాక కొన్నాళ్లు సెలెక్టర్ గా, శ్రీలంక పర్యటనలో భారత జట్టుకు మేనేజర్ గా వ్యవహరించాడు. కొన్నాళ్లు కామెంటేటర్ గానూ ఆటతో బాంధవ్యాన్ని కొనసాగించిన జయసింహ, 1999 జూలై 6న లంగ్ కేన్సర్ తో సైనిక్ పురిలోని తన నివాసంలో కన్ను మూశాడు.




**జయసింహ ట్రాక్ రికార్డును చూస్తే...** జయసింహ 39 టెస్టు మ్యాచులలో 2056 పరుగులు చేసి, 30.68 బ్యాటింగ్ సరాసరి సాధించాడు. 3 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు సాధించి, 129 అత్యధిక స్కోరు సాధించాడు. అలాగే 2097 బంతులు బౌలింగ్ చేసి, 92.11 బౌలింగ్ సరాసరితో 9 వికెట్లు సాధించాడు. 54 పరుగులు ఇచ్చి 2వికెట్లు తీసుకున్నట్లు, 27 క్యాచ్ లు పట్టినట్లు నమోదై ఉంది. అలాగే 245 ఫస్ట్ క్లాస్ మ్యాచ్ లు ఆడి, 37.44 బ్యాటింగ్ సరాసరితో 13,526 పరుగులు చేసి, 359 అత్యధిక స్కోరుతో 33 సెంచరీలు, 65 అర్ధ శతకాలు సాధించాడు. 37771 బంతులు వేసి, 431 వికెట్లు పడగొట్టి, 29.86 సరసరితో 3 మ్యాచుల్లో... ఒక ఇన్నింగ్స్ లో 10 వికెట్లు, 18 మ్యాచుల్లో... ఇన్నింగ్స్ లో 5వికెట్లు తీసి, 45పరుగులు ఇచ్చి 7వికెట్లు ఇన్నింగ్స్ లో తీసిన, 157 క్యాచ్ లు పట్టిన రికార్డు సొంతం చేసుకున్నాడు.

**రామ కిష్టయ్య సంగనభట్ల – 9440595494**

# 'వీధి'రాత మారేలా...!

మిర్యాలగూడ : రోజువారీ వ్యాపారాలు, పనులు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న వీధి వ్యాపారులకు మరింత భరోసా ఇచ్చే విధంగా ప్రభుత్వం సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2009 నుంచి కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారుల హక్కుల రక్షణ చట్టం రూపొందించింది. ఈ చట్టం ప్రకారం వీధి వ్యాపారాలను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేసి, పట్టణాల్లో వ్యాపార జోన్లు నిర్ణయించి నిర్ణీత సమయాల్లో వ్యాపారాలు చేసుకునేలా రక్షణ కల్పించాలని నిర్ణయించారు. 2011 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించగా.. పట్టణాల్లో వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని గుర్తించిన మెప్మా విభాగం వారు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆ తర్వాత వారికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వం నుంచి విడతల వారీగా రుణాలు అందజేశారు. మొదట రూ.10వేలు, ఆ తర్వాత రూ.20వేలు, మూడోదశలో రూ.30వేల రుణాలు అందించారు. సక్రమంగా చెల్లింపులు జరిపిన వారికి బ్యాంకుల నుంచి వెంటనే రుణాలు అందేలా



మెప్మా అధికారులు పర్యవేక్షించారు. ఎన్నికలు ఇతర కారణాలతో మూడేళ్లుగా ఈ ప్రక్రియ నిలిచిపోయింది.

తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వీధి వ్యాపారులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి మహిళా సంఘాల తరహాలో రుణాలు అందించాలని నిర్ణయించింది. దీంతో నల్గొండ జిల్లాలోని ఎనిమిది పురపాలికల్లోని మెప్మా అధికారులు సంఘాలను ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 17,166 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించగా.. ఇప్పటి వరకు 15 సంఘాలను ఏర్పాటు చేశారు. స్వయం సహాయక సంఘాల తరహాలోనే వివిధ రకాల వ్యాపారాలు చేసుకునే వారిని వారి వ్యాపారాలకు తగిన విధంగా గుర్తించి సంఘాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని మెప్మా పట్టణ మిషన్ కో- ఆర్డినేటర్ బక్కయ్యకు తెలిపారు.

# ఔషధం అరకొరే..!

నల్గొండ : నకిరేకల్‌కు చెందిన బి.సైదులు, జ్వరం ఇతర సమస్యలతో బాధపడుతూ నకిరేకల్ సర్కారు వైద్యశాలకు వచ్చాడు. వైద్యులు రక్త, మూత్ర పరీక్షలు చేయించారు. మూడు రకాల మాత్రలు, ఒక సిరప్ రాశారు. ఆసుపత్రిలో మాత్రలు ఇచ్చి సిరప్ లేదన్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో బయట మందుల దుకాణంలో సిరప్ కొనుగోలు చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని ఉచితంగా అందుతాయని వచ్చానని, సగం మందులే దొరికాయని అతను వాపోయాడు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు జిల్లాలో విజృంభిస్తున్నాయి. రోగులు అదే స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. కాని దానికి తగినట్లుగా పూర్తి స్థాయిల్లో మౌలిక వసతులు, మాత్రలు, సర్జికల్స్ లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉన్నతాధికారులతో పాటు కిందిస్థాయి ఫార్మాసిస్టులు, సిబ్బంది ముందు చూపు లేమి కారణంగా మందుల కొరతల సమస్యలు తలెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రిలో 562 రకాల మాత్రలు, 620 రకాల సర్జికల్స్ అందుబాటులో ఉండాల్సి ఉండగా.. 25 శాతం వరకు కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఆసుపత్రికి వచ్చే రోగులు వైద్యులు రాసే కొన్ని రకాల మాత్రలను బయట షాపుల్లో కొనుగోలు చేయాల్సి వస్తోంది. మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, నకిరేకల్, మర్రిగూడ ఏరియా ఆసుపత్రుల్లో 410 రకాల మందులు, 480 రకాల సర్జికల్స్ ఉండాల్సి ఉండగా 40 శాతం వరకు కొరత ఉన్నట్లు కన్పిస్తుంది. జిల్లాలో 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు యూపీహెచ్‌సీల్లో సైతం 35 నుంచి 40 శాతం కొరత ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 562 రకాల మాత్రలు, 620 రకాల సర్జికల్స్ ఉండాల్సి ఉండగా.. అన్నిరకాల మాత్రలు, సర్జికల్స్ ఉన్నాయని స్టోర్ ఇన్‌ఛార్జి జగదీశ్వర్ తెలిపారు. నకిరేకల్‌లో అత్యవసర పరిస్థితి ఉంటే ఆసుపత్రి నిధి నుంచి స్థానికంగా



ఆ మందులు తెప్పించి చికిత్సలు అందిస్తున్నామని వైద్యులు అంటున్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని బస్తీ దవాఖానాలకు అరకొరగానే మందులు సరఫరా అవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మురికివాడల్లో నిరుపేదలకు వైద్య సేవలు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలకు నిర్ణీత ప్రణాళిక ప్రకారం మందులు సరఫరా చేయడం లేదు. జ్వరం, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు మాత్రమే మందులు అందిస్తున్నారు. ఇతర సమస్యలకు అవసరమైన మందులు సకాలంలో సరఫరా చేయడం లేదు. రోగులకు వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన సిబ్బందిని నియమించకపోవడంతో ఆశించిన మేరకు రోగులకు వైద్య సేవలు అందడం లేదు.

**ఇబ్బంది లేకుండా చూస్తున్నాం**

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో కావాల్సిన మాత్రలు అందుబాటులో ఉన్నాయి. లేని మాత్రలు, సర్జికల్స్ ఆరోగ్యశ్రీ పథకం కింద వచ్చే నిధులతో రోగులకు అందిస్తున్నాం. ఎక్కడైనా మందులు లేవని బాధితులు ఫిర్యాదు చేస్తే వెంటనే సీడీఎస్ నుంచి దిగుమతి చేసి అందుబాటులో ఉంచుతాం. రోగులకు మెరుగైన వైద్యంతో పాటు కావాల్సిన మాత్రలు ఇస్తున్నాం.

# ఆపత్కాలంలో అండగా..




కరీంనగర్ : అగ్ని, రోడ్డు, భవనాలు, పరిశ్రమల్లో ప్రమాదాలు ఏర్పడితే ప్రాణ, ఆస్తిని రక్షించడానికి ఎస్‌డీఆర్‌ఎఫ్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ముందుంటుంది. ఇదే విభాగాన్ని ఇప్పుడు ఉమ్మడి జిల్లా కేంద్రంగా కరీంనగర్ అగ్నిమాపకశాఖలో సైతం ఏర్పాటు చేశారు. **9 నెలల శిక్షణ** కొత్తగా ఏర్పాటైన ఎస్‌డీఆర్‌ఎఫ్ విభాగం సిబ్బంది మూడు నెలలపాటు జాతీయ విపత్తు, రక్షణ విభాగం నాగ్‌పూర్‌లో వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. ఇప్పుడు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అత్యవసర సహాయం చేయడానికైనా వెళ్లనున్నారు. నాలుగు రోజుల కింద పటాన్‌చెరువు మండలం పాశమైలారంలోని మందుల పరిశ్రమ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం జరగ్గా కరీంనగర్‌కు చెందిన ఈ విభాగం అక్కడికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొంది. ఈ విభాగానికి కొత్తగా 3 రెస్క్యూబోట్లు, 50 లైఫ్ జాకెట్స్, 50 లైఫ్‌బైయ్స్, ఒక ట్రాలీ బోట్‌ను కేటాయించారు. మరికొన్ని రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ విభాగం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

**ఉమ్మడి జిల్లా కేంద్రంగా..**

అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, నీటి ప్రమాదాలు జరిగిన సమయంలో ఇప్పటి వరకు అగ్నిమాపకశాఖ సిబ్బంది మాత్రమే తమవంతు సాయం అందించేవారు. కొన్ని అత్యవసర పరిస్థితుల్లో ఇతర అగ్నిమాపక కేంద్రాల సహాయం తీసుకోవాల్సి ఉంటోంది. ఇలాంటి ఘటనలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా కేంద్రంగా 13 అగ్నిమాపక కేంద్రాలకు అత్యవసర విభాగం కింద ఎస్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాలో అత్యవసర సేవలు అందించాలంటే ఈ విభాగం తక్షణం అక్కడికి వెళ్తుంది. కరీంనగర్ అగ్నిమాపకశాఖ అధికారి పర్యవేక్షణలో లీడ్ ఫైర్‌మెన్‌తోపాటు 10 మంది సిబ్బందిని కేటాయించారు. ఈ ప్రత్యేక విభాగానికి మినీ బస్సు, సామగ్రి తరలించేందుకు వ్యాన్ కేటాయించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎక్కడ పెద్ద ప్రమాదం జరిగినా వీరు అక్కడికి వెళ్తారు.

ఎంతో ఉపయోగం

-శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ అగ్నిమాపక శాఖ అధికారి

అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ఏర్పాటు చేసిన ఎస్‌డీఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విభాగం అన్ని విపత్కర పరిస్థితుల్లో సహాయక చర్యలను చేపడుతుంది. ఉమ్మడి జిల్లా కేంద్రంగా సేవలందించనుంది. ప్రత్యేక సిబ్బందిని సైతం కేటాయించడంతో అగ్నిమాపకశాఖకు మరింత బలం చేకూరింది.

# ఇంధన దోపిడీపై చర్యలేవీ!



జగిత్యాల : జగిత్యాల పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ తదితర అవసరాల కోసం వాహనాలకు వినియోగించే డీజిల్ కొందరికి నిత్య ఆదాయ వనరుగా మారింది. పాలకవర్గం లేకపోవడం, కమిషనర్లు తరచూ బదిలీ అవుతుండటంతో ఇంధన వినియోగం పూర్తిగా దారి తప్పింది. పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణకు మొత్తం 72 వాహనాలున్నాయి. వీటికి రెండేళ్లుగా ప్రతి నెలా రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల్లోపు డీజిల్ బిల్లు అవుతోంది. కాగా గత మార్చి నెలలో అత్యధికంగా రూ.16,27,157 వ్యయం కావడం చర్చనీయాంశమైంది.

**పర్యవేక్షణ మృగ్యం**

వాస్తవంగా వాహనాలకు ఇంధనం నింపే క్రమంలో బాధ్యుడైన అధికారి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పురపాలక వాహనం నంబరు ఆధారంగా ఏ వాహనానికి ఎంత మేర డీజిల్ వాడారనే పక్కా సమాచారం ఉండాలి. ఇవేవీ లేకుండానే డీజిల్ బిల్లులు రూపొందించారు. మార్చి నెలలో బాధ్యతలు చేపట్టిన కమిషనర్ స్పందన బిల్లులు మంజూరు చేశారు. పురపాలక ఇంధన వినియోగంలో పెద్ద మొత్తంలో తేడా రావడం విమర్శలకు తావిచ్చింది. వాహనాలు, వినియోగం సాధారణంగానే ఉన్నా ఏకంగా రూ.6 లక్షలు అధికంగా వ్యయం కావడంపై కమిషనర్ సైతం ప్రత్యేక దృష్టి సారించారు. ఏప్రిల్‌లో బాధ్యులను కట్టుదిట్టం చేయడంతో బిల్లు రూ.11 లక్షల మేర వచ్చింది. ఆ తర్వాత ఇంధన వినియోగం పర్యవేక్షణ బాధ్యతను కమిషనర్ వార్డు అధికారికి అప్పగించారు. వార్డు అధికారి ఇచ్చిన వోచర్ ఆధారంగా బంకుల్లో డీజిల్ నింపుతున్నారు. బంకుల్లో ఇచ్చే రసీదు ఆధారంగా బిల్లులు చెల్లిస్తున్నారు. మే నెల బిల్లు మరింత తగ్గి రూ.9 లక్షలు మాత్రమే వ్యయం కావడం గమనార్హం.

**మూడు నెలలైనా చర్యలు కరవు**

పురపాలికలో డీజిల్ వినియోగంలో రూ.6 లక్షల మేర అదనపు వ్యయం చూపి అక్రమాలకు పాల్పడిన వారిపై ఇప్పటివరకు చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కమిషనర్ స్వరూపరాణి హయాంలో ఒకే నెలలో రూ.4 లక్షల మేర అక్రమాలు జరిగాయి. ఆమె వెంటనే సిబ్బందిపై చర్యలు చేపట్టడంతో వరుసగా 4 నెలల్లో ప్రతి నెలా రూ.4 లక్షలు ఆదా చేశారు. రెవెన్యూ, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి ఒకరిద్దరు సిబ్బంది డీజిల్ అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. ఉన్నతాధికారులు వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. బల్దియా వాహనాలకు డీజిల్ వినియోగంపై పర్యవేక్షణ పెంచామని, దుబారా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ స్పందకు తెలిపారు.

# ముందస్తు టీకా.. జీవాలకు రక్ష



నల్గొండ : వర్షాకాలంలో గొర్రెలు, మేకల్లో వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. కొత్తగా మొలకెత్తిన గడ్డిపైకి బురదలోని బ్యాక్టీరియా చేరుతుంది. ఆ గడ్డిని తిన్నప్పుడు జీవాల్లో సమస్యలు తలెత్తుతాయి. ఈ క్రమంలో జీవాల్లో పారుడు వ్యాధి నివారణకు వ్యాక్సిన్ వేయనున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న గొర్రెలు, మేకలు 3 నెలల నుంచి ఏడాది లోపు ఉన్న వాటికి పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వ్యాక్సిన్ అందించనున్నారు. నల్గొండ జిల్లాలో గొర్రెలు 9,12,625, మేకలు 3,36,182 ఉన్నాయి. జూన్ 28 నుంచి ఈనెల 10 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

పారుడు వ్యాధి ఒక జీవానికి సోకితే మిగతా వాటికి వ్యాపించే అవకాశం ఉంది. అన్ని గ్రామాల్లోని జీవాల్లో పశువైద్యులతో పాటు సిబ్బంది కేంద్ర ప్రభుత్వం అందించే వ్యాక్సిన్ వేయనున్నారు. అయిదేళ్లు వరుసగా వ్యాక్సిన్ అందించడం వల్ల జీవాల్లో పారుడు వ్యాధి తగ్గుతుంది. మరణాలు సంఖ్య తక్కువగా ఉంటుందని పశువైద్యాధికారులు చెబుతున్నారు. టీకాలు వేసేందుకు మండలాల వారీగా బృందాలు ఏర్పాటు చేశారు. జిల్లా మొత్తం 58 వరకు పనిచేస్తాయి. వ్యాక్సిన్ వేశాక వైద్యులు జీవాల సంఖ్యను యాప్‌లో నమోదు చేస్తారు.

**వ్యాధి లక్షణాలు..**

ఇది వైరస్ వల్ల వస్తుంది. వ్యాధి సోకినప్పుడు అది ఒక గొర్రె, మేక నుంచి మిగతా వాటికి సోకే అవకాశం ఉంది. జీవాలకు అధిక జ్వరం వస్తుంది. మేత మేయకుండా ఉంటాయి. పేగులు చెడిపోయి.. విరేచనాలు అధికంగా అయి కొన్ని సార్లు జీవాలు మరణిస్తాయి.

**నియామకం**

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ ఛైర్మన్‌గా కోమటిరెడ్డి నర్సింహారెడ్డిని నియమిస్తూ ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి, రాష్ట్ర సంఘం అధ్యక్ష కార్యదర్శులకు నర్సింహారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన గతంలో జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షులుగా సేవలందించారు.

**పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలి**

జీవీ రమేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, నల్గొండ

పారుడు వ్యాధి వ్యాక్సిన్ గ్రామాల్లో పశు వైద్యులు గొర్రెలు, మేకలకు వేస్తున్నారు. జీవాల పెంపకందారులు దీనిని ఉపయోగించుకోవాలి. దీనికోసం మండలాల వారీగా బృందాలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో వ్యాక్సిన్ వేసే ఒక రోజు ముందు టాంటాం చేయిస్తాం.

# పొదుపే శ్వాసే.. అధికవడ్డీ ఆశే

మిర్యాలగూడ : సాధారణ పేద, మధ్య తరగతి ప్రజలు..రోజు వారీ పనులు చేసి సంపాదించే దాంట్లో కొంత దాచుకోవాలని అనుకుంటారు. ఇంట్లో దాచిపెడితే ఏదో ఒక అవసరానికి వాడేస్తామనే భయంతో తెలిసిన వారి వద్ద.. బంధువులకు తెలిసిన వారి వద్ద చిట్టీలు కట్టడం సహజం. ఇటీవల కాలంలో పలువురు చిట్టీల వ్యాపారులు కొంత కాలం తర్వాత బోర్డు తిప్పేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. మధ్యతరగతి ప్రజలకు డబ్బుపై ఆశతో పాటు..అనేక అవసరాలు ఉంటాయి. దీనిని ఆసరాగా చేసుకుంటున్న మోసగాళ్లు..చిట్టీలు, లక్కీడ్రా స్కీమ్‌లు, అధిక వడ్డీల పేరిట అప్పులు తీసుకుని రూ.కోట్లలో దోచుకుని ఉడాయిస్తున్నారు. వీరు తొలుత కొంత కాలం నమ్మకస్తులుగా ఉంటూ..వారికి క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తారు. చిట్టీలు కట్టించుకునే వారు..చిట్టీ అయిపోయిన, పాడుకున్న వారి వద్ద నుంచి అధిక వడ్డీల ఆశ చూపి నిర్వాహకులే నగదు తీసుకుంటున్నారు. పెద్ద మొత్తం నగదు వస్తే ఏదో ఒక అవసరానికి ఉపయోగపడుతుందనే మధ్య తరగతి ప్రజల అమాయకత్వాన్ని చూసి..నట్టేట ముంచుతున్నారు. మరో వైపు ప్రతి నెలా కొంత నగదు కట్టించుకుని..డ్రా తీస్తూ..విజేతలకు ఖరీదైన బహుమతులు అందిస్తామని..చివర్లో తాము చెల్లించిన నగదుకు సరిపడా బహుమతి ఇస్తామని ఇటీవల కొన్ని బోగస్ సంస్థలు వేలాది మంది నుంచి



రూ.కోట్లలో వసూలు చేసి బోర్డు తిప్పేశాయి.

**ఇటీవల జరిగిన ఘటనలు కొన్ని...**

ః మిర్యాలగూడ ప్రాంతంలో లక్కీ డ్రా పేరుతో ఓ సంస్థను స్థాపించి వేలాది అమాయకుల నుంచి రూ.కోట్లతో నగదు వసూలు చేసి కనిపించకుండా పోయారు.

ః పీఏ పల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి అమాయక గిరిజనుల నుంచి అధిక వడ్డీల పేరుతో రూ. కోట్లలో అప్పులు తీసుకుని జల్సాలు చేస్తున్న ఉదంతం ఇటీవల కలకలం సృష్టించింది.

ః మిర్యాలగూడ పట్టణంలో చిట్టీలు, వడ్డీల పేరుతో రూ.కోట్లతో వసూలు చేసి..తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఓ మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

కె. రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడఆర్థిక లావాదేవీల అంశంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని వారి వద్ద, అనుమతులు లేని వారి వద్ద చిట్టీలు వేయడం, బహుమ తులు, రెట్టింపు నగదు ఆశ చూసే సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ఎంత మాత్రం శ్రేయస్కరం కాదు. అధిక వడ్డీల ఆశతో అప్పులు ఇవ్వడం కూడా సరైంది కాదు. ఆర్బీఐ అనుమతులు ఉన్న సంస్థల్లో పెట్టుబడులు, జాతీయ బ్యాంకుల్లో నగదు దాచుకుంటేనే భరోసా ఉంటుంది.

# 'సంపు'తోంది..!

కోదాడ : ప్రమాదకరంగా సంపు కనిపిస్తున్న ప్రాంతం కోదాడ పట్టణంలోనిది. ఇలాంటి ప్రమాదకరమైన సంపులోనే పడి చిన్నారులు మృతి చెందుతున్నారు. అయినా కొందరు సంపులను ఇలా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. చిన్నారులే కాదు పెద్దవారూ ఇలాంటి సంపులో పడితే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఇంటి యజమానులు సంపులో చిన్నారులు పడకుండా ప్రత్యేకంగా గ్రిల్, బండలు ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు నివారించొచ్చు. మానవ అవసరాల నిమిత్తం ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఏర్పాటు చేసుకున్న నీటి సంపులతో ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. అభం శుభం తెలియని చిన్నారుల పాలిట అవి యమపాశాలుగా మారుతున్నాయి. ఇంట్లో చిన్నారులు ఉన్నారని తెలిసి కూడా పెద్దలు సంపుల నిర్వహణపై నిర్లక్ష్యం వహించడం వారికి శాపంగా మారుతోంది.

కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన దంపతుల 20 నెలల కుమారుడు మంగళవారం నీటి సంపులో పడి మృత్యుఒడికి చేరిన విషాద ఘటన అందరినీ కలిచివేసింది. రోజులాగే తల్లి అన్నం తినిపించి చిన్నారిని పడుకోబెట్టింది. నిద్ర లేచిన చిన్నారి ఆడుకునేందుకు ఇంటి వెనక ఉన్న సంపు దగ్గరికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడిపోయి మృతి చెందాడు.

గతేడాది అనంతగిరి మండలంలోని ఓ గ్రామంలో ఇంట్లో చిన్నారి ఆడుకుంటూ ఉండటంతో తల్లిదండ్రులు పర్యవేక్షించడం మరిచారు. ఇంట్లోని బకెట్ నిండా నీళ్లు ఉండడంతో చిన్నారి ఆ నీటితో ఆడుకుంటున్న క్రమంలో తల బకెట్‌లోకి ముంచడంతో బోర్లా పడ్డాడు. ఊపిరాడక రెండేళ్ల చిన్నారి మృతి చెందాడు.



**తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

సంపు మీద ఏర్పాటు చేసిన బిల్లలు పగిలిపోతే వెంటనే కొత్తవి ఏర్పాటు చేసుకోవాలి. చిన్నారులను సంపుల సమీపంలో ఆడకుండా జాగ్రత్తలు చేపట్టాలి.

సంపులో పడిపోతే ప్రమాదం అనే భయాన్ని పిల్లలకు నేర్పించాలి.

సంపు మీద ఇనుముతో తయారు చేసిన గ్రిల్ ఏర్పాటు చేసుకుంటే ప్రమాదాలు అరికట్టవచ్చు.

తల్లిదండ్రులు చిన్నారులు ఆడుకునే సమయంలో పొంచి ఉన్న ప్రమాదాలను పసిగట్టాలి.

ఆడుకునే సమయంలో ఎలాంటి పనులు పెట్టుకోకుండా నిరంతరం పర్యవేక్షించాలి.

**పర్యవేక్షణ తప్పనిసరి**

శ్రీధర్‌రెడ్డి, డీఎస్పీ, కోదాడ

చాలా మంది ఇళ్లలో ఏర్పాటు చేసుకున్న సంపులను పటిష్ఠపరచాలి. చిన్నారులు సంపుల వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆడుకునే సమయంలో కొందరు తల్లిదండ్రులు పిల్లలను వదిలేసి ఇంట్లో పనులు చేసుకుంటున్నారు. దీంతో చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలా కాకుండా పర్యవేక్షణ తప్పనిసరి చేసుకోవాలి.

చురకలు


# వైద్యులున్నా.. పరికరాలు కరవు

హుజూరాబాద్ : హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల ప్రజలకు హుజూరాబాద్ ఏరియా, జమ్మికుంట ఆసుపత్రులే పెద్దదిక్కు. ఈ ఆసుపత్రుల్లో వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రిలో 22, జమ్మికుంటలో 11 మంది వైద్యులున్నారు. ఈ రెండు ఆసుపత్రులకు మూడు నియోజకవర్గాల నుంచే కాకుండా హనుమకొండ జిల్లా నుంచి రోగులు, గర్భిణులు వస్తుంటారు. రెండు ఆసుపత్రుల్లో నిత్యం సుమారు 600 మంది వరకు ఓపీ నమోదవుతుంది.

**స్కానింగ్ యంత్రాలేవి?:** హుజూరాబాద్ 100 పడకల ఆసుపత్రిలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రం ఉన్నా అది పని చేయటం లేదు. గర్భిణులు, జనరల్ శస్త్ర చికిత్సలకు ఉపయోగపడే యంత్రం అందుబాటులో లేకపోవటంతో నిరుపేదలపై ఆర్థిక భారం పడుతుంది. జనరల్ సర్జన్ ఉన్నప్పటికీ లాప్రోస్కోపీ యంత్రం లేదు. దీంతో



సాధారణ శస్త్రచికిత్సలే చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వినియోగించే మల్టీ పారా మానిటర్‌లు కేవలం రెండు మాత్రమే ఉండగా ఒకటి క్యాజువాలిటీలో మరొకటి శస్త్రచికిత్స గదిలో ఉంచారు. అత్యవసర సమయాల్లో ఉపయోగపడే దయాథెర్మీ ఒకటే ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జమ్మికుంట 30 పడకల ఆసుపత్రిలో ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాలు లేవు. ఎవరైనా గాయపడి ఆసుపత్రికి వస్తే ఎక్స్‌రే కోసం ప్రైవేటుకు వెళ్లాల్సిందే.

**అందుబాటులో ఉన్న పరికరాలతో సేవలు**

– డాక్టర్ నల్ల నారాయణరెడ్డి, సూపరింటెండెంట్

నాణ్యమైన వైద్య సేవలనందించటమే లక్ష్యంగా పెట్టుకొన్నాం. స్కానింగ్ యంత్రం పని చేయకపోవడం వాస్తవమే. అందుబాటులో ఉన్న పరికరాలతో వైద్యులు సేవలందిస్తున్నారు. వైద్య పరికరాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

# సిగాచీ పరిశ్రమలో నిపుణుల కమిటీ అధ్యయనం

సంగారెడ్డి: పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో 38 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ బృందం పరిశ్రమను పరిశీలించింది. అగ్నిప్రమాదం జరిగిన తీరుపై అధ్యయనం చేస్తోంది. కార్మికుల భద్రతకు యాజమాన్యం నిబంధనలు పాటించిందా? లేదా?అన్న అంశంపై విచారణ చేపట్టింది. నెల రోజుల్లో



ప్రమాదంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది.

ఈ కమిటీకి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) ఎమెరిటస్ శాస్త్రవేత్త డాక్టర్ బి.వెంకటేశ్వరరావు ఛైర్మన్‌గా.. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ టి.ప్రతాప్‌కుమార్, చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సూర్యనారాయణ, పుణెలోని నేషనల్ కెమికల్ ల్యాబ్ భద్రతాధికారి డాక్టర్ సంతోష్ గుగే సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయడంతోపాటు భవిష్యత్తులో కెమికల్, ఫార్మా పరిశ్రమల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సూచనలు, విధివిధానాలతో నివేదిక రూపొందించనుంది.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు మహర్దశ

కరీంనగర్ : ఏళ్లుగా నిధులు లేక సమస్యలు, వసతుల లేమితో సతమతమవుతున్న జూనియర్ కళాశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. నిధులు లేక నీరసించిన కళాశాలల్లో సౌకర్యాల కల్పన, మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. వసతుల లేమితో ప్రవేశాలు తగ్గుతున్న క్రమంలో ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు రూ.6.24 కోట్లు మంజూరయ్యాయి. **41 కళాశాలల్లో..**

ఉమ్మడి జిల్లాలోని 41 ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి మూడు నెలల క్రితమే చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సేకరించారు. పదేళ్ల కిందటి వరకు ప్రభుత్వం నిధులు అందించేది. ప్రస్తుతం రాకపోవడంతో కనీస మరమ్మతులు కూడా కరవయ్యాయి. ఇప్పుడు మంజూరైన నిధులతో విద్యుదీకరణ, శానిటరీ, సివిల్ పనులు, నీటి సరఫరా, బోర్‌వెల్, ప్రహరీల నిర్మాణం వంటివి చేపట్టనున్నారు. నాలుగైదు రోజుల్లో ఇంజినీరింగ్ శాఖతో పనులకు అంచనాలతో నివేదిక తయారు చేసి ప్రిన్సిపాళ్లు డీఐఈవోల ద్వారా జిల్లా పాలనాధికారులకు అందించనున్నారు. అవి ఆమోదం పొందగానే పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. తరగతి గదులు పెచ్చులూడటం, స్విచ్ బోర్డులు ఊడిపోవడం, విద్యుత్తు తీగలు వేలాడటం వంటి సమస్యలు చాలా కళాశాలల్లో ఉన్నాయి. శౌచాలయాలు ఉన్నా నీటి సరఫరా కొరతతో ఉపయోగించేలా లేవు. ఈ సమస్యలన్నీ ప్రస్తుతం మంజూరైన నిధులతో తీరనున్నాయి.

# పీరం స్థలం పిరం.. లబ్ధిదారులకు సున్నం



మొయినాబాద్ : గండిపేట మండలం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరం చెరువు ఇది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. వాస్తవ విస్తీర్ణం 34.20 ఎకరాలు. ప్రస్తుతం 24 ఎకరాలే మిగిలింది. ఇది ఆర్ఆర్ లోపల, జాతీయ రహదారికి పక్కనే ఉండటంతో స్థలానికి మంచి డిమాండ్ ఉంది. ఎకరం రూ.35 కోట్ల వరకు, గజానికి రూ.1.50 లక్షలు పలుకుతోంది. దీంతో సమీపంలోని చెరువులు, కుంటల్లో మట్టి నింపుతూ రాత్రికిరాత్రి నిర్మాణాలు చేపడుతున్నారు. బఫర్ జోన్ పదెకరాలు కబ్జాకు గురైంది. దీని విలువ రూ.350 కోట్ల వరకు ఉంటుందని అంచనా. గతంలో ఓ స్థిరాస్తి వ్యాపారి ఈ చెరువును ఆనుకొని లేఅవుట్ వేశారు. చెరువులోకి చొచ్చుకువచ్చి ఏకంగా 10 ఎకరాలను తన లేఅవుట్‌లో కలిపేసుకుని విక్రయించాడు. తాజాగా కొంతమంది స్థిరాస్తి వ్యాపారులు చెరువును ఆక్రమించి ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నారు. ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెళ్లి పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నిర్మాణాల వెనుక ప్రభుత్వంలోని కీలక వ్యక్తి పాత్ర ఉందని ప్రచారం జరుగుతోంది. ఇది మాదాపూర్ ప్రాంతంలోని సున్నం చెరువు. విస్తీర్ణం 32 ఎకరాలు. జలవనరుల శాఖ ఎన్‌జీటీకి ఇచ్చిన నివేదికలో 15 ఎకరాలని ఉంది. ఇక్కడ 1992లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సర్వే నంబరు 12ఏ, 13లో అధికారికంగా లేఅవుట్ వేశారు. మొత్తం 236 మంది చిన్న పరిశ్రమల ఉద్యోగులు అసోసియేషన్ పేరుతో ప్లాట్లు తీసుకున్నారు. 72 మంది నివేశన స్థలాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని హైడ్రా కూల్చివేతలు చేపట్టడంతో శేరిలింగపల్లి ఎమ్మెల్యే అడ్డుకున్నారు. న్యాయస్థానం నుంచి స్టే ఆర్డరు తీసుకున్నా హైడ్రా ఆగడం లేదన్నది బాధితుల ఆరోపణ. మరోవైపు చెరువు ఆధునికీకరణకు రూ.10 కోట్లు మంజూరయ్యాయి. భూసేకరణ జరపాలంటే ముందుగా నోటీసులు ఇవ్వాలి. పరిహారం చెల్లించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**రూ.లక్ష ఇస్తే లక్షణంగా ఎన్వోసీ**

పీరం చెరువు గర్భంలో, బఫర్ జోన్‌లోనూ కార్పొరేషన్‌తోపాటు హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేసింది. నీటిపారుదల శాఖ అధికారులు ఇచ్చే ఎన్వోసీ ఆధారంగా అనమతులు ఇచ్చామని అధికారులంటున్నారు. అసలు చెరువు విస్తీర్ణం పట్టించుకోకుండా ఎన్వోసీల జారీ వెనుక పెద్దఎత్తున లావాదేవీలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. రూ.లక్ష ఇస్తే లక్షణంగా ఎన్వోసీలు జారీ చేస్తున్నారు. ఇక్కడ పనిచేసిన ఓ ఏఈ అనిశాకు చిక్కారు.

# నిర్వహణ నామమాత్రం.. సమస్య యథాతథం



హైదరాబాద్ : "సాగర్‌రోడ్డులో ఇటీవల 33కేవీ విద్యుత్తు తీగ తెగిపడి ఇద్దరిపై పడటంతో విద్యుదాఘాతంతో కాలిపోయారు. చాలా ఘోరమైన సంఘటన ఇది. దీని తర్వాత కూడా క్షేత్రస్థాయిలో లైన్ల నిర్వహణలో పెద్దగా మార్పులేదు. నిర్వహణ లోపాలు ఉండొద్దని సీఎండీ ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల నుంచి సిబ్బంది వరకు నిర్లక్ష్యం వీడటం లేదు."

నగరంలో కొద్దిరోజులుగా వీస్తున్న చిరు గాలులకు విద్యుత్తు తీగల్లోని లోపాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. తీగల మధ్య ప్రమాణాల మేరకు వదలని ఖాళీలతో, డీటీఆర్‌ల వద్ద వదులుగా ఉన్న తీగల వద్ద స్పార్క్‌తో మంటలు వస్తున్నాయి. మూడేసి గంటలు కరెంట్ నిలిపేసినా నిర్వహణ లోపాలను సరి చేయకుండానే.. చెట్ల కొమ్మలు కొట్టడం వరకే అధికారులు, సిబ్బంది పరిమితమవుతున్నారు.

**ఇష్టారీతిగా లైన్ల మార్పు...**

విద్యుత్తు లైన్లు వేశాక.. వాటిని క్షేత్రస్థాయి సిబ్బంది అక్రమంగా ఇష్టారీతిగా మార్చేస్తున్నారు. రెండు కండక్టర్ల మధ్య తగిన ఖాళీ లేకుండానే జరుపుతున్నారు. గాలి వీచినప్పుడు రెండు తీగలు ఒకదానితో ఒకటి తాకి మంటలు వస్తున్నాయి. చెట్ల కొమ్మలు తాకినా ఇదే పరిస్థితి. రెండు స్తంభాల మధ్య తీగలు వదులుగా ఉండొద్దు.. అలాగని బిగుతుగా ఉండొద్దు. ప్రమాణాల మేరకు తీగలను లాగాలి. అలా నిబంధనలు పాటించకపోవడంతోనే చాలాచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

**లోపాల పుట్ట..:** సాగర్‌రోడ్డు ఘటనే తీసుకుంటే...గుర్తుతెలియని వాహనం మూల మలుపులో ఉన్న స్తంభాన్ని రాసుకుంటూ వెళ్లడంతో స్తంభానికి ఉన్న పాలిమర్ పిన్ ఇన్సులేటర్‌లోని మెటల్ రాడ్ విరిగిపోయిందని అధికారులు చెప్పారు. రాడ్ విరగడం అంటే నాణ్యతాలోపమైనా ఉండాలి లేదంటే నిర్వహణ లోపమైనా ఉండాలని ఇంజినీర్లే అంటున్నారు. సిలికాన్ లేదా మిశ్రమ పదార్థాలతో తయారు చేసే పాలిమర్ పిన్ ఇన్సులేటర్ యాంత్రిక బలాన్ని తట్టుకుని అధిక నిరోధకతను కలిగి ఉండి దృఢంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అధిక శక్తి, సరైన నిర్వహణ లేకపోతే వీటిని దెబ్బతీసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ తరహా లోపాలున్న విద్యుత్తు లైన్లు నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రమాదం జరిగినప్పుడు తప్ప ముందుగానే వీటిని గుర్తించి సరిచేసే వ్యవస్థ లేకపోవడం ప్రధాన లోపంగా ఉంది.

**డీటీఆర్‌ల వద్ద... :** స్తంభాలు, డీటీఆర్‌లు.. ఎక్కడ పడితే అక్కడ వదులుగా ఉన్న తీగల వద్ద స్పార్క్‌తో మంటలు వస్తున్నాయి.ః పెద్దతాళ్లకుంట పార్కు వద్ద ఉన్న డీటీఆర్‌లో కొద్దిరోజులుగా మంటలు వస్తున్నాయి. స్థానికులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందికి ఫిర్యాదులు చేస్తున్నా సమయానికి స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. లైన్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో విద్యుత్తు సంస్థ సైతం భారీగా నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తోంది.

# స్వశక్తి సంఘాలకు ప్రగతి రథాలు




సారంగాపూర్ : స్వశక్తి సంఘాల ఆర్థికాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఇటీవల మండల మహిళా సమాఖ్యల నుంచి బస్సులు కొనుగోలు చేసి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి అప్పగించింది. జిల్లాలోని 15 మండలాల నుంచి బస్సులు కొనుగోలు చేశారు. మండల సమాఖ్య నిధుల నుంచి ఒక్కో బస్సుకు రూ.36 లక్షల వెచ్చించారు. ఏడేళ్ల వరకు(84 ఈఎంఐలు) ఆర్టీసీ ప్రతి నెలా రూ.69,468 చొప్పున అద్దె కింద మండల సమాఖ్యలకు ఆర్టీసీ చెల్లిస్తోంది. బస్సులను జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలకు కేటాయించారు. ఇందులో జగిత్యాల డిపోకు ధర్మపురి, గొల్లపల్లి, కొడిమ్యాల, మల్యాల, వెల్గటూర్, సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల బస్సులు, కోరుట్లకు కథలాపూర్, కోరుట్ల, బుగ్గారం బస్సులు, మెట్‌పల్లి డిపోకు ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మేడిపల్లి, మెట్‌పల్లి, రాయికల్ మండలాల బస్సులను అప్పగించారు.

**ప్రతి నెలా వాయిదాల చెల్లింపు**

సెర్ప్ రాష్ట్ర శాఖ నుంచి మండల సమాఖ్యలో నిధులు జమ చేయగా వాటి నుంచి రూ.36 లక్షలతో బస్సును కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించారు. వాటిని ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన నడిపించనుంది. ప్రతి నెలా 21 నుంచి 25 మధ్యలో అద్దెను మండల సమాఖ్య ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఇందులో రూ.50 వేలు అసలు, రూ.19,468 వడ్డీ కింద పరిగణిస్తారు. వడ్డీ ద్వారా వచ్చిన నిధులను మండల మహిళా సమాఖ్య ఆదాయం కింద జమ చేసుకొని నిర్వహణ ఖర్చుల కోసం వాడుకోవాల్సి ఉంటుంది.

**ఆర్టీసీదే నిర్వహణ బాధ్యత**

మండల సమాఖ్య ద్వారా కొనుగోలు చేసిన బస్సుల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ)లో హైపోథికేషన్‌గా నమోదు చేయించాలి. మండల సమాఖ్య ప్రతినిధి సభ్యులు, ఆర్టీసీ అధికారులు కలిసి ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్టీఏ) కార్యాలయానికి వెళ్లి హైపోథికేషన్ చేసుకోవాలి. 84 ఈఎంఐలు పూర్తయ్యే వరకు మండల సమాఖ్య కార్యాలయంలో ఆర్సీ బుక్‌ను భద్రపరచుకోవాల్సి ఉంటుంది. ఒక కాపీని సెర్ప్ కార్యాలయానికి పంపించాల్సి ఉండగా, ఈఎంఐలు పూర్తయిన తర్వాత ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లి హైపోథికేషన్‌ను రద్దు చేసుకోవాలి. బస్సుల నిర్వహణ బాధ్యతను పూర్తిగా ఆర్టీసీనే చూసుకుంటుంది.

**ఆర్థిక బలోపేతానికి ఊతం**

–రఘువరన్, డీఆర్డీవో మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకే ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. 15 బస్సుల ద్వారా ఆదాయంతో సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కలుగుతుంది. ఆర్టీసీకి, మండల సమాఖ్యలకు మధ్య ఒప్పంద ప్రక్రియ పూర్తయింది.

# వాట్సప్‌లోనూ ఆస్తిపన్ను కట్టొచ్చు

హైదరాబాద్ : సామాజిక మాధ్యమాల్లో సమాచారాన్ని పంచుకోవడమే కాదు.. ఆస్తిపన్ను కూడా కట్టొచ్చు. పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ వాట్సప్ యాప్ సేవలను ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. వాట్సప్‌లోనే ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించే సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆసక్తి గల సంస్థలు ప్రతిపాదనలు సమర్పించాలని బల్దియా ఈఓఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.




**ప్రత్యేకతలు ఏంటంటే..**

ఏటా రూ.2 వేల కోట్ల ఆస్తిపన్ను వసూలవుతుండగా సగం ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే ఖాతాకు చేరుతోంది. పేటీఎం, గూగుల్‌పే, ఇతర యూపీఐ యాప్‌ల ద్వారా, మైజీహెచ్ఎంసీ మొబైల్ యాప్, జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు పన్ను చెల్లిస్తున్నారు.

ఆస్తిపన్ను బకాయి ఎంత ఉంది.. ఏ తేదీలోపు చెల్లించాలి, ఓటీపీ, ఇతరత్రా ఎస్ఎంఎస్‌లది కీలక పాత్ర. ఏటా నగరవాసులకు జీహెచ్ఎంసీ 20 లక్షల ఎస్సెమ్మెస్‌లను పంపిస్తుంది. ప్రతి 1000 ఎస్ఎంఎస్‌లకు రూ.52 ఖర్చు పెడుతోంది. వాట్సప్‌లో బిజినెస్ ఖాతా తెరిచి ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్సు ఫీజులను వసూలు చేస్తే ఎస్ఎంఎస్‌లకు అయ్యే ఖర్చు ఆదా అవుతుందని భావిస్తోంది.

పేమెంట్ గేట్‌వే సేవలను అందించే బ్యాంకులు, సంస్థలు.. నగరవాసులు చెల్లించే పన్నును రెండు రోజులపాటు వారి ఖాతాలో ఉంచుకుని వడ్డీని ఆర్జిస్తాయి. దీంతో వాట్సప్ సేవలను ఉచితంగా అందించాలనే నిబంధనతో కొత్త చెల్లింపుల విధానాన్ని పట్టాలెక్కించేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది.

# పల్లెలను వణికిస్తున్న జ్వరాలు

ధర్మపురి : జిల్లాలో అధ్వానంగా మారిన పారిశుద్ధ్యం, వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు విస్తరిస్తున్నాయి. ఇందులో టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో పల్లెవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు వైద్యశాఖ జిల్లా ప్రజలను అప్రమత్తం చేసేలా చర్యలకు ఉపక్రమించింది. నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ధర్మపురి, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లితో పాటు ఆయా మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైరల్ జ్వర పీడితుల సంఖ్య గత నెలలో పెరిగింది.

**ఆసుపత్రులు కిటకిట**



వైద్యశాఖ సర్వేలోనూ జ్వరాల లక్షణాలున్న వారిలో ఎక్కువగా టైఫాయిడ్ అని తేలుతోంది. దీంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. పలువురు అధిక జ్వరం, తలనొప్పి, బలహీనలతో ఆసుపత్రికి వస్తున్నారు. టైఫాయిడ్ పాజిటివ్ బాధితులు జిల్లా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. జ్వర బాధితులపై వైద్యారోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టింది. అపరిశుభ్ర వాతావరణమే ప్రధాన కారణంగా భావిస్తున్నారు. స్వచ్ఛత పరిశుభ్రత చర్యలతోపాటు పల్లెల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

**మందుల కొరత లేదు**

–శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

జిల్లాలో ఇప్పుడిప్పుడే వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా ర్యాపిడ్ కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదు కావడం కొంత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేస్తూ అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా చూసుకోవాలి. జ్వరాల నివారణకు ప్రత్యేకంగా సర్వే చేపడుతున్నాం. వాతావరణ మార్పులకనుగుణంగా పల్లెల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నాం.

# పూర్తయిన ఇళ్లు.. ఎదురుచూసే కళ్లు

ముస్తాబాద్ : పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఏళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. జిల్లాలో కొన్నిచోట్ల గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల పనులు పూర్తి చేశారు. చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అప్పటి సర్పంచుల హయాంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మిగిలిపోయిన చిన్నపాటి పనులు పూర్తిచేసిన దాఖలాలు లేవని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు ఎప్పుడు పూర్తవుతాయో.. ఎప్పుడు సొంతిట్లోకి అడుగు పెడతామోనని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నప్పటికీ తమ సొంతింటి కల మాత్రం నేరవేరడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

**చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే సరి**

ముస్తాబాద్ మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ముస్తాబాద్, మోహినికుంట, మద్దికుంట, పోత్గల్, చిప్పలపల్లి గ్రామాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. అప్పటి మంత్రి కేటీఆర్ చేతులమీదుగా గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు అందించారు. అలాగే గత ప్రభుత్వ హయాంలోనే కొండాపూర్ గ్రామ శివారులో 40 రెండు పడక గదులను నిర్మించారు. తలుపులు, కిటికీలు, ప్లంబింగ్, సెప్టిక్ ట్యాంకులు, పెయింటింగ్ పనులు వంటి చిన్నచిన్న పనులు చేయాల్సి ఉంది. అలాగే గూడెం గ్రామంలో 48 రెండు పడక గదుల ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిలో విద్యుత్తు, సెప్టిక్ ట్యాంక్స్ వంటి పనులు మిగిలి ఉన్నాయి. దాదాపు రెండేళ్లు గడిచి పోతున్నా ఇంతవరకు పనులు పూర్తిచేసిన దాఖలాలు లేవు. ఇళ్లచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి మద్యం ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేలా చూడాలని కోరుతున్నారు.

## రాయితీ యంత్రం వైపు..రైతు నేత్రం

నల్గొండ : రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాల పథకానికి పలువురు దరఖాస్తు చేసినా.. నేటికీ అవి అందలేదు. ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2.63 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు. నల్గొండ జిల్లాలో ప్రచారం కొరవడటం, గడువు తక్కువగా ఉండటంతో అధిక సంఖ్యలో రైతులు అర్జీలు సమర్పించలేకపోయారు. త్వరలో వానాకాలం పంటలు మొదలుకానున్న నేపథ్యంలో అన్నదాతలు రాయితీ పరికరాల కోసం ఎదురు చూసున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించడటంతో పాటు గతేడాది మంజూరు చేసిన నిధులకు ఈ సంవత్సరం అదనంగా కేటాయిస్తే ఎక్కువ మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.
2024-25 సంవత్సరానికి సంబంధించి రాయితీ వ్యవసాయ పరికరాల కోసం నల్గొండ జిల్లాలో 820 యూనిట్లకు రూ.1.80 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి మంజూరుకు అర్హులైన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిచ్చింది. ఏఈవోల ద్వారా తీసుకున్నారు. అంతలోనే ఆర్థిక సంవత్సరం ముగియడంతో నిధులు వెనక్కివెళ్లాయి. గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 50 శాతం రాయితీపై పరికరాలు అందేవి. నిధుల కొరత



వల్ల ఈ పథకం ఆగిపోయింది. యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని పునరుద్ధరించాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. రాయితీతో వ్యవసాయ సంబంధ యంత్రాలు, పరికరాలు అందించాలని భావించింది. కానీ నిధులు మంజూరు కాకపోవడంతో రైతులంతా వాటికోసం ఎదురు చూస్తున్నారు.
పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లరు, డ్రోన్లు, రోటోవేటర్లు, పవర్ వీడర్స్, బ్రష్‌కట్టర్స్, ట్రాక్టర్లు, విత్తనాల, ఎరువుల వేసే యంత్రాలు, దమ్ము, బోదలు చేసే పరికరాలు, బ్యాటరీ స్ప్రేయర్ యంత్రాలను ప్రభుత్వం రాయితీపై అందించనుంది. యంత్ర పరికరాల కోసం మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల స్థాయిలో తీసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడంతో దరఖాస్తులు వారి వద్దనే ఉన్నాయి. రైతులు మాత్రం యంత్రపరికరాల కోసం ఎదురు చూస్తున్నారు. మంజూరు అయిన యంత్ర పరికరాలను డీలర్లు అప్పటికే తయారు చేసి పెట్టారు. జిల్లాలో సుమారు 1500 మంది మహిళా రైతులు దరఖాస్తులు చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.
**నిధులు రాగానే..** మార్చిలో రాయితీ యంత్ర పరికరాల కోసం మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఏఈవోల ద్వారా తీసుకున్నాం. వాటికి నిధులు రాగానే పంపిణీ చేస్తాం. పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

## ఆరా తీసి.. పేర్లు ఏరేసి

నల్గొండ : రాష్ట్రంలో రేషన్ దుకాణాల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో అనర్హులను గుర్తించి పేర్ల తొలగింపు ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కార్డుదారులు పలువురు బియ్యం తీసుకోవడానికి ముందుకు రావడం లేదని గుర్తించింది. గత ఆరు నెలల నుంచి బియ్యం తీసుకోనివారి లెక్కలు తీసింది. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించగా చాలా మంది అనర్హులు, పెళ్లి అయి వెళ్లిన వారు, చనిపోయిన వారు, మరికొంత మంది స్థానికంగా లేకున్నా కార్డులు ఉండటాన్ని గుర్తించారు. వాటిని గుర్తించి ఏరివేత చేపట్టారు. జూన్‌లో మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించడంతో కోటా విషయంలో లెక్కలు తప్పరాదన్న ఉద్దేశంతో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా ఆరా తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లతో క్షేత్రస్థాయి విచారణ చేయిస్తోంది. లబ్ధిదారులు సదరు చిరునామాలో ఉంటున్నారా? లేదా మరణించారా? అని పరిశీలిస్తున్నారు. మరోవైపు వందేళ్ల వయసు పైబడి చనిపోయినవారు రేషన్ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. మరికొందరికి రెండేసి కార్డుల్లో పేర్లు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 991 రేషన్ దుకాణాల పరిధిలో 4,66,061 రేషన్ కార్డులున్నాయి. జూన్‌లో మూడు నెలలకు సంబంధించి ఆగస్టు వరకు చేపట్టనున్న బియ్యం పంపిణీలో తొలగించిన పేర్లను పరిగణనలోకి తీసుకొని కోటాను సరఫరా చేయనున్నారు.
**5,092 అనుమానాస్పద కార్డులు**
జిల్లాలో చేపట్టిన సర్వే ఆధారంగా 5,092 అనుమానాస్పద రేషన్ కార్డులు, 7,862 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్డుల విచారణ పూర్తి అయితే జిల్లాలో రద్దు అయ్యే కార్డుల అనర్హుల జాబితా తేలనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అనేక పథకాలకు రేషన్‌కార్డే అర్హత కావడంతో భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ఉన్న లబ్ధిదారుల్లో అనేక మంది అనర్హులున్నారు.

## రైతు వేదిక.. నిర్వహణ సులువిక

కొత్తగూడెం: నిర్వహణ భారంగా మారుతోన్న రైతు వేదికలకు మంచి రోజులు రానున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని రైతు వేదికలపై సౌర విద్యుత్తును ఉత్పత్తి చేసి తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఒక్కో దానిపై 5కిలోవాట్ల సౌర పలకలు అమర్చాలని నిర్ణయించింది. వీటి ద్వారా ఆయా రైతు వేదికల విద్యుత్తు అవసరాలు పోనూ ఒక్కోదాని నుంచి సుమారు రూ.25వేల వార్షికాదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఉభయ జిల్లాల్లోని ఐదు వేదికలను పరిశీలించిన రెడ్కో అధికారులు వాటిపై సౌర పలకలు బిగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
**మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ..** రైతు వేదికలతో పాటు మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న పీఎం కుసుమ్ పథకం కింద సౌర ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నాయి. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని మార్కెట్ యార్డులు, రైతు బజార్లలోనూ సౌర విద్యుదుత్పత్తికి బాటలు పడనున్నాయి. అయితే వీటికి సంబంధించిన విధివిధానాలు జిల్లాస్థాయి రెడ్కో అధికారులకు అందాల్సి ఉంది. ఉన్నతాధికారుల నుంచి మార్గదర్శకాలు అందితే సౌర ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని రెడ్కో అధికారులు చెబుతున్నారు.
**నిర్మించారు.. నిర్వహణ మరిచారు..** రైతులను సమావేశపరిచి శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ, సలహాలు, సూచనలు అందించేందుకు.. ఎరువులు, విత్తనాల పంపిణీకి 5వేల ఎకరాలకు ఒక్కటి చొప్పున ఖమ్మం జిల్లాలో 129, భద్రాద్రి జిల్లాలో 67 రైతు వేదికలు నిర్మించారు. కొన్నేళ్లుగా నిర్వహణ నిధులు అందకపోవటంతో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) వాటిని గాలికొదిలేస్తున్నారు. సొంత ఆదాయం లేకపోవటం, ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో రైతు వేదికల లక్ష్యం నీరుగారిపోతోంది. సౌర పలకల ఏర్పాటుతో ఆదాయం సృష్టించాలనే ప్రభుత్వ తాజా నిర్ణయంతోనైనా వాటి నిర్వహణ సక్రమంగా సాగాలని అన్నదాతలు ఆకాంక్షిస్తున్నారు. **ఆదాయం ఇలా..** ఒక్కో రైతు వేదికపై 5కిలోవాట్ల సౌర పలకలు బిగిస్తే.. నెలకు 600 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని రెడ్కో అధికారులు చెబుతున్నారు.

# జలసిరులకు 'ఉరి'



హైదరాబాద్ : ఆ ప్రాంతంలో నిర్మాణాలు నిషిద్ధం. నగర ప్రజల దాహార్తిని తీర్చే జంట జలాశయాల పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదంటూ ప్రభుత్వం జీవో 111ను జారీ చేసింది. దీని ప్రకారం ఎలాంటి అనుమతులు ఇవ్వరు. ఎఫ్‌టీఎల్ పరిధి మాత్రమే కాదు.. బఫర్‌జోన్ పరిధిలోనూ నిర్మాణాలు చేయకూడదు. ఈ చిత్రం చూశారా..! ఇది ఆధునిక హంగులతో నిర్మాణం చేసుకున్న ఓ రిసార్టు. ఇక్కడ అన్ని రకాల కార్యకలాపాలు జరుగుతుంటాయి. వారాంతంలో ధూంధాంగా వేడుకలు నిర్వహిస్తుంటారు. కానీ ఈ రిసార్టు.. పక్కాగా నగరానికి తాగునీరు అందించే జంట జలాశయాల్లో ఒకటైన హిమాయత్‌సాగర్‌లో నిర్మాణం కావడమే విశేషం. ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించి.. పార్టీలకు అద్దెలకు ఇస్తున్నారు. రూ.లక్షల్లో ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడమే ఆశ్చర్యం.
**రైతుల నుంచి లీజుకు..** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ గ్రామం పరిధిలో నిర్మించిన రిసార్టు పూర్తిగా హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది. మొత్తం పది మంది రైతులకు చెందిన భూములను లీజుకు తీసుకున్న ఓ వ్యక్తి నాలుగు ఎకరాల వరకు పూడ్చి వేశారు. 9 ఎకరాల్లో జీప్లస్1 భవనం నిర్మాణం చేశారు. జలాశయం పక్కనే పూడ్చి వేసి కంచె వేశారు. ఎకరానికి నెలకు రూ.25 వేల చొప్పున రైతులకు లీజు చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 9ఎకరాలకు దాదాపు రూ.2.25 లక్షలు చెల్లిస్తున్నారు. కానీ ఒక్కరోజుకే రిసార్టుకు ఆ అద్దెను వసూలు చేస్తున్నారు. ప్రభుత్వంలో పెద్దలు తనకు కావాల్సిన వారని స్థానిక అధికారులను మచ్చిక చేసుకొని ఈ భారీ నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిసింది. ఇక్కడ మిస్ యూనివర్స్ తెలంగాణ, ఆంధ్రా ఎంపికలను నిర్వహించడం విశేషం. ఇదొక్కటే కాదు.. ఇలాంటి రిసార్టులు, కన్వెన్షన్ సెంటర్లు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. స్థానిక పురపాలక, రెవెన్యూ అధికారుల కళ్లకు మామూళ్లతో గంతలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. **మా దృష్టికి రాలేదు:** హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ రిసార్టు నిర్మాణం వ్యవహారాన్ని మొయినాబాద్ తహసీల్దారు గౌతంకుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. తమ దృష్టికి రాలేదని ఆ ప్రాంతాలను తనిఖీ చేసి హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని వివరించారు.

# ఆటలు ఆడకున్నా పతకాలు!



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక వర్సిటీ(జేఎన్‌టీయూహెచ్) క్రీడా విభాగంలో జరిగిన అవినీతి ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఇద్దరు అధికారులు, పొరుగుసేవల సిబ్బంది అంతర్ వర్సిటీ క్రీడా పోటీల్లో ఆటలు ఆడకపోయినా పతకాలు, ధ్రువపత్రాలు ఇప్పిస్తామంటూ రూ.లక్షలు వసూలు చేశారంటూ కొందరు జేఎన్‌టీయూకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణకు ఏర్పాటైన కమిటీకి ఆరోపణలు వాస్తవమేనని ప్రాథమిక ఆధారాలు లభించాయి. దీంతో ఉన్నతాధికారులు ఆగ్రహించి నలుగురు పొరుగుసేవల సిబ్బందిపై వేటు వేశారు. లోతుగా విచారణ కొనసాగించి, అక్కడ పనిచేస్తున్న అధికారుల సహకారంపై నిజానిజాలు తేల్చనున్నారు.
**విద్యార్థినులకు పురుష శిక్షకులు**
జేఎన్‌టీయూ క్యాంపస్, అనుబంధ కళాశాలల నుంచి జట్లను ఎంపిక చేసిన అధికారులు వీరిని కొద్ది నెలల నుంచి ఇతర రాష్ట్రాల్లో వేర్వేరు వర్సిటీలకు తీసుకెళ్లారు. విద్యార్థినుల క్రీడా బృందాలకు మహిళా కోచ్‌లను కాకుండా ఇద్దరు పొరుగు సేవల సిబ్బందిని పంపించారు. బాక్సింగ్, రెజ్లింగ్‌కు ఎంపికైన విద్యార్థినులు.. పంజాబ్‌లోని గురుకాశీ వర్సిటీలో ఐదు నెలల జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నారు. సౌత్‌జోన్ వాలీబాల్ విద్యార్థినీ, విద్యార్థులు యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగిన పోటీలకు హాజరయ్యారు. తమిళనాడు కేంద్రీయ వర్సిటీలో ఆరు నెలల క్రితం జరిగిన ఖోఖో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్ మహిళ, పురుషుల జట్టు.. తమిళనాడులోని జెప్పియార్ వర్సిటీ పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో విద్యార్థినులతో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని పంపించారు.
**మినరల్ వాటర్‌తో కార్లు కడిగించుకున్నారు!**
క్రీడా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధికారుల ప్రవర్తనపై క్యాంపస్ విద్యార్థులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరి కొందరు వారి చేష్టలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఓ అధికారి తన కార్లను మినరల్ వాటర్‌తో కడగాలంటూ సిబ్బందికి హుకుం జారీ చేశారు. నలుగురు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో వర్సిటీ, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఫోన్లు చేయించారు. క్రీడా పోటీలకు ఎంపిక చేస్తాం.. ఖర్చవుతుంది అంటూ వారితో చెప్పించారు. పోటీల్లో పాల్గొనకుండానే ధ్రువపత్రాలు ఇస్తామంటూ రూ.వేలల్లో వసూలు చేయించారు.

# అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో..అకడమిక్ ఆడిట్



హైదరాబాద్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు.. ఆచార్యుల హాజరును పరిశీలించేందుకు అధికారులు కొత్త విధానాన్ని అమలుచేయనున్నారు. ప్రతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బోధించేందుకు సరైన సంఖ్యలో ఆచార్యులు.. సహ ఆచార్యులు.. సిబ్బంది ఉన్నారా? లేదా? పరిశోధనలు నిర్వహించేందుకు ప్రయోగశాలలున్నాయా? అన్న అంశాలను ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. 'అకడమిక్ ఆడిట్' పేరుతో కొంతమంది అధికారులను బృందంగా ఏర్పాటుచేయనున్నారు. ప్రత్యేక బృందం సభ్యులు కళాశాలల్లో పరిస్థితులను పరిశీలించనున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి నిబంధనలు, జేఎన్‌టీయూ మార్గదర్శకాలు పాటించడం లేదని గుర్తించి నివేదికలు సమర్పించిన వెంటనే చర్యలు తీసుకోనున్నారు. విద్యార్థులు, ఆచార్యుల నిష్పత్తికి అనుగుణంగా బోధన సిబ్బంది లేకపోయినా.. నిర్ణీత సంఖ్యలో ప్రయోగశాలలు లేకున్నా యాజమాన్యాలకు తాఖీదులిచ్చి గడువులోగా ప్రమాణాలు పాటించాలంటూ హెచ్చరించనున్నారు.
వరుస ఆరోపణలు... వేలిముద్రల ఆచార్యులు
జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తగిన సంఖ్యలో లేరని ఆరోపణలొస్తున్నాయి. ఫలానా కళాశాలలో ఫ్యాకల్టీ లేరని, ల్యాబ్‌లు లేవంటూ తల్లిదండ్రులు ఉపకులపతి, రిజిస్ట్రార్ కార్యాలయాలకు లేఖలు రాస్తున్నారు.
జేఎన్‌టీయూ పరిధిలో 215 అనుబంధ గుర్తింపు కళాశాలలుండగా.. వాటిల్లో 3.50లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బీటెక్, ఎంటెక్ పూర్తిచేసిన వారిని అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమిస్తున్నారు. మరికొన్ని కళాశాలలు ప్రొఫెసర్లను నియమించుకుని బయోమెట్రిక్ హాజరు వేయించుకుని పంపుతున్నారు. ఇంకొన్ని కళాశాలల్లో చాలామంది బోధనా సిబ్బంది లేకపోవడంతో కాగితాలపైనే ఆచార్యులను నియమించుకుంటున్నారు.
**కమ్యూనికేషన్ స్కిల్స్ లేవు..**
అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో 60శాతం మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు లేవని జేఎన్‌టీయూ అధికారులు గుర్తించారు. ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తైనా వారికి ఉద్యోగాలు రావడం లేదంటూ పలు అధ్యయనాల నేపథ్యంలో ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధనా ప్రమాణాలపై దృష్టి సారించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు 30శాతంమంది కూడా ఎంపిక కావడం లేదని తెలుసుకున్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్న జేఎన్‌టీయూ అధికారులు అకడమిక్ ఆడిట్ ద్వారా లోపాలు గుర్తించి వాటిని సవరించుకోవాలంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రెండు, మూడు నెలల గడువులోపు లోపాలను సవరించుకోకపోతే కఠినంగా చర్యలు చేపట్టనున్నారు. బోధనా ప్రమాణాలు పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని జేఎన్‌టీయూ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

# రాయితీ యంత్రం.. రైతులకు దూరం

కాల్వశ్రీరాంపూర్: అన్నదాతలకు తోడ్పాటునందించడంతోపాటు సాగుకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు, యంత్రాలు రాయితీపై అందించేది. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీ యంత్రాలు, పరికరాలు అందించడం లేదు. దీనికితోడు రోజురోజుకు సాగు ఖర్చులు పెరుగుతుండటంతో రైతన్నలకు భారంగా మారింది.
**ఇప్పుడందిస్తేనే మేలు**
ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందిస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి సాగు పెరుగుతుంది. రెండు నెలల కిందట ప్రభుత్వం యంత్రాలు అందిస్తామని చెప్పడంతో కొంతమంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో ఇప్పటికీ వాటి జాడ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంపిణీ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.
**ఏడేళ్లుగా ఎదురుచూపులు**
భారాస ప్రభుత్వం తొలిసారి అధికారంలోకి వచ్చాక రొటవేటర్, మక్కలు పట్టే యంత్రం, తదితర పరికరాలు రాయితీతో రైతులకు అందజేసింది. కూరగాయల విత్తనాలతోపాటు ట్రాక్టర్లు, పిచికారీ పంపులు, కలుపు తీసే యంత్రాలు, వరికోత మిషన్లు, టార్పాలిన్లు కూడా పంపిణీ చేసింది. అయితే 2018 నుంచి వీటిని అందించడం నిలిపివేసింది. దీంతో అన్నదాతలు యంత్రాలను కొనుగోలు చేసే పరిస్థితి లేక కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. వీటి వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగుకు అవకాశముంటుంది. ఖర్చులు సైతం ఆదా అవుతాయి. ప్రస్తుతం రైతులు మార్కెట్‌లో యంత్రాలను అద్దెకు తీసుకొచ్చి పనులు చేసుకుంటున్నారు.
**బడ్జెట్ మంజూరైతే అందిస్తాం: ఆదిరెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి**
రాయితీపై యంత్రాలు, పరికరాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి రెండేళ్ల బడ్జెట్ మంజూరు కావాలి. ఎన్ని నిధులు వస్తాయో దానిని బట్టి రైతుల నుంచి డీడీలు తీసుకుంటాం. తప్పకుండా యంత్రాలు అందించేలా చూస్తాం.

## నిబంధనలతో మాకేం పని?


పెద్దపల్లి: చెరువు మట్టి తీసుకువెళ్లేవారికి అనుమతించిన పరిమాణంతోపాటు నిర్దేశిత గడువు, తరలించేందుకు వినియోగించే వాహనాలు ఇతర నిబంధనలన్నింటిని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొంటున్నా.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఒకే జిల్లాలో వేర్వేరు చెరువుల్లో మట్టి తరలింపునకు అనుమతించడంలో వివాదాలు ఏర్పడుతున్నాయి. తాజాగా పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువు నుంచి 2022లో నిల్వచేసిన మట్టిని తరలించడం ఘర్షణకు దారితీసింది. ఒకరి మట్టిని మరొకరు తీసుకువెళుతున్నారనే అంశమే అసలు గొడవకు కారణమవుతోంది. ఇంతా జరుగుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం సీనరేజీ చెల్లిస్తే సరిపోతుందనే ధోరణితో ఉంటున్నారు.
**రెండేళ్లుగా తరలింపు**
కొత్తపల్లి చెరువు నుంచి 2022 వేసవి కాలంలో మట్టి తీసుకునేందుకు అనుమతి తీసుకున్న ఆరుగురు ఇటుక బట్టీ వ్యాపారులు.. అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువగా తరలించి, అదే గ్రామంలోని ప్రైవేటు భూముల్లో నిల్వ చేశారు. దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ నిర్వహించిన అధికారులు నిల్వచేసిన 70,216 మెట్రిక్ టన్నుల మట్టిని సీజ్ చేశారు. ఈ డంప్‌ను తిరిగి పొందేందుకు బట్టీ యజమానులకు ప్రభుత్వం వన్‌టైం సెటిల్‌మెంట్ కింద 2023లో రూ.2.50 కోట్ల జరిమానా విధించింది. ఈ జరిమానాను చెల్లించిన కొందరు మట్టిని తరలించగా, మరికొందరు అక్కడే నిల్వ చేశారు. దీనిని తీసుకువెళ్లడానికి నిర్దిష్టమైన గడువు విధించకపోవడంతో రెండేళ్లుగా తరలింపు జరుగుతోంది. ఇటుక బట్టీలు లేనివారు సైతం మట్టిని తీసుకుపోతున్నారు.



**అనుమతుల్లో గందరగోళం**
ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ నుంచి తరలించిన మట్టిని అంతర్గాం మండలం ముర్మూర్ వద్ద నిల్వ చేశారు. ఈ డంప్‌ను తరలించేందుకు గత ఫిబ్రవరిలో మైనింగ్ అధికారులు అనుమతించారు. 80,280 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు నిర్దేశిత గడువుతోపాటు వాహనాల నంబర్లు ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో సంబంధిత మట్టిని నిబంధనల ప్రకారం ఉత్తర్వుల్లో పేర్కొన్న వాహనాల్లో నిర్దేశిత గడువులోగానే తీసుకుపోయారు. కానీ కొత్తపల్లి వద్ద డంపింగ్ చేసిన చెరువు మట్టి విషయంలో అధికారులు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఈ మట్టిని పది మంది నిల్వ చేసినట్లు ప్రచారం జరుగుతుంది. కానీ మైనింగ్ అధికారుల నుంచి మాత్రం ఆరుగురే అనుమతి పొందినట్లు రికార్డులలో పేర్కొన్నారు. ఇక చెరువు నుంచి అనుమతి తీసుకున్న పరిమాణం? ఎంతమేరకు బట్టీలకు తరలించారు? ఎంత నిల్వ చేశారనే అంశాలపై మైనింగ్ అధికారులు విచారణ చేయలేదు. వీటికి ముగింపు పలకకపోతే రానున్న రోజుల్లో సమస్య మరింత జటిలంగా మారే అవకాశముంది.

## నిధులందవు.. నిర్మాణాలు సాగవు

ధర్మపురి: గతంలో ఈ రహదారిని సీసీ రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదించగా.. రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే కేవలం 15 శాతమే పనులు పూర్తయ్యాయి. రోడ్డు పక్కన తవ్వి వదిలేయడంతో ఆసుపత్రికి వెళ్లే రోగులు, నది స్నానానికి వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇదేకాక ధర్మపురి పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పలు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు తమ ఇంటి ఎదుట కంకరతో ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి మీదుగా వెళ్లే రహదారిపై వేలాది భక్తుల వాహనాలు గోదావరికి వెళ్తుంటాయి.
**భక్తుల ఇబ్బందులు**
పట్టణంలోని తెనుగువాడ నుంచి బ్రాహ్మణసంఘం వరకు రెండు వరుసల రహదారి నిర్మాణానికి రూ.1.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 280 మీటర్ల వెడల్పుతో రెండు వైపులా మురుగు కాలువలు నిర్మించగా.. రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఎక్కువగా వాహనాలు ఇదే రహదారి నుంచి బ్రాహ్మణసంఘం, దేవస్థానం వరకు పెద్దఎత్తున వెళ్తుంటాయి. రహదారి నిర్మాణం ఆగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**ప్రమాదకరంగా..**
అంబేడ్కర్ కూడలి నుంచి అక్కపల్లి దేవస్థానం వరకు రోడ్డు వేసేందుకు రూ.కోటి నిధులు మంజూరు చేశారు. రెండు చోట్ల కల్వర్టులు నిర్మించారు. కేవలం 30 శాతం పనులు పూర్తవగా, మిగతావి నిలిచిపోయాయి. ఏడాదికిపైగా కంకర తేలి ఆయా కాలనీ ప్రజలకు అసౌకర్యంగా ఉంది.
**కంకర పోసి.. వదిలేసి**
పట్టణంలోని వివేకానంద కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నాలుగు వరుసల రహదారి ఏర్పాటుచేసి, మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించగా.. దీనికి రూ.6 కోట్ల నిధులు గతంలో మంజూరు చేశారు. అయితే రెండు వైపులా కంకర పోసి నిధులు విడుదల కాక వదిలేశారు. దీంతో రహదారి ప్రమాదకరంగా మారింది. అర్ధాంతరంగా నిలిచిన పనులను వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.
**ప్రతిపాదనలు పంపించాం**
నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేసేందుకు మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. రాజశేఖర్, పురపాలక కమిషనర్ ధర్మపురి

# విత్తన వి'పత్తి'

ఎమ్మిగనూరు : పశ్చిమ ప్రాంతం విత్తన పత్తికి సాగుకు అనుకూలం. గతేడాది రైతులు మంచి లాభాలు పొందారు. ఈ ఏడాది ఓ కంపెనీ ఆర్గనైజర్ కర్షకులను నిండా ముంచారు. బ్రీడర్ సీడ్ విత్తనాలు ఇచ్చారు.. సాగు చేయండి పెట్టుబడి ఇస్తామని నమ్మబలికారు. పంట వేసిన తర్వాత.. పెట్టుబడి ఇవ్వలేదు.. అరకొరగా కొంటామని కొర్రీలు పెడుతున్నారు. చేసేది లేక రైతులు పంటను తొలగించి మరోటి వేయడానికి సిద్ధమవుతున్నారు.
ఎమ్మిగనూరు, కోసిగి, పెద్దకడుబూరు, గోనెగండ్ల తదితర మండలాల్లో 500 ఎకరాలకు పైగా సీడ్ పత్తి సాగు చేసున్నట్లు అంచనా. విత్తనం వేసి నెలన్నర కావస్తోంది. బ్రీడర్ సీడ్ విత్తనం, పెట్టుబడులు ఇస్తామని, ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు కొంటామని ఓ ప్రైవేట్ కంపెనీ ఆర్గనైజర్ నమ్మించారు. ఇంతవరకు పెట్టుబడికి రూపాయి ఇవ్వలేదు. సాధారణంగా సీడ్ పత్తి సాగుకు ఎకరానికి రూ.3నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి అవుతుం ది. డబ్బులు అడిగితే ఇవ్వకుండా.. ఈసారి



ఎకరానికి రూ.48వేల చొప్పున రెండు క్వింటాళ్లు కొంటామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

**కొర్రీలు పెట్టి మోసం**

జిల్లాలో దాదాపు మూడు దశాబ్దాలుగా రైతులు సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. పలు కంపెనీ ఆర్గనైజర్లు విత్తనంతోపాటు పెట్టుబడి ఇస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేస్తారు. ఈసారి పెట్టుబడి ఇవ్వకుండా, పంట రాకముందే రెండు క్వింటాళ్లే కొంటామని కొర్రీలు పెడుతున్నారు. దిక్కుతోచని రైతులు జులై చివరి వరకు ఇతర పంటల సాగుకు సమయం ఉండటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. కోటేకల్, నక్కలమిట్ట తదితర గ్రామాల్లో సీడ్ పత్తి పంటను తొలగిస్తున్నారు.
“ఎకరన్నరలో సీడ్ పత్తి వేశా. పంట కొంటాం, పెట్టుబడి ఇస్తామని కంపెనీ ఆర్గనైజర్ చెప్పారు. ఇప్పుడు రెండు క్వింటాళ్లు కొంటామని చెబుతున్నారు. ధర బాగా తగ్గించారు. చేసేది లేక పంటను తొలగించి వేరే పంట వేసుకునేందుకు నేల శుద్ధి చేసుకుంటున్నాం” కోటేకల్‌కు చెందిన రంగన్న పేర్కొన్నారు.

# నకిలీ 'మక్కలు'.. నాటగానే నష్టాలు

నంద్యాల : నకిలీ విత్తనాలు మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. మే, జూన్ నెలల్లో వర్షాలు కురవడంతో పలు మండలాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు, గడివేముల, పాణ్యం, అవుకు, బనగానపల్లి మండలాల్లో కలిపి 22 వేల ఎకరాల వరకు సాగు చేశారు. చాలాచోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. ఫిర్యాదులందుకొన్న వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. నకిలీ విత్తనాలతోనే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. చేసేది లేక రైతులు మళ్లీ దున్నేసి ఇతర పంటలు వేస్తున్నారు.
కొత్తపల్లి మండలం ఎదురుపాడులో ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న. గత నెలలో నాలుగెకరాల్లో విత్తనం నాటారు. పదిరోజులు దాటినా పూర్తిగా మొలకలు రాలేదు. వ్యవసాయాధికారులను సంప్రదించగా నకిలీ విత్తనాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. వారంతా వ్యాపారిని నిలదీయగా నష్ట పరిహారం చెల్లిస్తానని అంగీకరించారు.

**గతేడాది భారీగా...**

గతేడాది నంద్యాల మండలం పాండురంగాపురం రైతులు నంద్యాలకు



చెందిన ఓ వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన సీఎంహెచ్ఎస్ 150 రకం విత్తనాన్ని 125 ఎకరాల్లో సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా కంకి మాత్రం రాలేదు. నంద్యాల మండలాల రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారు. చేసేది లేక ఆందోళన బాట పట్టారు.

**రంగుల ప్యాకెట్లలో పెట్టి**

నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు నకిలీ విత్తనాల దందా చేస్తున్నారు. గుర్తింపు పొందిన, వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన విత్తన సంస్థల ఉత్పత్తులు పోలిన ప్యాకింగ్‌తో విక్రయిస్తున్నారు. మరికొందరు అసలు విత్తనాలతో పాటు వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 5252 రకం, సీఎంహెచ్ 165 రకం, అర్జున్ సంకరం తదితర పేర్లతో అంటకడుతున్నారు. గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి ఇవి జిల్లా మార్కెట్‌లోకి వస్తున్నాయి.

**కిలోపై రూ.1500 మిగులు**

సాధారణంగా కిలో మొక్కజొన్న విత్తనాలు సంస్థను బట్టి రూ.1400 నుంచి రూ.1700 వరకు విక్రయిస్తున్నారు. నకిలీవి కిలో రూ.200లోపే లభిస్తాయి. వీటిని ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో అధిక ధరలకు విక్రయించడం ద్వారా కిలోపై రూ.1500 వరకు సొమ్ము చేసుకొంటున్నారు.
అవుకులో 15 మంది రైతులు 120 ఎకరాల్లో 5252 రకం మొక్కజొన్న విత్తనం సాగు చేశారు. 30 శాతం పొలాల్లో మొలకలు రాలేదు. రైతులంతా కలిసి వ్యాపారిని ప్రశ్నించడంతో ఉచితంగా మరో రకం విత్తనాలు ఇచ్చారు.

**మద్దతు ధరతో పెరిగిన సాగు**

మొక్కజొన్న క్వింటాకు రూ.2,100 మద్దతు ధర ప్రకటించారు. ఎకరాకు సగటున రూ.20– 22 వేల వరకు వ్యయమవుతుంది. ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడిపోను రూ.40 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. గతేడాది మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేసినా ఆశించిన దిగుబడులు లేవు. దీంతో ఈ ఏడాది మెట్ట ప్రాంతాల రైతులు ఈసారి పెద్దఎత్తున మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

# ఫ్లోబస్.. సాంకేతికత అదుర్స్




తిరుపతి : 'ఎవడబ్బ సొత్తు కాదురా ట్యాలెంటు'.. అన్న మాటలను నిజం చేశాడా కుర్రాడు. చిన్ననాటి నుంచి తాను అందిపుచ్చుకోలేని సాంకేతికతను నేటితరానికి పరిచయం చేస్తూ సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాడు. కళాశాలల్లో సరైనా ప్రయోగశాలల్లేక తాను పడిన కష్టం మరెవ్వరికీ ఎదురవ్వకూడదని బస్సులోనే ల్యాబ్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. మూడేళ్ల శ్రమకోర్చి దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారి ఫ్లో (ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్) బస్సులో ల్యాబ్‌ను ఆవిష్కరించాడు. అతడే పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన క్రొవ్విడి మధులాష్‌బాబు. ఆ ఆవిష్కరణ గురించి తెలుసుకుందాం రండి.

**ఆలోచనతో మెరిసి..** మధుకు చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ ఎక్కువ. తండ్రి లారీ డ్రైవర్ కావడంతో ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ కోర్సు తీసుకుని వినూత్నంగా రాణించాలనుకున్నాడు. కానీ కళాశాలలో సరైన ప్రయోగశాలలు, పరికరాల్లేక ఆశించిన స్థాయిలో విద్యాబోధన లేదని మదనపడ్డాడు. తాను పడిన కష్టం మరెవరికీ కలగకూడదని వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. సాంకేతిక పరికరాలతో కూడిన బస్సును రూపొందించాలనుకున్నాడు. అది ఖర్చుతో కూడుకున్న పనైనా విశ్రమించలేదు. తన ఆలోచనలతో ఇన్వెస్టర్లను ఆకర్షించాడు.

**దేశంలోనే మొదటిది..** తన ఆలోచనను వివరిస్తూ శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ)కు దరఖాస్తు చేసుకోగా.. వారు దాన్ని పరిశీలించి స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ కింద రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఇదే కాకుండా అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ నుంచి రూ.80 లక్షల నిధులొచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే పేరుతో తన స్నేహితులతో కలిసి ఒక సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ నిధులతో దేశంలోనే తొలి సంచార ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) బస్సును రూపొందించాడు.

**16రకాల పరిజ్ఞానాలు..** బస్సులోపల విద్యుత్తు సరఫరా కోసం బస్సుపై 2కే సోలార్ ప్యానల్, త్రీడీ ప్రింటింగ్‌తో బొమ్మలు, అంతరిక్షంలో అడుగుపెట్టినట్లు అనుభూతిని కలిగించే ప్లానెటోరియం, డ్రోన్‌లు, రోబోటిక్స్ తయారీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, ఐవోటీ, వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐ వంటి పదహారు రకాల టెక్నాలజీలను ఇక్కడ నేర్పిస్తారు. విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో డీఐవై కిట్ల సాయంతో సొంతంగా ప్రయోగాలు చేయొచ్చు. బస్సులో ఉన్న మెంటార్లు సాయం అందిస్తారు.

**మేమే వస్తాం** – మధులాష్‌బాబు, ఎడోధ్వజ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో

# విభాగాలు సరే.. వైద్యం చేయరే!!



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కేజీహెచ్‌లో కీలకమైన విభాగాల్లో పూర్తిస్థాయి వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్యుల కొరతతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.
'గుండె'కు అందని వైద్యం: గుండె శస్త్రచికిత్స (కార్డియో థొరాసిక్) విభాగంలో కీలకమైన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్ వైద్య పరికరాలు మూలకు చేరాయి. వైద్యనిపుణులు ఉన్నా.. పరికరాలు లేక రెండు నెలల నుంచి గుండె శస్త్రచికిత్సలు, కవాటాల (వాల్వ్) మార్పిడి చికిత్సలు నిలిచిపోయాయి. 1996లో హిందుస్థాన్ షిప్‌యార్డు ఆర్థిక చేయూతతో కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలకు శ్రీకారం చుట్టారు. నెలకు 25 నుంచి 30 వరకు సర్జరీలు చేసేవారు. ఆ తర్వాత పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) కింద హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్‌కు ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ...సర్జరీలు చేశారు. అలా అద్దెకు తీసుకున్న పరికరాలు పాడయ్యాయి. కొత్త పరికరాల కొనుగోలుకు రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తూ.. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఊపిరితిత్తులు, వాస్కులర్ సర్జరీలు మాత్రం చేస్తున్నారు.

**సీట్లు కోల్పోయే ప్రమాదం:** నెఫ్రాలజీ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానాలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరు సహాయ ప్రొఫెసర్లతో విభాగం నడుస్తోంది. ఇక్కడ నాలుగు డీఎం కోర్సు సీట్లు ఉన్నాయి. ఆ సీట్లు కొనసాగాలంటే కచ్చితంగా ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్ ఉండాల్సిందే. ఆయా ఖాళీలు భర్తీ కాకుంటే, సీట్ల కొనసాగింపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు జారీ చేయదు.
ఈనెల 5 తర్వాత సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈలోపు కొత్తవారిని నియమించాల్సి ఉంది. కేజీహెచ్‌లో వంద మందికి రోజూ డయాలసిస్ జరుగుతుంది. 60 నుంచి 70 మంది కిడ్నీ బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇంతటి కీలకమైన విభాగంలో నియామకాలపై దృష్టిసారించాలి.

**'ఎముకల'కు ఒక్కరే:** ఎముకల విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టర్ శివానంద, డాక్టర్ లోక్‌నాథ్‌కు ఇటీవల బదిలీ అయింది. వారి స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో ఆ విభాగం బాధ్యతల్ని కేవలం ఒకే ప్రొఫెసర్ పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఎముకల ఓపీ ఉంటుంది. వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు.

# అంధుల జీవితాల్లో 'అక్షర' వెలుగులు



విశాఖపట్నం: రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల అది. విశాఖ బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ సమీపంలో దాదాపు మూడెకరాల్లో విస్తరించి ఉంది. దృష్టి లోపంతో బాధపడుతున్న బాలికల జీవితాల్లో 38 ఏళ్లుగా వెలుగులు నింపుతోంది. ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందిస్తున్నారు.

**ఏడాదంతా..:** ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. 40 శాతం, అంత కంటే ఎక్కువ అంధత్వమున్న విద్యార్థులను 'సదరం' ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఉంటే చేర్చుకుంటారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు ఏడాదిలో ఎప్పుడొచ్చినా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ప్రవేశాలు కల్పిస్తారు. ఏటా పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది ఫలితాల్లో అత్యధికంగా శ్రీకాకుళానికి చెందిన ఓ విద్యార్థిని 378 మార్కులు సాధించింది. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది.

**కళాశాల ఏర్పాటు చేస్తే:** ఉమ్మడి రాష్ట్రంలో 1987లో పాఠశాలను స్థాపించారు. బోధనకు 19 పోస్టులు మంజూరు కాగా ఉద్యోగ విరమణలు, బదిలీల తర్వాత ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు ఆరుగురే. డీఎస్సీ ఫలితాల తర్వాత ఉపాధ్యాయులను కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది పోస్టులు 13 మంజూరు కాగా ఆరు ఖాళీలున్నాయి. ఇక్కడ బాలికల కోసం జూనియర్ లేదా వొకేషనల్ కళాశాల ఏర్పాటు చేయాలని గతేడాది ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేవు. కళాశాల ఏర్పాటైతే ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

**ప్రవేశాలకు ఆహ్వానం**

–డి.విజయ, ప్రధానోపాధ్యాయురాలు

అంధుల పాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాం. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బాలికలు అర్హులు. ఇక్కడ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో బోధన సాగుతుంది. అందుకు తగ్గ పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఉచిత విద్యతోపాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత వసతి, భోజనం, అన్ని వేళలా వైద్య సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

# అ'ధర'గొడుతున్న కొబ్బరి

పాలసముద్రం : పండించిన పంటకు మద్దతు ధర లభిస్తే అన్నదాతల కళ్లలో ఆనందం నిలుస్తుంది. అన్ని రోజులు పడిన కష్టాన్ని వారు మర్చిపోతారు. తాజాగా కొబ్బరి రైతుల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో ఓ వైపు మామిడి రైతులు ధర లేక రోడ్డుపై ట్రాక్టర్లలో లోడుతో పడిగాపులు కాస్తున్నారు. ఇదే సమయంలో.. కొబ్బరి రైతులు మద్దతు ధర రావడంతో ఒకింత ఆశగా ఉన్నారు. ఇక గతంలో ఎన్నడూలేని విధంగా కొబ్బరికి ధర పెరిగింది. వెయ్యి పచ్చికాయల ధర ఏకంగా రూ.17 వేలు పలకడంతో రైతులు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడం, అక్కడి చెట్లకు తెగుళ్లు రావడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. పాల సముద్రం మండలం పాలసముద్రం, కమ్మపాళ్యం, వెంగళరాజుకుప్పం, శ్రీబొమ్మరాజుపురం, కనికాపురం గ్రామాల కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం మండలం నుంచి కర్నూలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు, పుదుచ్చేరి, గుడియాత్తం సహా ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఒలిచిన వెయ్యి కాయల ధర రూ.25 వేలు పలుకుతోంది.



# పురాలకు అమృత్ బిందువు

ఆదోని : ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమృత్ ఫలాలు అందనున్నాయి. పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా నీటి ప్రాజెక్టుల కింద రూ.233 కోట్లు, మురుగు నీటి శుద్ధికి రూ.170 కోట్లు విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేయలేదు. కనీసం డీపీఆర్ రూపొందించలేదు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం పనులు పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 281 పనులకు రూ.10 వేల కోట్లు విలువైన పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది.

**జగన్నాథగట్టుపై నిల్వ**

కర్నూలులో రూ.130 కోట్లుతో 20కి పైగా ఉపరితల నీటి ట్యాంకులు



నిర్మించే దిశగా యోచిస్తున్నారు. ప్రస్తుతం 30 ఉపరితల నీటి ట్యాంకులున్నా.. నీటి సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పాటు జగన్నాథగట్టు ప్రాంతంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి, నీరు నిల్వ చేయాలనేది లక్ష్యం. గత వైకాపా ప్రభుత్వంలో పై పనులు టెండర్ దశకు వెళ్లి ఆగిపోయాయి. పై పనులు పూర్తయి ఉంటే.. నగరంలో 52 వార్డులకు తాగునీటి ఇబ్బందులు తొలగేవి. సుంకేసుల నుంచి మునగలపాడు రూ.83 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టారు. కేసీ కాలువ నుంచి నీటిని పైపులైన్‌తో సరఫరా చేయాలనే దిశగా ఆలోచనలు చేస్తున్నారు.

**మురుగు శుద్ధికి ప్రణాళికలు**

అమృత్ పథకాలకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టింది. దీంతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్నూలుకు రూ.2.47 కోట్లు, నంద్యాల రూ.74 కోట్లు, ఆదోనిలో రెండు చోట్ల రూ.93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

**ఆదోని అవస్థలు తీర్చేలా**

ఆదోనిలో రెండు పనుల ప్రణాళికలు చేశారు. మొదటిది రూ.12.9 కోట్లు, రెండోది రూ.22.27 కోట్లతో నీటి పైపులైన్ ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఉపరితల నీటి ట్యాంకులు, నీటిశుద్ధి కేంద్రంతో పాటు బలహీనవర్గాల కాలనీల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పనులు పట్టాలెక్కలేదు.

**ఇక్కడా పనులు చేపడతారు**

డోన్‌లో రూ.23.56 కోట్లు, బేతంచెర్ల రూ.2.66, ఆత్మకూరులో రూ.9.66, నందికొట్కూరులో రూ.10.18, ఎమ్మిగనూరులో రూ.3.52, గూడూరు రూ.5.68 కోట్లతో బలహీనవర్గాల కాలనీలు, నివాస ప్రాంతాల్లో నీటి వనరుల పెంపు, నీటి నిల్వ పనులు చేసి.. సరఫరా చేయాలని సంకల్పించారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.

**నందుల కోటలో**

నంద్యాలలో రెండు ప్యాకేజీల్లో పనుల ప్రణాళిక చేశారు. రూ.10.47 కోట్లతో 7కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 19 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 3006 కొత్తగా కుళాయి కనెక్షన్లు, 4.51 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం. రెండోది రూ.32.94 కోట్లతో 12.50 ఎం.ఎల్.డి. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 13.32 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యంతో క్లియర్ వాటర్ సంప్ నిర్మించాలనుకున్నారు.

# గుట్టకో.. కబ్జా గుట్టు

రామచంద్రాపురం : మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ఎంతకూ అడ్డుకట్ట పడటం లేదు. ఐదేళ్లూ యథేచ్ఛగా సాగిన కబ్జాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రామాపురంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించారు. సర్వే నంబరు 28లో ఐదెకరాల భూమిని కబ్జా చేయడమే కాకుండా లేఅవుట్ వేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. రోడ్డువైపు ఇప్పటికే వాణిజ్య సముదాయం నిర్మించి విక్రయించేశారు. తహసీల్దార్ల బదిలీల నేపథ్యంలో ఇప్పటికే ఆక్రమించిన భూముల్లో రాత్రికిరాత్రే కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ దందాలో 20 శాతం రెవెన్యూ, 30 శాతం ప్రతిపక్షం, 50 శాతం అధికారపక్షం దండుకుంటోందనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా నెన్నూరు సమీపంలోని జూబ్లీహిల్స్ పక్కన, కొత్తకండ్రిగ, మిట్టకండ్రిగ పంచాయతీల మధ్యలోని గుండోడు కణంగుట్ట, రాయలచెరువుపేట, గణేష్‌పురం ప్రాంతాల్లోని గుట్టలపై కబ్జాకోరులు పట్టు బిగించారు. భారీ యంత్రాలు ఉపయోగించి గ్రావెల్ తరలించడం, ఆపై చదునుచేసి దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు.

**పరిశీలించి చర్యలు చేపడతాం**– అన్వర్ బాషా, ఉపతహసీల్దారు

గతంలోనే ప్లాట్లు వేసి విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లాస్థాయి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

## భవిష్య నిధి

కర్నూలు : ఉద్యోగులను గత వైకాపా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. వేతనాలు సరైన సమయానికి చెల్లించలేదు. చివరికి భవిష్య నిధిలో దాచుకున్న సొమ్మును చెల్లించడంలోనూ నిర్లక్ష్యం చేసింది. గృహాల కొనుగోలు, పిల్లల చదువు, వారి పెళ్లిళ్లు తదితర అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసినా వాటిని పక్కన పెట్టేసింది. ఫలితంగా చాలామంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించింది. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న రెండు మూడు నెలల్లోనే సొమ్ము అందజేస్తోంది.
470 మంది దరఖాస్తు ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి 470 మంది సభ్యులు నగదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 443 మంది సభ్యులకు రూ.21.08 కోట్లు మంజూరు చేశారు. పదవీ విరమణ పొందిన 234 మంది సభ్యులకు సంబంధించి రూ.28.12 కోట్లు చెల్లించేందుకు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో 190 మందికి రూ.18.82 కోట్ల మేర సొమ్ము జమైంది. మరో రూ.9.30 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తుండటంతో ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా పొదుపు చేస్తూ..ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ భవిష్య నిధికి సంబంధించి 6,960 మంది సభ్యులున్నారు. జడ్పీ పరిధిలో ఏర్పాటుచేసిన భవిష్యనిధిలో జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సభ్యులుగా చేరి ప్రతి నెలా పొదుపు చేస్తుంటారు. దీనిపై ఏడాదికోసారి వడ్డీతో లెక్కగట్టి సంబంధిత ఉద్యోగి ఖాతాకు జమ చేస్తారు. ఇప్పటివరకు రూ.282.38 కోట్ల సొమ్మును ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో దాచుకున్నారు. వివరాలు నవీకరించక..జడ్పీ భవిష్యనిధి ఖాతా సభ్యుల వివరాలు నవీకరించక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్ చేస్తేనే వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయని సభ్యులు చెబుతున్నారు.

## వడివడిగా ఉక్కు అడుగులు

నక్కపల్లి : పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమా రు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూములకోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు





చేపట్టింది. కొద్దిరోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలుపెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్యలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే స్లైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందడుగు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు తెలిపారు.

## అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నా.. అధికారులు మాత్రం కొరడా ఝళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరి పెడుతున్నారు. రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57-2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పిల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గుంట్లు తీసి..



రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గుంట్లుపూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

**చెరువుల చిక్కిపోతున్నాయ్..** జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదెకరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...** - వి.వి.రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

రాజన్నపేట చెరువులో అక్రమంగా వేసిన రోడ్డును అడ్డుకున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. అతిక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ ఆక్రమణలను సహించేది లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు.

# నైరుతి.. నైరాశ్యం



అనంతపురం : మరో రెండు రోజుల్లో ఆరుద్ర కార్తె ముగియనుంది. ఇంతవరకు చినుకు జాడలేదు. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి అనంత జిల్లాలో ముందస్తుగా రుతుపవనాలు ప్రవేశించడంతో భారీ వర్షాలు కురుస్తాయని తొలుత వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. జులై వచ్చినా వరుణుడు కరుణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు

**వేసవిలో అధికం..**

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది. అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 142 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో 66.6 మి.మీ గాను 148.9 మి.మీ అత్యధికంగా నమోదైంది.

**47 వేల ఎకరాల్లోనే..**

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాల్లోనే సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా...అందులో 24,044 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకుగాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

**18 వేల ఎకరాల్లోనే వేరుసెనగ**

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ ఇప్పటివరకు 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

**అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు**

ఖరీఫ్ పంటల సాగుకు సమయం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. జులై మొదటి వారం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు. మొలకరాక నష్టపోతారు. జులై నెలంతా సాగుకు అనుకూలమే. వేరుసెనగతో పాటు కంది, సజ్జ, కొర్రలు, పెసర తదితరాలు సాగు చేసుకోవడం ఉత్తమం.

డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, రెడ్డిపల్లి

# అటు వెడల్పు.. ఇటు లైనింగ్



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. నీటి సీజన్ మొదలు కావడం.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పనుల పురోగతిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కాలువకు ఈనెలాఖరులోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్.. క్షేత్ర స్థాయి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువ పనుల్లో వేగం పెరిగింది. కానీ పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి తొలగింపుల్లో వేగం పెరగాల్సి ఉంది. ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. ప్రధాన కాలువ తొలి దశ కింద వెడల్పు, రెండో దశలో పీబీసీ లైనింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే.

**తొలి దశ కీలకం**

ప్రధాన కాలువ తొలి దశ కింద విస్తరణ పనులు చేస్తున్నారు. 88 కి.మీ. నుంచి 216.300 కి.మీ. దాకా వెడల్పు చేయడానికి ప్రభుత్వం రూ.695.53 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వు ఇచ్చిన సంగతి తెలిసిందే. 3850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో విస్తరిస్తున్నారు. మార్చి రెండో వారం నుంచి పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 71.02 శాతం పనులు జరిగాయి. 84.97లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉండగా... 60.345 క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తిపోశారు. తొలి దశ కాలువ ద్వారా గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు నీరు అందనుంది.

**259 కి.మీ.మేరకు..** రెండో దశలో ప్రధాన కాలువ, పీబీసీ కలిపి లైనింగ్ పనులు 259 కి.మీ. చేయాల్సి ఉంది. 216 నుంచి 400 కి.మీ. దాకా ఇద్దరు గుత్తేదారులు ఐదు ప్యాకేజీలుగా విభజించారు. ఇందుకు రూ.1256.30 కోట్ల అంచనా వ్యయంతో పని చేస్తున్నారు. లైనింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇక పీబీసీని రెండు ప్యాకేజీలు విభజించారు. రూ. 266.24 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరణ సాగుతోంది. లైనింగ్‌లోనే కాదు.. మట్టి పనిలోనూ నత్తనడక కొనసాగుతోంది. ఈ రెండు ప్యాకేజీల్లో వేగం పెరగాల్సి ఉంది. మేలో కొంతమేర వర్షాలు పడటంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈనెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్ఈ స్వరూప్‌కుమార్ తెలిపారు.రెండో దశ ప్రధాన కాలువ ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి నియోజకవర్గాల మీదుగా వెళ్తుంది.

# జేఎన్‌టీయూ టు స్వీడన్


విశాఖపట్నం : అనంత జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివితే స్వీడన్‌కు వెళ్లే అవకాశం ఉంది. స్వీడన్‌లోని బికింగ్‌హామ్ విశ్వవిద్యాలయంతో జేఎన్‌టీయూ ఒప్పందం కుదుర్చుకుంది. సాధారణంగా బీటెక్ చదివితే ఒక డిగ్రీ పట్టా వస్తుంది. జేఎన్‌టీయూ అందిస్తున్న డబుల్ డిగ్రీ కోర్సుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేస్తే ఒకేసారి రెండు డిగ్రీలు పొందొచ్చు. ఇక్కడ మూడేళ్లు, స్వీడన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు జేఎన్‌టీయూ బీటెక్ పట్టా, స్వీడన్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. 2017 నుంచి కళాశాల ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. ఇటీవలే మాస్టర్స్ డిగ్రీ జత కలిపారు.

**ప్రవేశాలు ఎలా..**

డబుల్ డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో 60 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ, ఈఏపీసెట్ గాని, తెలంగాణ ఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలి. జేఈఈలో ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 20, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 10 సీట్లున్నాయి.

**ప్రయోజనం ఏమిటి?**

విదేశీ విద్య, ఉద్యోగాలు చేయాలనుకునేవారికి కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జేఎన్‌టీయూ అందించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) సర్టిఫికెట్‌తో ఎంఎస్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఎంఎస్‌లో చేరి స్వీడన్‌లోనే కొలువులు



సాధించవచ్చు.

**ఈనెల 10 వరకు గడువు**

దరఖాస్తుకు ఈనెల 10 తుది గడువుగా నిర్ణయించాం. 14 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. ఏటా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్ కళాశాల నిర్ణయించిన మేరకు ఫీజు చెల్లించాలి. అక్కడ ఉత్తమ మార్కులు సాధిస్తే ఉపకారవేతనం లభిస్తుంది. సాధారణ బీటెక్‌లా కాకుండా డబుల్‌డిగ్రీ కోర్సులో చేరడం వల్ల రెండు డిగ్రీలు లభిస్తాయి. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

## పొదుపు ఖాతాకు కన్నం

కర్నూలు : పేదల పొదుపు సొమ్మును కాజేశారు.. ఖాతాదారుల సొమ్ముకు రక్షణగా నిలవాల్సిన వారే భక్షకులుగా మారారు. నగరంలోని " ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ"లో రూ.2.42 కోట్లు పక్కదారి పట్టిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. పాతబస్తీలోని కర్నూలు అర్బన్ బ్యాంకు 2010లో ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీగా ఏర్పాటైంది. నాలుగు వేల మంది సభ్యులున్నారు. వ్యాపారాన్ని పెంచుకునేందుకు 100 రోజుల కాలపరిమితితో రోజువారీ డిపాజిట్లు సేకరించారు. 2018-19 నుంచి 2021-22 వరకు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

**విచారణ పేరుతో కాలయాపన**

ఫిక్స్‌డ్ డిపాజిట్ల కాలపరిమితి పూర్తయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. 2021-22లో లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు తేలింది. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో 2023 నవంబరులో సహకార అధికారులు విచారణకు ఆదేశించారు. నిధుల స్వాహా జరిగి మూడేళ్లవుతున్నా విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప నిందితులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 2018లోనే తగుచర్యలు తీసుకుని ఉంటే పేదల సొమ్ముకు రెక్కలొచ్చేవి కాదు.

**రూ. 2.42 కోట్లు స్వాహా**

డైలీ డిపాజిట్లలో రూ.60 లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్స్ డిపాజిట్లలో రూ.99 లక్షలు పక్కదారి పట్టించారు. షేర్ క్యాపిటల్ (మూలధనం) నగదు రూ.32 లక్షలు, చేతిలో ఉంచుకున్న



నగదు రూ.10 లక్షలు, పాతబకాయిల వసూళ్లలో రూ.56 లక్షలు, నగదు పుస్తకంలోని కూడికల్లో రూ.3.50 లక్షలు, ఉద్యోగుల వేతనాల పేరుతో రూ.6 లక్షలు, ఇంకా ఇతరత్రా రూపాల్లో కలిపి మొత్తం రూ.2,42,76,980 సొమ్ము కాజేసినట్లు తేలిందని జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

**కాపాడాల్సిన వారే కాజేశారు**

2023 నవంబరు వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సహకార చట్టంలో ఛైర్మన్, సీఈవోకు జాయింట్ చెక్ పవర్ ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం నాన్ అఫీషియల్ పాలకమండలి ఛైర్మన్ అయిన బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఉండటంతో అనీతి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి 2023 నవంబరు వరకు బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సొసైటీలో పనిచేసే క్లర్క్ పదోన్నతిపై సీఈవో జాకీర్ బాషా 2022 వరకు పనిచేశారు. అదే సొసైటీలో క్లర్క్, క్యాషియర్, సీఈవోగా పనిచేసిన ఎస్.ఏ రఫీక్ పాత్ర ఉన్నట్లు తేలింది. బ్యాంకులో పనిచేస్తూ.. బ్యాంకుకే కన్నం వేశారు. పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేస్తూ సహకార సొసైటీని అభివృద్ధి చేయాల్సిన వ్యక్తి.. ఆయనకు ఒక్కడికే చెక్ పవర్ ఉండడంతో తనను అడిగేదెవరు అంటూ అందిన కాడికి దోచుకున్నారు.

# 'అద్దె'రువు

నంద్యాల: ఓ ప్రైవేటు గోదాము ప్రతినిధులు, పౌర సరఫరాలశాఖ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. గోదాము విస్తీర్ణాన్ని పెంచి భారీ ఎత్తున అద్దెను (స్టోరేజీ రుసుములు) దండుకొన్నారు. ప్రతి నెల రూ.1,68,640 చొప్పున నాలుగున్నరేళ్లలో సుమారు రూ.కోటి వరకు అదనంగా చెల్లింపులు జరిగాయి. జిల్లా అవసరాల నిమిత్తం పౌరసరఫరాలశాఖ గోస్పాడులోని 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను 2019లో అద్దెకు తీసుకుంది. దానిని నేరుగా వేర్‌హౌస్ యాజమాన్యం నుంచి కాకుండా రాజ్‌కుమార్ నుంచి తీసుకోవడం గమనార్హం. ఆ గోదామును రాజ్‌కుమార్ లీజుకు తీసుకుని పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. దాని సామర్థ్యం 13 వేల మెట్రిక్ టన్నులని చెప్పి అద్దె ఒప్పందం చేసుకొన్నారు. సుమారు నాలుగున్నరేళ్లపాటు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అక్కడ తాజాగా కొలతలు తీయడంతో ప్రతి నెల 1984 టన్నులకు అదనంగా అద్దె వసూలు చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

**1,800 సంచుల బియ్యం మాయం**గోవరం భఫర్ గోదాములో ఉండాల్సిన 1,800 సంచుల బియ్యాన్ని పక్కదారి పట్టించారు. లెక్క ప్రకారం ఉండాల్సిన బియ్యం సంచులు లేకపోవడంతో ఆయా వివరాలు దస్త్రాల్లో మళ్లీ రాయాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు రాస్తే అక్రమాల విషయం బయటపడుతుందన్న ఉద్దేశంతో గోదాములో సరకు మొత్తం ఖాళీ చేసిన తర్వాతే గిడ్డంగుల సంస్థ స్వాధీనం చేసుకున్నట్లు చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**లీజు మార్పుతో వెలుగులోకి**

: అద్దెకు తీసుకొన్న ప్రైవేటు గోదాముల (ఇన్వెస్టర్ గోదాము) విషయంలో భారీ అక్రమాలు జరిగినట్లు 'కూటమి' ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ' (ఏపీఎస్‌డబ్ల్యూసీ) గోదాములను తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సదరు సంస్థకు జిల్లాలో సొంత గోదాములు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. తాము అద్దెకు తీసుకున్న 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను గిడ్డంగుల సంస్థకు బదలాయించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు గిడ్డంగుల సంస్థ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో గిడ్డంగుల సంస్థ అధికారులు పరిశీలించి దాని కొలతలు తీసుకోవడంతో తేడాలొచ్చాయి. అందులో 13 వేల టన్నుల సరకు పట్టదని.... 11,016 టన్నులు నిల్వ చేసేందుకే సరిపోతుందని తేల్చారు. అంత విస్తీర్ణానికే అద్దె చెల్లిస్తామని తేల్చి చెప్పారు. ఆమేరకు ఏపీఎస్‌డబ్ల్యూసీ అధికారులు పౌరసరఫరాలశాఖ అధికారులకు లేఖ రాయడంతో అక్రమాల గుట్టు రట్టయింది. అక్రమం జరిగిన విషయం తేలినా గోదాము అనుమతిని గత నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

చురకలు



# మునక పొలం.. వెనుక బేరం

నందికొట్కూరు : శ్రీశైల జలాశయం వెనుక జలాల్లో 'భూ'పంచాయితీలు తారస్థాయికి చేరాయి. నదిలో నీటి నిల్వ తగ్గడంతో మైదాన ప్రాంతంగా మారింది.. ఒండ్రు మట్టితో కూడుకుని ఉన్న ఆయా భూముల్లో పంటలు సాగు చేసుకొంటున్నారు. పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువగా ఉండటంతో సొంతం చేసుకోవడానికి రైతుల మధ్య పోటీ పెరిగింది. ఈ కారణంగా వారి మధ్య వివాదాలు తలెత్తి ఘర్షణలు జరుగుతున్నాయి. డిమాండ్ పెరగడంతో మరికొందరు అనధికారికంగా పొలాలను విక్రయిస్తున్నారు.

**ఏటా తేల్చని అధికారులు**

శ్రీశైలం జలాశయం నిర్మాణానికి పూర్వం కొత్తపల్లి మండలంలోని జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం గ్రామాల్లో సుమారు 250 కుటుంబాల వారు నివసించే వారు. వీరు 1,300 ఎకరాల భూమిని సాగు చేసుకునే వారు. ముంపు తర్వాత పునరావాస ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నీరు తగ్గి తర్వాత పంటలు సాగు చేసుకొంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన మరికొందరు ఆయా గ్రామాలకు చేరుకొని అవన్నీ మా భూములే అంటూ పంచాయితీలు చేస్తున్నారు. గతేదాది ఈ అంశం అధికారుల దృష్టికి వెళ్లడంతో 145 సెక్షన్ విధించి సాగు ఆపేశారు. వాటిని నమ్ముకొన్న కుటుంబాలకు జీవనాధారం కరవైంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవిస్తున్నారు.

**అక్రమంగా విక్రయాలు**



నీటి ముంపు నుంచి తేలిన పొలాల్లో భూసారం ఎక్కువగా ఉండటంతో విత్తనం వేస్తే చాలు మంచి పంట దిగుబడి వస్తోంది. ఆయా భూముల్లో మొక్కజొన్న, మినుము, శనగ, కంది, పొగాకు పంటలు సాగు చేస్తున్నారు.

**రెండు పంటలు పండించుకుంటారు.**

ముంపు నుంచి బయటపడే సమయాన్ని బట్టి పొలాలకి ధర నిర్ణయిస్తున్నారు. ఎకరం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. నది గర్భంలో ఉన్న పొలాలకు కౌలు ఎకరం రూ.5 వేలు పలుకుతోంది. నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల పరిధిలో సమస్యలు లేని భూములను స్థానికులు ఎకరం రూ.లక్ష నుంచి రూ.3 లక్షలకు విక్రయించారు. రూ.10 వేల వరకు కౌలు వసూలు చేస్తున్నారు. ఈ మూడు మండలాల్లో సుమారు 200 ఎకరాల వరకు విక్రయించినట్లు సమాచారం. వీటికి రిజిస్ట్రేషన్లు లేకున్నా కాగితంపై రాసుకుని విక్రయాలు సాగిస్తున్నారు.

**63 గ్రామాలు.. 35 వేల ఎకరాలు**

నందికొట్కూరు నియోజకవర్గంలో 63 గ్రామాలు శ్రీశైలం జలాశయం నిర్మాణ సమయంలో ముంపునకు గురయ్యాయి. వాటి పరిధిలో సుమారు 35 వేల ఎకరాల వరకు పొలం ఉంటుంది. ఆయా భూములు జులై నుంచి నవంబరు వరకు నీటిలో మునిగి ఉంటాయి.

డిసెంబరు మొదటి వారం నుంచి కృష్ణానదిలో క్రమంగా నీరు తగ్గిపోయి భూములు తేలుతాయి. నిర్వాసితుల్లో చాలామంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇక్కడే ఉన్న కొందరు ఆయా భూముల్లో ఏటా పంటలు సాగు చేసుకొంటారు.

మునక భూములు సారవంతంగా ఉండటంతో పంటల దిగుబడి అధికంగా వస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు వాటిని సొంతం చేసుకొనే పనిలో పడ్డారు. గ్రామాలు వదిలివెళ్లిన వారు తిరిగొచ్చి తమ భూములు తామే సాగు చేసుకుంటామనడంతో ముంపు గ్రామాల్లో గొడవలకు దారి తీస్తోంది.

# ఏమీ లేదు గర్వకారణం

గిద్దలూరు : వైద్య విధాన పరిషత్ వైద్యశాల పరిధిలోని ప్రాంతీయ, సామాజిక ఆరోగ్య కేంద్రం, మాతా శిశు వైద్యశాలల్లో అందిస్తున్న సేవలు, రోగుల సంఖ్య, వసతుల ఆధారంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ప్రతి నెలా ఆసుపత్రులకు గ్రేడ్‌లను కేటాయిస్తారు. జిల్లాలో వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 2 ప్రాంతీయ వైద్యశాలలు, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, మరో ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించి వీటిలో ఏ ఒక్కటీ ఎ గ్రేడ్ సాధించలేదు. యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలకు, కొండపిలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మాత్రమే బి గ్రేడ్ దక్కింది. మిగిలిన గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాల, ఒంగోలు మాతాశిశు వైద్యశాల, కనిగిరి, కంభం, చీమకుర్తి, దోర్నాల, దర్శి, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాలు సి గ్రేడ్‌తో సరిపుచ్చుకున్నాయి.

**ఇవీ వేధిస్తున్న వెతలు:**

కూటమి ప్రభుత్వం స్పెషలిస్టు వైద్యులను నియమించింది. అదే సమయంలో పూర్తిస్థాయిలో అధునాతన పరికరాలు అందుబాటులో లేకపోయాయి. దీంతో రోగులకు శస్త్రచికిత్సలు చేయలేని పరిస్థితి.

గత ప్రభుత్వం ప్రైవేట్ వైద్యశాలల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కాన్పులు, సిజేరియన్లకు అవకాశం కల్పించింది. దీంతో ప్రసవాల కోసం గర్భిణులను వారి కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్యశాలలకు తీసుకెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రసవాల సంఖ్య తగ్గిపోయింది. జిల్లాలోని పలు వైద్యశాలల్లో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. పామూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మూలకు చేరింది. దోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం అందుబాటులో లేదు. పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం మంజూరైనప్పటికీ వినియోగంలోకి తేలేదు.

గత వైకాపా పాలనలో గిద్దలూరు వైద్యవిధాన పరిషత్ వైద్యశాల భవనాన్ని గుత్తేదారుడు అసంపూర్తిగా నిర్మించి అప్పగించారు. కంటి శస్త్రచికిత్స, ఎముకల చికిత్స విభాగం, చెవి, ముక్కు, గొంతు విభాగాలకు చెందిన శస్త్ర చికిత్స పరికరాలు అందుబాటులోకి రావాల్సి ఉంది.

నిధులకు చొరవ చూపితే మేలు: వైద్యశాలల్లో మౌలిక వసతులతో పాటు, అధునాతన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

కంభం, దర్శి, దోర్నాల, పామూరు, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో జనరేటర్ల ఏర్పాటుకు రూ.60 లక్షలు అవసరం. దర్శి, దోర్నాల, కొండపి, పొదిలి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో డిజిటల్ ఎక్స్‌రే క్యాస్ట్ రీడర్ ఏర్పాటుకు రూ.32 లక్షలు కావాలి.గిద్దలూరు, యర్రగొండపాలెం ప్రాంతీయ వైద్యశాలల్లో చెవి, ముక్కు, గొంతు సేవల విభాగానికి శస్త్ర చికిత్సల పరికరాల కోసం రూ.88.72 లక్షలు ఇవ్వాలి.కంటి చికిత్సల పరికరాల కోసం రూ.36.20 లక్షలు, ఎముకల విభాగం పరికరాల కోసం రూ.47 లక్షల నిధుల అవసరం. ఈ మేరకు జిల్లా అధికారులు రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. ఖాళీగానే పోస్టులు: జిల్లా వ్యాప్తంగా వైద్యవిధాన పరిషత్ వైద్యశాల పరిధిలో 21 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, పదోన్నతి ద్వారా వచ్చే డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు 19, జనరల్ మెడిసిన్ పోస్టులు 2, సీఎస్ఆర్ఎంవో 2 ఖాళీగా ఉన్నాయి.

# ఆకర్షణ మాయలో.. అకృత్యాల వేటలో!



అనంతపురం : బడికి వెళ్తున్న బాలికను ఓ యువకుడు ప్రేమ పేరుతో లొంగదీసుకున్నాడు. మోసగించి అత్యాచారం చేశాడు. ఆ దురాగాతాన్ని వీడియోల్లో చిత్రీకరించి.. వాటిని అడ్డం పెట్టుకుని మరికొందరు బాలికపై అత్యాచారపర్వం సాగించారు. ఇటీవల బాధితురాలు గర్భం దాల్చడంతో ఈ దారుణ విషయాలు వెలుగులోకి వచ్చాయి. శ్రీసత్యసాయి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో మైనర్లపై జరుగుతున్న అకృత్యాలు ఆందోళన కల్గిస్తున్నాయి. ఆకర్షణల వలలో చిక్కుకుని కొందరు విలవిలలాడుతున్నారు. సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. అదే సమయంలో సంరక్షణ, పెంపకం పరంగా తల్లిదండ్రుల శ్రద్ధ లోపిస్తోంది. నైతిక విలువలు, క్రమశిక్షణ లోపించి మైకం కమ్మేసిన కొంతమంది యువకులు ప్రేమ పేరుతో ఇష్టారాజ్యంగా బాలికలపై అమానవీయ చర్యలకు పాల్పడుతున్నారు. టీనేజీ ప్రేమ ఆకర్షణే తప్ప అందులో పరిపక్వత ఉండదని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. చదువుకోవాల్సిన వయసులో ప్రేమిస్తున్నానని వెంటాడి వేధింపులకు పాల్పడుతూ విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు.

**నిజస్వరూపం తెలిశాక..**

కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. అదే గ్రామానికి చెందిన మోసగాడి మాటలు నమ్మింది. సర్వం అర్పించింది. తీరా పెళ్లి విషయం తెచ్చేటప్పటికి ఆ యువకుడు ముఖం చాటేశాడు. పోలీసులను ఆశ్రయించగా.. పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు పంపారు.

మరో ఘటనలో పదో తరగతి చదివిన బాలిక చరవాణిలో పరిచయమైన ఓ యువకుడి మాయలో పడి.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకుంది. తీరా కాపురానికి వెళ్లాక అక్కడ భర్త, అతని కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేశారు. దిక్కుతోచక తిరిగి నగరానికి చేరుకుని పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే ఆమె గర్భిణి.. మైనర్‌ను పెళ్లి చేసుకోవడమే కాకుండా వేధింపులకు గురి చేసిన భర్తపై పోక్సో కేసు నమోదు చేసి కటకటాలకు పంపారు.

**గడప దాటి..**

వారం క్రితం శింగనమల నియోజకవర్గంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ చదివింది. తల్లిదండ్రులకు తోడుగా కూలి పనులకు వెళ్తుండేది. ఈ క్రమంలో ఓ యువకుని ఆకర్షణకు లోనైంది. ముక్కూ ముఖం తెలియని వాడితో గడప దాటి వెళ్లిపోయింది. ఆ తర్వాత కానీ అమ్మాయికి అతని అసలు స్వరూపం బోధపడలేదు. కేవలం శారీరక సుఖం కోసమే తనకు దగ్గరయ్యాడని గ్రహించి తిరిగి ఇంటికి చేరుకుంది.

**పట్టేదెవరికి?**

పాఠశాలల్లో కేవలం పుస్తకాల పాఠ్యాంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారు. యవ్వన దశలో చోటు చేసుకున్న ఆకర్షణ, ప్రేమ, వాటి పర్యసానాలపై చర్చ జరగడం లేదు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం విద్యాలయాల్లో బాలికలకు అనుకోని ఆపద, ప్రేమ పేరుతో ఎదురయ్యే ఇబ్బందులపై రహస్యంగా వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించేలా.. ఎప్పటికప్పుడు బాలికల సమస్యలు తెలుసుకునేలా ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని ఆదేశించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**లక్ష్యంపై ప్రేరణ నింపాలి**

ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణుడు

ప్రేమ, పెళ్లి పేరుతో ఎదురయ్యే ఆకర్షణ వలలో బాలికలు చిక్కుకోకుండా ఉండేందుకు వారి ప్రవర్తన, కదలికలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు శ్రద్ధ చూపించాలి. మంచి చెడులను వారికి అర్థమయ్యేలా వివరించాలి. పిల్లల అభిప్రాయాల్ని గౌరవించి సమాజంలో ఎవరితో ఎలా మసలుకోవాలో తెలియజెప్పాలి. ఆకర్షణ వలలో చిక్కుకున్న దారుణ ఘటనల్ని మైనర్లకు తెలపాలి. ఉన్నత లక్ష్యాల వైపు మనసు లగ్నం చేసేలా వారిలో ప్రేరణ నింపాలి. సాధనపై ఏకాగ్రత చూపించే విధంగా నిత్యం కంటిపాపలా చూసుకోవాలి.

# దగ్గరవుతున్న దారి



నంద్యాల : జిల్లా మీదుగా వెళ్లనున్న జాతీయ రహదారి (167కే) పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. కొత్తపల్లి మండలం సిద్ధేశ్వరం నుంచి నంద్యాల వరకు మొదటి విడత పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా రైతుల నుంచి సేకరించిన భూమికి నష్టపరిహారం అందజేస్తున్నారు..ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించనున్నారు. ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ హైదరాబాద్-తిరుపతి ప్రయాణ మార్గాన్ని 70 కి.మీ.లు తగ్గించేందుకు ఈ రహదారి (కల్వకుర్తి-జమ్మలమడుగు)ని ప్రతిపాదించారు. తెలంగాణ రాష్ట్రం కల్వకుర్తి నుంచి జిల్లా సరిహద్దు వరకు రహదారి నిర్మాణ పనులు పూర్తికావొచ్చాయి.

**251 హెక్టార్ల భూసేకరణ** సిద్ధేశ్వరం నుంచి నంద్యాల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి 620 ఎకరాల భూమిని సేకరించారు. రూ.170 కోట్ల పరిహారానికి గానూ ఇప్పటికే రూ.100 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారు. 90 శాతం నష్టపరిహారం అందించిన వెంటనే పనులు ప్రారంభిస్తారు. ఇప్పటి వరకు 75 శాతం పరిహారం పంపిణీ పూర్తయ్యింది.

ప్యాకేజీ-4లో భాగంగా 62.77 కి.మీల పొడవునా నిర్మించే ఈ రోడ్డుకు రూ.776.65 కోట్ల అంచనాతో టెండర్లు పిలిచారు. అనంతపురానికి చెందిన ఓ గుత్తేదారు సంస్థ పనులు దక్కించుకొంది.

**ప్యాకేజీ-3, 5లపై తర్వాత నిర్ణయం**

జాతీయ రహదారి 167కేలో భాగంగా ప్యాకేజీ-1 కింద తెలంగాణలో ఇప్పటికే పనులు ప్రారంభం కాగా, ప్యాకేజీ-2 కింద ఐకానిక్ వంతెనకు టెండర్లు పూర్తి చేశారు. ప్యాకేజీ-4కు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా ఖరారు చేయాల్సి ఉంది.

ప్యాకేజీ-3కి సంబంధించి నల్లకాల్వ-వెలుగోడు మధ్య నిర్మించే రోడ్డుకు టెండర్లు పిలవలేదు. అటవీ ప్రాంతంలో నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండటంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమతులు ఇవ్వాలి. ప్యాకేజీ-5 కింద నంద్యాల-జమ్మలమడుగు రహదారి ఉంది. ఇక్కడ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

# తంగడంచను తుంచారు



నందికొట్కూరు : జాతీయ, రాష్ట్రస్థాయిల్లో పేరొందిన తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం భూముల్ని ఆక్రమించేస్తున్నా...అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కొందరు దుకాణాలు, ఆలయాల్ని నిర్మించేశారు. కొన్నిచోట్ల మట్టిని తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నా..అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. తంగడంచ విత్తనోత్పత్తి క్షేత్రం 1653 ఎకరాల్లో ఏర్పాటైంది. ఇందులో ఉద్యానవనానికి 26 ఎకరాలు కేటాయించగా, మూడెకరాల్లో సపోటా, మామిడి పెంచేవారు. ప్రస్తుతం అవన్నీ కనుమరుగై సుమారు మూడెకరాల్లో చెట్లు దర్శనమిస్తున్నాయి. వైకాపా పాలనలో ఉద్యానవనానికి కేటాయించిన భూమిలో కొంత జగనన్నకాలనీకి కేటాయించారు. మిగిలిన భూమి నిరుపయోగంగా మారింది.విత్తనోత్పత్తి క్షేత్రానికి చెందిన మిగిలిన భూమిలో సుమారు 20 ఎకరాల్లో కార్యాలయాలు, షెడ్లు నిర్మించారు. మరో అయిదెకరాల్లో సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మించారు. జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 623 ఎకరాలు, మెగాసీడ్ హబ్‌కు 500 ఎకరాలు, ఏపీఐఐసీకి 200 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రానికి 177 ఎకరాల భూమి మాత్రమే ఉండగా, ఇందులో సుమారు 150 ఎకరాల విస్తీర్ణంలో కంది, సెనగ విత్తనోత్పత్తి చేస్తున్నారు.ఇప్పటికే కేజీ రహదారి వెంట దుకాణాలు వెలిశాయి. కొన్ని ఆలయాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలుసుకుని తంగడంచ విత్తనోత్పత్తి సహాయ సంచాలకులు ఇక్కడ స్థలాలకు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేశారు. తంగడంచ విత్తనోత్పత్తి కార్యాలయం సమీపాన క్షేత్రానికి సంబంధించిన భూముల్లో మట్టి తవ్వకాల దందా సాగుతోంది. సుమారు 100 ట్రిప్పుల వరకు మట్టిని తరలించిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఈ భూముల్లో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేస్తుండటంతో భారీగా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాష్ట్ర విత్తనోత్పత్తి క్షేత్రానికి సంబంధించిన భూములు, స్థలాల్ని కాపాడాలని స్థానికులు, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

# నిధి వెక్కిరింత.. విస్తరణ తీరని చింత

బనగానపల్లి : కుందూ నది విస్తరణ పనుల పేరుతో గత వైకాపా ప్రభుత్వం హడావుడి చేసింది. పెద్దఎత్తున నిధులు కేటాయించినట్లు గొప్పలు చెప్పింది. అధికారులు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించారు. కొంతమేర పనులు చేపట్టినా బిల్లులు మంజూరు చేయలేదు. దీనికితోడు భూసేకరణ పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ఎక్కడికక్కడ పనులు ఆగిపోయాయి.

బనగానపల్లి మండల పరిధిలోని టంగుటూరు గ్రామం నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు సమీపంలోని పెన్నా నది వరకు 187 కి.మీ. మేర కుందూ నది విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. నదికి సంబంధించి రెండు వైపులా కలిపి 130 మీటర్ల మేర విస్తరించి 35 వేల క్యూసెక్కుల నీరు వైఎస్సార్ జిల్లాలో ప్రవహించే పెన్నా నదిలో పంపేలా అప్పట్లో అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీనికిగాను గత ప్రభుత్వం రూ.1,758 కోట్లు కేటాయించింది. 2021, మార్చి 31న పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రస్తుతం 18 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో ప్రవహించే కుందూ



నదిని 35 వేల క్యూసెక్కులకు పెంచేలా పనులు చేపట్టారు. ఈ నిధులతోనే కోవెలకుంట్ల సమీపంలోని జొలదరాశి వద్ద 0.80 టీఎంసీ నీటిని నిల్వ చేసేలా ఒక ప్రాజెక్టు, చాగలమర్రి సమీపంలోని రాజోలి వద్ద 3 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో మరో ప్రాజెక్టు నిర్మించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులు దాటి మిగులు జలాలను పెన్నా నదిలోకి తీసుకెళ్తారు. ఏటా వర్షానికి కుందూలో నీరు ఉద్ధృతంగా ప్రవహించి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. విస్తరణ పనులు పూర్తి చేస్తే రైతులకు ఎలాంటి నష్టం జరగదు. నీరు సాఫీగా ప్రవహిస్తుంది.

**భూసేకరణ చేయకనే..**

2019 డిసెంబరులో జొలదరాశి జలాశయం, కుందూ నది విస్తరణ పనులకు వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం నెలటూరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 8 వేల ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఆ ఊసే లేకుండా పనులు ప్రారంభించేశారు. కుందూ ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో మాత్రమే పనులు చేశారు. దీనికితోడు చేసిన పనులకు బిల్లులు మంజూరుకాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు. ఈ విషయమై ఈఈ సురేశ్‌బాబు మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వ ఆదేశాలమేరకు పనులు ప్రారంభించామని చెప్పారు. మొదట్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు పనులు ఆపేశారని చెప్పారు. ఇప్పటివరకు రూ.100 కోట్ల విలువైన పనులు మాత్రమే చేశారని వివరించారు. తాజా పరిస్థితిని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**ఏటా పంట నష్టమే - శేఖర్, పొట్టిపాడు**

గ్రామంలో కుందూ ఒడ్డున ఆరెకరాల పొలం ఉంది. ఏటా భారీ వర్షాలకు కుందూలో వరద ప్రవాహం పెరిగి పొలాలు మునిగిపోతున్నాయి. వరి పంటకు ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వస్తోంది. కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని విస్తరణ పనులు పూర్తి చేస్తే మా కష్టాలు తీరుతాయి.

# ఖరీఫ్‌కు ఢోకా లేదు

బొబ్బిలి: ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. గతేడాది మేతో పోల్చితే వట్టిగెడ్డ మినహా మిగిలిన చోట్ల స్వల్పంగా పెరిగాయి. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా లేదని ఇంజినీర్లు చెబుతున్నారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభమైతే పూర్తిస్థాయి నీటి మట్టాలు చేరి, పూర్తి ఆయకట్టుకు నీరందే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా మే నెలలో కురిసిన వర్షాలతో నీరు చేరిందని ఈఈ అప్పలనాయుడుతో అన్నారు.

**తాగునీటి గండం గట్టెక్కినట్లే!**

జలాశయాల్లో నీటి మట్టాలు పెరగడంతో తాగునీటి కష్టాలు కూడా



దాదాపు గట్టెక్కినట్లే. వేగావతి నదిపై సాలూరు, బొబ్బిలి పురపాలక సంఘాల తాగునీటి పథకాలు ఉన్నాయి. వీటితోపాటు మరో 110 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే పథకాలున్నాయి. గతేడాది వేగావతిలో నీరు ఇంకిపోవడంతో పైన పెద్దగెడ్డ జలాశయం గేట్లు ఎత్తితే నదిలోకి నీరు వచ్చింది. దీంతో తాగునీటి ఇబ్బందులు తప్పాయి. ఈ ఏడాది ఆ పరిస్థితులు తలెత్తే అవకాశాలు లేవంటున్నారు. అలాగే సువర్ణముఖి నదిలో మరో 80 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. నాగావళి నదిలో పార్వతీపురం పట్టణ తాగునీటి పథకాలతోపాటు సుమారు 100 గ్రామాలకు చెందిన పథకాలు ఉన్నాయి. రిజర్వాయర్లలో నీరు చేరడంతో ఇబ్బందులు లేనట్లేనని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు అంటున్నారు.

# జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

పుంగనూరు : కూటమి ప్రభుత్వం నీటితొట్టెల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఉపాధిహామీ పథకం కింద ఏప్రిల్ మొదటి వారంలో తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉద్యాన పంటల సాగు అధికం. ముఖ్యంగా టమాటా, మామిడి, ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా పాడి పరిశ్రమ ఉంటుంది. ఆవులు, గెదేలు పెంచి పాలు విక్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం టమాటా ధరలు పతనం కావడంతో రైతులు పాడిపైనే ఆధారపడుతున్నారు. నిత్యం పాల నుంచే ఆదాయాన్ని జీవనానికి వినియోగిస్తున్నారు.ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.33 వేలతో పనులు ప్రారంభించారు. జిల్లాలోని 700 పంచాయతీలకు 1,751 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. 5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 2 అడుగుల లోతుతో నిర్మిస్తారు. ఇప్పటి వరకు అధికారులు 579 పూర్తి చేశారు. మిగిలిన 1,172 వివిధ దశల్లో ఉన్నాయి.

# కుంభకోణాల కథ కంచికా.. అక్రమార్కుల మంచికా!!



విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా జరిగిన కుంభకోణాలపై అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించడంతోపాటు, కొన్ని కమిటీలు వేశారు. అయితే ఈ విచారణలు నత్తనడకన సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న అక్రమాల డొంక కదలాలంటే విచారణ త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది.

డెయిరీ గుట్టు విప్పితేనే: విశాఖ డెయిరీలో అక్రమాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో అసెంబ్లీ సభా సంఘం ఛైర్మన్ జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో ఈఏడాది మార్చిలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డెయిరీ ఆధ్వర్యంలో భూములు, పాడి రైతులకు డబ్బులు తగ్గించి ఇవ్వడం, ఏడాదిలో నైపుణ్యశిక్షణ పేరుతో రూ.12కోట్లు ఖర్చు చూపడం వంటి పలు అంశాలపై పరిశీలించారు. ఆ తర్వాత డెయిరీ ఛైర్మన్ ఆనంద్‌కుమార్ భాజపాలో చేరారు. కమిటీ మరోసారి పరిశీలిస్తుందని, త్వరలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తామని చెప్పినా జాప్యమవుతోంది. వైకాపా హయాంలో నాలా పన్ను రూ.680కోట్ల మేర ఎగవేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీనిపై విజిలెన్స్ ఆరా తీసినా నివేదికలు సిద్ధం చేయలేదు. భీమిలిలో విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి సీఆర్‌జెడ్ నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో తీరంలో ఆక్రమణలపై నిపుణుల కమిటీ వేసి నివేదికలివ్వాలని హైకోర్టు ఆదేశించింది.

తెర వెనుక పెద్దలెవరో తేల్చితే: నిషిద్ధ జాబితా (22ఏ) నుంచి తొలగించిన భూముల (ఫ్రీహోల్డ్) వ్యవహారంలో ఉత్తరాంధ్రలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయి. జీవో విడుదల కాకముందే కొందరు రైతుల నుంచి ఎసైన్డ్ భూములు కొనేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వంలోని కీలక అధికారిపైనా, ముఖ్య నేతలపైనా ఆరోపణలొచ్చాయి. విశాఖలో ఆనందపురం, భీమిలి, పద్మనాభం, విజయనగరం జిల్లాలో భోగాపురం మండలాల పరిధిలో ఎక్కువగా ఒప్పందాలు సాగాయి. 2023 డిసెంబరు నుంచి 2024 మే 9న ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు 136 ఎకరాల ఫ్రీహోల్డ్ భూములు రిజిస్ట్రేషన్ అయి చేతులు మారాయి. ఇంకా వందల ఎకరాలపై అగ్రిమెంట్లు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రాగానే ఆ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపి వేసి విచారణకు ఆదేశించినా... తెరవెనుక మంత్రాంగం సాగించిన పెద్దలెవరో తేలలేదు.

**ఓవైపు ఇలా.. మరోవైపు మంజూరా?**

గత వైకాపా హయాంలో విశాఖలో రూ.1,800కోట్ల విలువైన 700పైగా టీడీఆర్ బాండ్లు మంజూరు చేశారు. సిరిపురం వద్ద సీబీసీఎన్సీ స్థలంలో వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ నిర్మిస్తున్న ప్రాజెక్టు వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు పేరుతో రూ.63కోట్ల టీడీఆర్ కట్టబెట్టారు. రేవెళ్లపాలెం రోడ్డును పదిహేనేళ్ల కిందట అభివృద్ధి చేస్తే, అందులో స్థలాలు కోల్పోయామంటూ కొందరు వైకాపా నేతలు చక్రం తిప్పి రూ.209కోట్ల బాండ్లపై కన్నేశారు. మురికివాడల్లో సైతం వదలకుండా బాండ్లు మంజూరు చేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం వీటిపై విజిలెన్స్, సీఐడీ విచారణకు ఆదేశించగా, సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. మరోవైపు... విచారణ జరుగుతున్న వివాదాస్ప బాండ్ల వ్యవహారంలో కొందరు కూటమి నాయకులతో వైకాపా నేతలు చేతులు కలిపారు. వాటి ఆమోదానికి దస్త్రాలు కదిలేలా చేస్తున్నారనేది చర్చనీయాంశంగా మారింది.

## అంతొద్దు.. తగ్గిస్తే మేలు!

అనకాపల్లి : రోజుకు ఒక చెంచా పరిమాణంలో నూనె వాడితే ఆర్యోగం. అంటే నలుగురు కలిగిన ఒక కుటుంబం నెలకు రెండు లీటర్లలోపు వాడాలన్నమాట. మరి జిల్లాలో ఎంత వాడుతున్నారో తెలుసా? ఒక్కో కుటుంబం సగటున నాలుగు లీటర్లు వాడుతోంది. అంటే వాడాల్సి నదానికన్నా రెట్టింపు. మారుతున్న ఆహారపు అలవాట్ల కారణంగా ఏటా వినియోగం 2.5 నుంచి 2.75 శాతం పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏ వంట చేయాలన్నా తైలం తప్పనిసరి, ఎక్కువైన కొద్దీ ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధ వ్యాధుల బారినపడే ప్రమాదముంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగంలో పొదుపు పాటించాలని సూచిస్తున్నాయి. ఈ మేరకు



ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. నాలుగు నెలల క్రితం నిర్వహించిన మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ స్వయంగా ప్రతి ఇంటా వంటనూనె వినియోగాన్ని కనీసం పదిశాతం తగ్గించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన హెల్త్ బులెటటిన్ పవర్ ప్రజెంటేషన్‌లో వంట నూనె వినియోగం గణనీయంగా తగ్గించాలని సూచించారు.

జిల్లా జనాభా: 17.27 లక్షలు (2011 లెక్కల ప్రకారం)
ప్రస్తుత జనాభా: 18.10 లక్షలు (అంచనా)
కుటుంబాలు: 4.52 లక్షలు
నూనె వినియోగం సగటున నెలకు: 18 లక్షలు

## నాడు నిర్వాకం.. నేడు నిష్ఫలం

మునగపాక: గత వైకాపా ప్రభుత్వ పాలకుల అనాలోచిత నిర్ణయాల మూలంగా కోట్లాది రూపాయలు నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అవసరం లేకపోయినా భారీ స్థాయిలో నిర్మాణాలు చేపట్టారు. పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయక అసంపూర్తిగానే విడిచిపెట్టారు. అందుకు ఉదాహరణగా మునగపాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో రూ. 98 లక్షలతో చేపట్టిన నాడు-నేడు అభివృద్ధి పనులే నిలుస్తాయి. ఈ పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు 371 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. విద్యార్థులకు సరిపడా 19 గదులున్నా గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు రెండోవిడతలో పది అదనపు భవనాల నిర్మాణానికి రూ. 1.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. భవనాల నిర్మాణానికి పాఠశాలలో స్థల సమస్య ఏర్పడింది. ముందు ఐదు తరగతి గదుల నిర్మాణం



చేపట్టారు. ప్రభుత్వమే సిమెంటు సరఫరా చేసేది. తరగతి గదులకు శ్లాబ్ వేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. భవన నిర్మాణ కోసం సరఫరా చేసిన వందలాది సిమెంటు బస్తాలు గడ్డకట్టి పాడైపోయాయి. మరోవైపు ఏడాదిగా భవనాలు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి.

గత ప్రభుత్వం నిధులు పూర్తిగా ఇవ్వకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో నిల్వ ఉండి గడ్డకట్టిన సిమెంటు బస్తాలు ఈ పాఠశాలకు చెందినవి కావు.
శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు

నిర్మాణ పనులకు నిధులకు బదులు సిమెంటు మంజూరు చేయడం... పనులు సకాలంలో పూర్తి చేయకపోవడం వల్ల మునగపాక పాఠశాలతోపాటు జిల్లాలో పలుచోట్ల భవనాల సిమెంటు గడ్డకట్టి పాడైపోయింది. నిధులు మంజూరైన మేరకు పనులు చేశాం.
చంద్రరావు, సమగ్ర శిక్షా అభియాన్ ఏఈ

## ఎత్తిపోయిందోచ్..!

పుత్తూరు : పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ గోదాములో జరిగిన రేషన్ బియ్యం కుంభకోణం నీరుగార్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది సెప్టెంబరు 25న పౌర సరఫరాల శాఖ అధికారుల తనిఖీల్లో 205 టన్నుల రేషన్ బియ్యం పక్కదారి పట్టినట్లు తేలింది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు రంగంలోకి దిగి సీఎస్ డీటీని అరెస్టు చేసి చేతులు దులుపుకోవడంపై విమర్శలు ఉన్నాయి. పుత్తూరు, పిచ్చాటూరు గోదాం సీఎస్ డీటీగా ఉన్న విష్ణు 205 టన్నుల రేషన్ బియ్యం గోదాము నుంచి నేరుగా అక్రమార్కులకు అమ్మేశారు. రూ.2.05 కోట్లు అవినీతి జరిగినట్లు నిగ్గు తేల్చారు. పుత్తూరు పౌరసరాలశాఖ గోదాము పరిధిలో పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట మండలాలు, 109 చౌక దుకాణాలు ఉన్నాయి. ప్రతి నెలా వీటికి ఈ గోదాము నుంచి 25 వేల బస్తాల బియ్యం డీలర్లకు అందజేస్తుంటారు. ఈ క్రమంలోనే అవినీతి చోటుచేసుకుంది. దీనిపై సివిల్ సప్లైస్ డీఎం సుమతి గతేడాది అక్టోబర్ 12న పోలీసులకు ఫిర్యాదు చేయగా డీటీ విష్ణును అరెస్టు చేశారు. ఆ తర్వాత కేసులో పురోగతే లేదు. ఈ అక్రమాల్లో కడప, నగరికి చెందిన నలుగురు ఉన్నట్లు విలేకరుల సమావేశంలో పోలీసులు ప్రకటించినా నేటికీ చర్యలు శూన్యం.

**అంతా గోప్యమే..**

పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు హడావుడి చేసే అధికారులు రూ.2.05 కోట్లు బియ్యం పక్కదారి పట్టిన విషయాన్ని చాలా గోప్యంగా ఉంచారు. ఇదంతా వారికి తెలిసే జరిగి ఉంటుందని, ఒక్క సీఎస్ టీడీని బలిపశువును చేసి మిగిలిన వారు తమకేమీ సంబంధం లేనట్లు తప్పుకొన్నారనే విమర్శలున్నాయి. అక్రమార్కులు తమ పలుకుబడితో పోలీసు అధికారులపై ఒత్తిడి తెచ్చి కేసు నీరుగార్చారనే ప్రచారం జరుగుతోంది.

## విశిష్టత తెలిసేలా.. పర్యాటకానికి అద్దం పట్టేలా..






అనంతపురం: జిల్లా సంస్కృతి, వారసత్వ సంపద, పర్యాటక ప్రదేశాలు, వనరులను తెలియజేస్తూ అధికారులు కాఫీ టేబుల్ బుక్ రూపొందించారు. తక్కువ సమయంలో జిల్లా స్వరూపాన్ని అర్థం చేసుకునేలా వివరాలను పొందుపరిచారు. అధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను చెబుతూనే జిల్లా ఆర్థిక, సామాజిక అంశాలతో పాటు మౌలిక వసతులు, అభివృద్ధిపై పుస్తకంలో వివరించారు. జిల్లాకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడంతో పాటు.. ఆసక్తిని పెంచాలనే లక్ష్యంతో తీర్చిదిద్దారు. వివిధ ప్రాంతాల విశిష్టతను తెలిపే ఫొటోలను పుస్తకంలో పొందుపరిచారు. జిల్లా పర్యాటకశాఖ ద్వారా ఈ పుస్తకాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నారు.

**పర్యాటకులను ఆకర్షించేలా..**

జిల్లాలోని పెన్నహోబిలం, బుగ్గరామలింగేశ్వర స్వామి, చింతల వెంకటేశ్వరస్వామి... తదితర పుణ్యక్షేత్రాలు, రాయదుర్గం, గుత్తి, కుందుర్పి కోటల విశేషాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. యాడికి, పంపనూరు, బూదగవి ప్రాంతాల్లో ఆదిమానవుల ఆనవాళ్ల చిత్రాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. జైన సంస్కృతిని ప్రతిబింబించే జంబూద్వీపం, నగరంలోని టవర్ క్లాక్, పురావస్తుశాఖ మ్యూజియం వివరాలను పొందుపరిచారు.

**అవకాశాలను వివరిస్తూ..**

జిల్లాలోని భారీ పరిశ్రమలు, వాటి ఉత్పత్తి సామర్థ్యం వివరాలను సంక్షిప్తంగా ఇచ్చారు. పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి రంగంలో జిల్లా సాధించిన ప్రగతిని వివరించారు. ఉద్యాన పంటల సాగులో రైతులు సాధించిన విజయాలు, భవిష్యత్తులో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ఉన్న అవకాశాలను పుస్తకంలో పొందుపరిచారు. పర్యాటకులను ఆకర్షించడంతో పాటు జిల్లాలో పెట్టుబడులు పెట్టేవారికి ఆసక్తి కలిగించేలా కాఫీ టేబుల్ పుస్తకాన్ని రూపొందించినట్లు అనంతపురం కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

## దేవుడి మాన్యం మాయం



పత్తికొండ: దేవుడి మాన్యాన్ని చెరబట్టారు... ప్రభుత్వ స్థలాన్ని కాజేశారు.. ఎంచక్కా గదులు నిర్మించారు.. అద్దెలు తీసుకుంటున్నారు.. టవర్ల ఏర్పాటుకు లీజుకిచ్చారు.. తుగ్గలిలో గత ఐదేళ్లుగా వైకాపా నేతల ఆగడాలివి. రెవెన్యూ దస్త్రాల్లో దేవాదాయ, ఇనాం భూములుగా ఉన్న వాటినీ ఆక్రమించి అనుభవిస్తున్నారు. సర్వే నంబర్లు 604/ఎ1, 605/ఎ1, 605/ఎ2, 604/బి1, 605/బితో పాటు మరికొన్ని సర్వే నంబర్లలోని 22 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. ఈ విషయమై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దారుకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. నేటికీ ఎలాంటి చర్యలు లేవు. తుగ్గలి గ్రామంలోని ఆర్‌అండ్‌బీ స్థలాన్ని వైకాపా నాయకులు ఆక్రమించుకొని దుకాణ సముదాయాలు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారనేది బహిరంగ రహస్యమే. ఎవరికి వారు ఆయా శాఖల అధికారులు మాత్రం చర్యలు చేపట్టకుండా ఆక్రమణల తతంగం చూస్తూ ఉండిపోతున్నారు. పత్తికొండ- గుత్తి ప్రధాన రహదారి పక్కన స్థలానికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇక్కడ ఆర్‌అండ్‌బీ శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు రావడంతో సంబంధిత శాఖ అధికారులు సర్వే చేపట్టారు. వారి స్థలం ఎక్కడి వరకు ఉందో గుర్తిస్తూ రంగులతో మార్కు వేశారు. అక్కడి వరకు తమ పరిధి అని వారు ఆక్రమణదారులకు తాఖీదులు జారీ చేశారు. రహదారులు భవనాల శాఖ పరిధిలోని స్థలంలోనే సెల్ టవర్లు ఏర్పాటు చేసి నిర్వాహకుల నుంచి వైకాపా నాయకులు అద్దెలు వసూలు చేయడంపై స్థానికులు అభ్యంతరం చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలదారులపై ఎలాంటి చర్యలు లేవని వారు ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు, భూములు అన్యాక్రాంతం కావడంపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.“ దేవాదాయ భూములతో పాటు, ప్రధాన రహదారి ఆక్రమించి అద్దె గదులు నిర్మించుకున్నారు. అడ్డగోలుగా అద్దెలు వసూలు చేస్తున్నారు. గ్రామస్థులు ఫిర్యాదు చేసినా.. అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఆక్రమణదారులపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి. లేదంటే పోరాటం కొనసాగిస్తామని” – తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు.

## చెరువులు వెలవెల.. పల్లెలు విలవిల!

ఉండి : భరించలేని ఉక్కపోత.. వేడిగాలులతో అల్లాడుతున్న గ్రామీణ ప్రజలు ఇప్పుడు తాగునీటి కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. పల్లెల్లోని ప్రధాన చెరువులు అడుగంటిపోవడమే దీనికి ప్రధాన కారణం. కొన్ని చోట్ల రక్షిత నీటి పథకాల ఫిల్టర్ బెడ్ల వద్ద ఇంజిన్లకు నీరందని పరిస్థితులు నెలకొన్నాయి. కాలువలకు పూర్తి స్థాయిలో నీరొచ్చి చెరువులను నింపాలంటే మరో వారం పది రోజుల సమయం పడుతుందని.. అప్పటి వరకు ఎలా ముందుకెళ్లాలో తెలియని దుస్థితిని పంచాయతీల పాలకవర్గాలు ఎదుర్కొంటున్నాయి.

ఉండి మండలం మహదేవపట్నంలో అడుగంటిన మంచినీటి చెరువు ఇది. రెండున్నర దశాబ్దాల నుంచి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. నీటి మట్టం తగ్గిపోవడంతో కొద్ది రోజుల నుంచి ఒక్క పూటే సరఫరా చేస్తున్నారు. శనివారం నాటికి నీరు బాగా అడుగంటడంతో ఇంజిన్లకు అందని పరిస్థితి ఎదురైంది. చెరువు నీటిని ట్యాంకర్లతో తెచ్చి సంపు నింపుతున్నారు.



**మొరాయిస్తున్న ఫిల్టర్‌బెడ్లు**

జిల్లాలోని 20 మండలాల్లో 328 మంచినీటి చెరువులున్నాయి. మొగల్తూరు, పెంటపాడు, పెనుమంట్ర మండలాల్లోని నాలుగు చెరువుల్లో జలాలు 30 రోజులకే నిండుతున్నాయి. పూర్తిస్థాయిలో నింపితే 41 రోజులకే సరిపడే జలాలను నిల్వ చేసే చెరువులు 100 వరకు ఉన్నాయి. 45 రోజులకు సరిపడే చెరువులు మరో 50 వరకు ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటన్నింటిల్లో నీటి నిల్వలు ఇప్పుడు బాగా తగ్గిపోవడంతో ఫిల్టరు బెడ్లు మొరాయిస్తున్నాయి. ఈ నెల ఒకటో తేదీనే కాలువలకు నీటి సరఫరాను ప్రారంభించడంతో దాహం ఇబ్బందుల నుంచి గట్టెక్కుతామని ఆశించారు. కానీ ఎగువ ప్రాంతాల్లో నిర్వహణ పనుల కోసం నీటి సరఫరాను పెంచకపోవడంతో ఎక్కడ చెరువులను నింపే పరిస్థితి లేదు.

**9 నుంచి సరఫరా పెంపు**

కాలువల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. పలు ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడిన అంశం మా దృష్టికి వచ్చింది. చెరువులు నింపేందుకు వీలుగా ఈ నెల 9వ తేదీ నుంచి కాలువలకు నీటి సరఫరా పెంచుతాం. సుబ్రహ్మణ్యేశ్వరరావు, జల వనరుల శాఖ ఈఈ (శెట్టిపేట)

## నమోదుకూ పెళ్లి నడకే!

పెనుగొండ: ఏడడుగుల బంధంతో ఒక్కటవుతున్న వారిలో చాలామంది రిజిస్ట్రేషన్ విషయంలో శ్రద్ధ వహించడం లేదు. నగరపాలక పరిధిలో వివాహం చేసుకుంటే కార్పొరేషన్‌ల్లో, గ్రామీణ, మండల పరిధిలోని గ్రామాల్లో అయితే పంచాయతీల్లో 90 రోజుల్లో నమోదు చేసుకోవాలి. కానీ.. కొత్త జంటలు పెళ్లి తంతు అయిన వెంటనే ఆ విషయమే మరిచిపోతున్నారు. దీని వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

**ఏమి జత చేయాలంటే..** దరఖాస్తుతో శుభలేఖ, పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడి పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాల నకళ్లు జత చేయాలి. పదో తరగతి చదివితే మార్కుల జాబితా ఉండాలి. వీటితో కలిపి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రూ.500 ఫీజు చెల్లిస్తే ధ్రువపత్రం పరిశీలించి గంటలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రం పొందవచ్చు. దంపతుల తరపున ముగ్గురు సాక్షి సంతకాలు చేయాలి.



**ప్రయోజనాలివే..** ఉద్యోగులు తమ భార్య లేక భర్తను నామినీగా నమోదు చేయాలన్నా, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా, విదేశాలకు వెళ్లే దంపతులకు పాస్‌పోర్టు, వీసా, వర్క్ పర్మిట్, బీమా వంటివి కావాలంటే వివాహ ధ్రువపత్రం అవసరం. దంపతుల మధ్య విభేదాలు వచ్చి పోలీసు కేసులు నమోదైనప్పుడు కోర్టులో సాక్ష్యంగా చూపడానికి ఉపయోగపడుతుంది. పెనుగొండ, ఆచంట, పాలకొల్లు, మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని పట్టణ, గ్రామాల్లో ఉన్న కల్యాణ మండపాలు, ఆలయాలు, షాదీఖానాలు, చర్చిలు, ఇళ్లలో ఏటా వేల సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. కానీ.. గత 17 నెలల్లో చూస్తే కేవలం 2,887 వివాహాలు మాత్రమే నమోదయ్యాయి. ‘భవిష్యత్తులో వివాహ ధ్రువపత్రం ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. ఎక్కువ మంది అవగాహన లేక రిజిస్ట్రేషన్ చేయించుకోవడం లేదని’ పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ ఎండీ అహ్మద్ అలీ చెప్పారు.

## భావి తరానికి విలువల విద్య

కాళ్ల: భావితరానికి విద్యతో పాటు విలువలు, మన సంస్కృతి, సంప్రదాయాలు నేర్పి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భీమవరం సమీపాన పెదఅమిరంలో ఉన్న వివేకానందం సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద శిష్యుల్లో ఒకరైన సోదరి నివేదిత పేరిట ఈ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరులోని శారదామఠం అధ్యక్షురాలు ప్రవ్రాజిక భవానీ ప్రాణ మాతాజీ ‘నివేదిత విద్యాలయ’ను ప్రారంభిస్తారని వివేకానంద సేవా సమితి సంస్థ ప్రతినిధి శివవర్మ తెలిపారు. ఆదివారం పీఠం మాతాజీలు ప్రవ్రాజిక త్యాగనిష్ఠ ప్రాణ, ప్రవ్రాజిక దివ్యాత్మప్రాణ ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**పేద విద్యార్థులకు ప్రాధాన్యం** పెదఅమిరరంలోని సేవాసమితి భవనం ప్రాంగణంలో సుమారు 40 సెంట్ల విస్తీర్ణంలో ఈ పాఠశాలను నిర్మించారు. ఎల్‌కేజీ నుంచి 7వ తరగతి వరకు 30 మంది చొప్పున 270 మంది విద్యార్థినులకు ప్రవేశాలు కల్పించారు. ఎంపికలో అల్పాదాయ వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

## డేటింగులు పరిణతితో ఆలోచించేలా చేసాయి: సారా అలీఖాన్

బోయ్ ఫ్రెండ్ ని ఎలా ఎంపిక చేసుకోవాలో నేటితరం అమ్మాయిలకు తెలిసింది తక్కువే. అయితే అలాంటి వారికి సారా అలీఖాన్ ఇచ్చిన సలహాలు చాలా రకాలుగా సహకరిస్తాయి. ఇంతకీ సారా ఏం చెప్పింది? అంటే.. తన గతానుభవాల నుంచి అసలు బోయ్ ఫ్రెండ్ ని అమ్మాయిలు ఎలా అర్థం చేసుకోవాలో చక్కగా చెప్పింది. కొంత విరామం తర్వాత అనురాగ్ బసు %-%మెట్రో ఇన్ డినో%-%తో సారా తిరిగి తెరపైకి వచ్చింది. ప్రజాదరణ పొందిన లైఫ్ ఇన్ ఎ మెట్రోకు ఇది సీక్వెల్. ఈ సీక్వెల్ లో సారా నటనకు ప్రశంసలు కురుస్తున్నాయి. తాజా ఇంటర్వ్యూలో తాను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నానని సారా చెప్పింది. మోడ్రన్ లవ్ అనేక సమస్యలతో కూడకున్నదని సారా చెప్పింది. నేడు ప్రేమకు కొరత ఉందని కూడా అంది. తన గత సంబంధాలు తనను పరిణతి ఉన్న అమ్మాయిగా తయారు చేసాయని చెప్పింది. అలాగే ప్రేమ భాష గురించి సారా ఆసక్తికరంగా వివరించింది. నిజానికి ప్రేయసి- ప్రియుడు వారి భావాలను వ్యక్తపరిచే విధానం వేరుగా ఉంటుంది.



ప్రతి ఒక్కరికి వారి సొంత మార్గాలు ఉంటాయి. మీ ప్రేమ భాష మీ భాగస్వామి సరిపోలకపోవచ్చు. కానీ ఎవరికి వారు తమకు తెలిసిన మార్గంలో తమ వంతు కృషి చేస్తున్నారని అర్థం చేసుకోవాలి అని సారా అన్నారు. అయితే తన పాత బోయ్ ఫ్రెండ్స్ ని పోలి ఉండని వ్యక్తి కోసం వెతుకుతానని సారా చెప్పింది. భాగస్వాములు ఆర్థికంగా ఖర్చు విషయంలో షేర్ చేసుకోవాలని కూడా సారా తెలిపింది. ఏదైనా డేటింగ్ యాప్‌లలో ఉన్నారా? అని ప్రశ్నించగా, తాను ఎప్పుడూ డేటింగ్ యాప్‌ను ఉపయోగించలేదని కొందరు ఉపయోగించడం బాగానే ఉన్నా కానీ ప్రతిదీ డిజిటల్‌గా మారిన ప్రపంచంలో, భాగస్వామిని కలవడం కూడా డిజిటల్‌గా మారితే అది నాకు సరదా ఇవ్వదు! అని సారా చెప్పింది. సారా చెబుతున్న దానిని బట్టి తనతో డేటింగ్ చేసిన సుశాంత్ సింగ్ రాజ్ పుత్, కార్తీక్ ఆర్యన్ గురించి రాంగ్ సైడ్ చెబుతున్నట్టే అనిపిస్తోంది.

## అనుపమ బౌన్స్ బ్యాక్ ఛాన్సులు..!

మలయాళ భామ అనుపమ పరమేశ్వరన్ తెలుగులో స్టార్ హీరోయిన్ గా అయ్యే ఛాన్స్ లు కనిపించినా అమ్మడు చేసిన కొన్ని సినిమాల వల్ల గ్రాఫ్ పడిపోయింది. మొదట్లో అనుపమని చూసి టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందన్న టాక్ వినబడింది. కానీ అమ్మడు మాత్రం ఎందుకో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. తెలుగులో రెండేళ్ల క్రితం ఈగల్ సినిమాలో నటించిన అనుపమ ఆ తర్వాత పెద్దగా ఛాన్స్ లు అందుకోలేదు. లాస్ట్ ఇయర్ వచ్చిన టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ అయినా కూడా అనుపమకి ఏమాత్రం లాభం చేకూరలేదు. ఆ తర్వాత అసలు అవకాశాలన్న మాటే రాలేదు. ఐతే తెలుగులో కాస్త గ్యాప్ రాగా.. ఈ గ్యాప్ లో తమిళ్ లో సినిమాలు చేస్తూ వచ్చింది అనుపమ. రీసెంట్ గా అమ్మడు డ్రాగన్ సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. కానీ ఆ సినిమాలో అనుపమ కన్నా మరో హీరోయిన్ గా నటించిన కయదు



లోహార్ కి ఎక్కువ క్రేజ్ వచ్చింది. ఐతే తెలుగులో అనుపమ కెరీర్ ఇక దాదాపు ముగిసింది అనుకునేలోగా మళ్లీ వరుస ఛాన్స్ లు అమ్మడి తలుపు తడుతున్నాయి. అనుపమ ఇప్పటికే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా చేస్తున్న కిష్కింధపురి సినిమాలో హీరోయిన్ గా నటిస్తుంది. కొన్నాళ్లుగా సెట్స్ మీద ఉన్న ఈ సినిమాకు టైటిల్ లాక్ చేసి ఒక పోస్టర్ కూడా వదిలారు. ఆల్రెడీ అనుపమ సాయి శ్రీనివాస్ తో రాక్షసుడు సినిమా చేసింది. ఆ సినిమా సక్సెస్ అందుకుందని తెలిసిందే. మరోపక్క యువ హీరో ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ తో కూడా లక్కీ ఛాన్స్ పట్టేసింది అనుపమ. శర్వానంద్ సంపత్ నంది కాంబినేషన్ లో వస్తున్న పీరియాడికల్ సినిమాలో అనుపమ హీరోయిన్ గా ఓకే అయ్యింది. ఈమధ్యనే ఓదెల 2 తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంపత్ నంది. ఈసారి తన డైరెక్షన్ లో సినిమాతో ఆడియన్స్ ని అలరించడానికి రెడీ అయ్యాడు. సంపత్ నంది శర్వానంద్ కాంబో సినిమా 1965 కాలం నాటి కథతో వస్తుందని తెలుస్తుంది. సో పీరియాడికల్ కథ, క్రేజీ కాంబినేషన్ కాబట్టి ఇది అనుపమకి కలిసి వచ్చేలా ఉందని చెప్పొచ్చు. అనుపమ మాత్రం తిరిగి మళ్లీ తన ఫాం కొనసాగించాలని చూస్తుంది. ఈ ప్రయత్నంలో అమ్మడికి ఎలాంటి ఫలితాలు అందుతాయన్నది చూడాలి.




## గుడ్ వైఫ్ వెబ్ సీరీస్ టాక్ ఏంటి..?



వెండితెర మీద కోర్ట్ లీగల్ డ్రామా సినిమాలకు కాస్త డిమాండ్ తక్కువే కానీ ఓటీటీల్లో మాత్రం ఏదో ఒక భాషలో ఇలాంటివి వస్తూనే ఉన్నాయి. వాటిని ఓటీటీ ఆడియన్స్ ఆదరిస్తూనే ఉన్నారు. లేటెస్ట్ గా ప్రియమణి ప్రధాన పాత్రలో గుడ్ వైఫ్ అంటూ మరో కోర్ట్ డ్రామా వచ్చింది. జియో హాట్ స్టార్ లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సీరీస్ ని ఒకప్పటి హీరోయిన్ రేవతి తెరకెక్కించారు. మరి ఈ వెబ్ సీరీస్ టాక్ ఏంటన్నది చూద్దాం. గుణ శీలన్ ఒక అడిషనల్ అడ్వకేట్ జనరల్ గా చేస్తుంటాడు.. ఆయన భార్య తరుణిక తో ఎంతో ప్రేమగా ఉంటాడు. ఆదర్శ దంపతులు అంటే వీళ్లే అనేలా వీరిద్దరు ఉంటారు. ఐతే సెక్స్ కుంభకోణంలో గుణ శీలన్ జైలు పాలవడంతో చాలా అవమానాలు ఎదుర్కొంటారు. ఐతే ఆరోపణల్లో ఎంత నిజం ఉందో తెలియకుండానే గుణ శీలన్ ను దూరం పెడుతుంది. ఐతే ఫ్రెండ్ సాయంతో తను కూడా అడ్వకేట్ గా జాయిన్ అవుతుంది. తన భర్త కోసం న్యాయ పోరాటం చేసేందుకు వచ్చిందని అనుకుంటారు.. ఇంతకీ తరుణిక ఏం చేసింది..? తన భర్త గుణని జైలు నుంచి బయటకు వచ్చాడా లేదా..? తరుణిక ఏం చేసింది అన్నది గుడ్ వైఫ్ వెబ్ సీరీస్ కథ. సినిమాల్లో కోర్ట్ రూమ్ డ్రామా అంటే సినిమా రన్ టైం లోపు ముగించాలి కాబట్టి తీయాల్సిన సీన్స్ అన్నీ స్పీడ్ గా లాగిస్తారు. కానీ వెబ్ సీరీస్ లో అయితే వాటిని వివరణాత్మకంగా ఉంచుతారు. గుడ్ వైఫ్ వెబ్ సీరీస్ లో కూడా చాలా విషయాలను చూపించారు. గుడ్ వైఫ్ వెబ్ సీరీస్ మొత్తం 6 ఎపిసోడ్స్ తో వచ్చింది. తెలుగుతో పాటు తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ, బెంగాలిలో భాషలో కూడా అందుబాటులో ఉంది. కోర్ట్ రూమ్ డ్రామా లో సాగే వాద ప్రతివాదనల్లో పోటా పోటీ ఉంటుంది. కొన్ని సీన్స్ లో సీరీస్ ఇంప్రెస్ చేస్తుంది. ఐతే మొదలు పెట్టడం ఆసక్తికరంగా ఉన్నా తర్వాత తర్వాత ఆసక్తి పోగొట్టేలా ఉంది. తరుణిక భర్త కేసుని పక్కన పెట్టి మిగతా విషయాల మీద ఎక్కువ దృష్టి పెడుతుంది. అసలు ఒకానొక దశలో ఆమె న్యాయవాదిగా మారింది ఎవరి కోసం అనే డౌట్ వస్తుంది. ఐతే కొన్ని అంశాలు మరీ తేలికగా చూపించారు. అందులో గుణ బెయిల్ లాంటిది ఒకటి. మొత్తానికి ఈ సీరీస్ ఇంకాస్త గ్రిప్పింగ్ తో చేసి ఉంటే తప్పకుండా అలరించేది. ఐతే కోర్ట్ రూం డ్రామాస్ ఇష్టపడే వారికి ఇది కాస్త పర్వాలేదనిపిస్తుంది.

## ఢీ అంటే ఢీ: 'వార్ 2' కథేంటో తెలుసా?



భారతీయ సినిమా హిస్టరీలో నెవ్వర్ బిఫోర్ అనిపించే కాంబినేషన్‌తో యష్ రాజ్ ఫిలింస్ రూపొందిస్తున్న 'వార్ 2' ఈ ఏడాది మోస్ట్ అవైటెడ్ కేటగిరీలో విడుదలకు సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. సౌత్ సూపర్ స్టార్ ఎన్టీఆర్, నార్త్ సూపర్ స్టార్ హృతిక్ రోషన్ కలయికలో అత్యంత భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ఇది. 'బ్రహ్మాస్త్ర' ఫేం అయాన్ ముఖర్జీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. వార్ 2 లో ఎన్టీఆర్, హృతిక్ ఒకరికొకరు ఎదురు పడితే నువ్వా నేనా? అంటూ బాహాబాహీకి దిగుతారని, నెవ్వర్ బిఫోర్ అనిపించే ట్రీట్ అభిమానులకు అందిస్తున్నామని ఊరించారు తప్ప అసలు ఈ సినిమా కథాంశం ఏమిటన్నది ఇంతవరకూ లీక్ చేయలేదు. తాజాగా అమెరికన్ ఆన్ లైన్ టికెటింగ్ వెబ్ సైట్ ఫండగో 'వార్ 2' కథాంశాన్ని లీక్ చేసింది. భారతదేశానికి అత్యంత ప్రమాదకారిగా మారిన ఏజెంట్ కబీర్ ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు నియమితుడైన ఏజెంట్ విక్రమ్ స్టోరి ఏమిటన్నదే ఈ సినిమా. విక్రమ్ పాత్రలో ఎన్టీఆర్ నటించాడు. ఏజెంట్ కబీర్ తో సమాన హోదా ఉన్న ఆఫీసర్ విక్రమ్. పరిస్థితులు అదుపుతప్పుతున్న క్రమంలో భారత స్పై ఏజెన్సీ అతడిని రంగంలోకి దించుతుంది. అతడు తన క్రూరమైన, రాక్షసత్వంతో కూడుకున్న టీమ్ తో ఆపరేషన్ లోకి దిగుతాడు. అదే క్రమంలో కబీర్ వర్సెస్ విక్రమ్ ఎపిసోడ్స్ ఎలుకా పిల్లి ఆట ఏమిటన్నది తెరపై చూడాల్సిందేనని సదరు వెబ్ సైట్ కథను లీక్ చేఇసంది. ఛేజ్‌లు, స్టంట్స్ తో పాటు రక్తపాతం భీభత్స వాతావరణం తెరపై ఆవిష్కృతమైందని చెబుతున్నారు. యుద్ధ భూమిలో అత్యంత క్రూరమైనవాడిగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ విరుచుకుపడుతుంటాడు. అతడిని చూస్తే టెర్మినేటర్ గుర్తుకు వస్తాడు! అంటూ ఫండగో తన కథనంలో వెల్లడించింది. మొత్తానికి వార్ 2లో హృతిక్ ని ఢీకొట్టే ధీటైన వాడిగా తారక్ ని అభిమానులు చూడబోతున్నారని ఈ కథనం రివీల్ చేసింది. వార్ 2 ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా విడుదలవుతోంది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్ లో అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రంగా ఇది రూపొందుతోంది.

## పూజా హెగ్దేకి అదృష్టం పట్టినట్టేనా..?

బుట్ట బొమ్మ పూజా హెగ్దేకి సౌత్ లో అవకాశాలు లేవు లేవు అనుకుంటూ ఉన్నారు. తెలుగులో ఆమెకు ఆఫర్లు లేవు కానీ అమ్మడికి తమిళంలో మాత్రం వరుస ఛాన్స్ లు వస్తున్నాయి. పూజా హెగ్దే ప్రస్తుతం దళపతి విజయ్ తో జన నాయగన్ సినిమా చేస్తుంది. విజయ్ తో ఆల్రెడీ బీస్ట్ సినిమాలో నటించింది పూజా హెగ్దే. మళ్లీ జన నాయగన్ తో ఆ ఛాన్స్ అందుకుంది. విజయ్ సినిమా తర్వాత ధనుష్ నెక్స్ట్ సినిమాలో కూడా బుట్ట బొమ్మ లక్కీ ఛాన్స్ పట్టేసిందని తెలుస్తుంది. విఘ్నేష్ రాజా డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ కి జతగా పూజా బేబీ నటిస్తుంది. విజయ్ తో సినిమా ఆ నెక్స్ట్ ధనుష్ తో ఛాన్స్ పూజా హెగ్దేకి కోలీవుడ్ లక్కీగా మారింది. ఇక ఇదే కాదు కాంచన 4 లో కూడా పూజా హెగ్దే చేస్తుంది. అది ఆల్రెడీ సెట్స్ మీద ఉంది. ఆల్రెడీ సూపర్ స్టార్ రజినీకాంత్ చేస్తున్న కూలీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది పూజా హెగ్దే. ఆ సాంగ్ తోనే పూజా క్రేజ్ పెరుగుతుందని భావిస్తుండగా ఇప్పుడు వరుస అవకాశాలు



ఆమెను మరింత చర్చల్లో ఉంచేలా చేసింది. పూజా హెగ్దేకి తప్పకుండా ఈ అవకాశాలు మళ్లీ ఆమె కెరీర్ ని సరైన ట్రాక్ లోకి పెట్టేలా చేస్తాయని చెప్పొచ్చు. తెలుగులో స్టార్ రేంజ్ సంపాధించిన టైంలో తమిళ్ లో పెద్దగా అవకాశాలు రాబట్టలేని తెలుగులో ఛాన్స్ లు రాకపోయినా సరే తమిళ్ లో మాత్రం ఆమె బీభత్సమైన ఫాంలో ఉంది. రీసెంట్ గా అమ్మడు సూర్య హీరోగా నటించిన రెట్రో లో నటించింది. ఆ సినిమాలో పూజా బేబ్ డీ గ్లామర్ లుక్ తో కనిపించింది. ఐతే ఆ సినిమా ఆశించిన ఫలితం అందుకోలేకపోయినా పూజాకి మాత్రం కోలీవుడ్ లో వరుస ఆఫర్లు వచ్చేలా చేస్తున్నాయి. పూజా హెగ్దే గ్లామర్ షో చేస్తే ఆ సినిమాకు చాలా ప్లస్ అవుతుంది. ఐతే స్కిన్ షో తో ఎంతోకాలం కెరీర్ నిలబడదని కనిపెట్టిన పూజా హెగ్దే ఫైనల్ గా నటనా ప్రాధాన్యత ఉన్న సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేస్తున్న సినిమాలన్నీ కూడా అదే తరహాలో వస్తున్నట్టు తెలుస్తుంది. ఐతే వీటిలో ఏ సినిమా సూపర్ హిట్ అయినా పూజా హెగ్దే కి తమిళ్ లో మళ్లీ మళ్లీ అవకాశాలు తెచ్చేలా చేస్తాయని చెప్పొచ్చు.

## చీర కట్టులో కేతిక రొమాంటిక్..!

నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమాలో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటెం సాంగ్ చేసి అందరినీ నిజంగానే సర్‌ప్రైజ్ చేసిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. ఆమె కాస్ట్యూమ్స్, మేకోవర్, డాన్స్ స్టెప్పులు ఇలా ప్రతి ఒక్కటీ మాస్ ఆడియన్స్‌కి నచ్చాయి. కేతిక శర్మ హీరోయిన్‌గా కెరీర్ ఆరంభంలో మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్నప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో తక్కువ సమయంకే హీరోయిన్‌గా ఆఫర్లు లేకుండా పోయాయి. హీరోయిన్‌గా ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేదు. అయినా కూడా ఈమెకు సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు దక్కింది. ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే. సినిమాల్లో అందంగా కనిపించడంతో పాటు, నటనతో మెప్పించే కేతిక శర్మ సోషల్ మీడియాలో పూర్తి స్థాయిలో అందాల ఆరబోతతో ఆకట్టుకుంటూ ఉంది. అందంగా ఉండే కేతిక శర్మ సింపుల్ ఔట్ ఫిట్ నుంచి స్కిన్ షో చేసే ఔట్ ఫిట్ వరకు ఏ డ్రెస్‌లో కనిపించినా కూడా చూపు తిప్పుకోనివ్వని అందం ఈమెది అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా ఈమెకు మంచి ఎంట్రీ దక్కడానికి కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు. తాజాగా ఈమె ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



సాధారణంగానే హీరోయిన్స్ చీర కట్టు ఫోటోలను షేర్ చేస్తూ చూపు తిప్పుకోలేము. అలాంటిది కేతిక శర్మ వంటి అందగత్తె చీర కట్టుకుని, అందంగా కెమెరాకు ఫోజ్ ఇస్తున్న వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. సాధారణంగా ఫోటో స్టిల్స్ ను షేర్ చేస్తారు. కానీ ఈ అమ్మడు ఫోటో షూట్‌కి సంబంధించిన వీడియోను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతోంది. కేతిక శర్మ అందం గురించి గతంలో ఎన్నో సార్లు మాట్లాడుకునే ఉంటాం. అయినా కూడా ఈమె ఇలాంటి వీడియోలను, ఫోటోలను షేర్ చేసిన సమయంలో మరోసారి ఈమె అందం గురించి మాట్లాడుకోవాల్సిందే అనిపిస్తూ ఉంటుంది. నడుము అందం చూపిస్తూ కేతిక హొయలు పోతూ షేర్ చేసిన వీడియో ఆకట్టుకుంటూ ఉంది. చీర కట్టులో కేతిక శర్మ ఫోటోలు చాలా సార్లు షేర్ చేసింది. అయితే ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంటుంది. అందమైన ఫోటోలు, వీడియోలతో ఎప్పుడూ కేతిక శర్మ వార్తల్లో నిలుస్తున్న కారణంగా కచ్చితంగా ఈమెకు మరిన్ని ఆఫర్లు దక్కవచ్చు. ప్రస్తుతం రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నట్లు సమాచారం అందుతోంది. త్వరలోనే ఆ సినిమాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి అయ్యే అవకాశాలు ఉన్నాయి. హీరోయిన్‌గా ఈమె చివరిగా రంగ రంగ వైభవంగా సినిమాలో వైష్ణవ్ తేజ్‌కు జోడీగా నటించింది. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ బ్రో సినిమాలో కీలక పాత్రలో కనిపించింది. ఆ సినిమా తర్వాత ఒక హిందీ సినిమాను కూడా ఈమె చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536